సాక్షి 24|7
సిద్దిపేట
సోమవారం 1-1-2018

ఎన్సాన్‌పల్లిలోని గిరిజన బాలుర వసతిగృహంలో మంత్రి హరీశ్‌రావు శనివారం కొత్త సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థిని ఆయనతో సెల్ఫీ దిగుతూ.. ఇలా ఉద్వేగానికి గురైంది.





గోదావరి ఏరులై..

- జిల్లాలో జలాల గలగల చప్పుడు ప్రతిధ్వనించాలి
- 2017లో పరుగులు పెట్టిన అభివృద్ధి
- సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు
- రెట్టింపు ఉత్సాహంతో నూతన సంవత్సరంలోకి..
- రాష్ట్ర భారీ నీటిపారుదల, మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: 'కరువు కోరల్లో అల్లాడుతున్న తెలంగాణ ప్రజల కష్టాలు నాకు తెలుసు.. అందుకే గోదావరి నీళ్లు.. తెలంగాణ బీళ్లకు మళ్లించి, కోనసీమను మించినట్లు తెలంగాణను సస్యశ్యామలం చేయాలన్నదే నా తపన.. అందుకోసమే రాష్ట్రం ఏర్పడిన తర్వాత తడారిన బతుకుల్లో వెలుగు చూడాలని సాగు నీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ఇందులో భాగంగా చేపట్టిన మిషన్ కాకతీయ పనులకు మంచి ఫలితాలను వచ్చాయి. అయితే సకాలంలో వర్షాలు కురిస్తేనే చెరువులు నిండే పరిస్థితి ఉంది. అందుకోసమే గోదావరి జలాలు ఈ ప్రాంతానికి మళ్లించి.. రైతుల నీటి కష్టాలు తీర్చడమే నా లక్ష్యం.. ఈ ఏడాది కూడా అదే లక్ష్యంతో

- మిగతా 6లో ▶



- మనస్పర్థలు తలెత్తిన దంపతులకు కౌన్సెలింగ్ ఇస్తున్న కుటుంబ సలహా కేంద్రం
- ఉమ్మడి జిల్లాలో 516 కేసుల పరిశీలన
- 2017లో 68 కేసుల పరిష్కారం
- మాటపట్టింపులు వీడి ఒక్కటవుతున్న దంపతులు

కొత్త కాపురం

గజ్వేల్‌రూరల్: డిగ్రీ చదువుకున్న సిద్దిపేటకు చెందిన అమ్మాయికి.. ఇంటర్ చదువుకున్న దుబ్బాక మండలానికి చెందిన అబ్బాయితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లయిన తర్వాత అమ్మాయిని బీఎడ్‌టోపాటు పీజీ కూడా చదివించాడు. మూడేళ్ల వరకు ఆ దంపతులిద్దరూ బాగానే ఉన్నారు. ఈ సమయంలోనే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. భర్త తనను పట్టించుకోవడం లేదని.. అలనా పాలనా చూడడం లేదని ఆమె పేర్కొంటుండగా... భార్యపై అనుమానంతో వారిద్దరూ దూరమయ్యారు. వారికి ఏడాదిన్నర పాప ఉంది. విడిపోయిన భార్యాభర్తలు కోర్టులో కేసులు పెట్టుకోవడం, కోర్టు, లాయర్లు, మధ్యవర్తుల వద్ద పంచాయతీలు జరుగుతూనే ఉన్నాయి. ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబ సలహా కేంద్రం కౌన్సిలర్లు దూరమైన ఆ జంటకు, వారి కుటుంబసభ్యులకు మూడు నెలల క్రితం వివాహబంధంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఈ జంట వేరు కాపురం పెట్టి ప్రస్తుతం సిద్దిపేటలో నివాసముంటోంది. ఇలాంటివే మరెన్నో చిన్న చిన్న కారణాలు.. స్పర్థలు.. మాట పట్టింపులతో దూరమవుతున్న జంటలను కలుపుతోంది గజ్వేల్‌లోని కుటుంబ సలహా కేంద్రం. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఇక్కడికి వస్తున్న అనేక జంటలకు ఈ కేంద్రంలో కౌన్సెలింగ్ ఇచ్చి కాపురాలను నిలబెడుతున్నారు.

- ప్రత్యేక కథనం.. 8-9లో



పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కొమురవెల్లిలో భక్తుల సందడి

వివరాలు 16లో ▶

2018లో పీపుల్స్ ఫ్రెండ్లీ విధానం

- సమాజాభివృద్ధికి శాంతిభద్రతలే పునాది
- సీఎం చొరవతో పోలీస్ వ్యవస్థ బలోపేతం
- సమష్టి కృషితో పనిచేస్తాం
- 24/7 అందుబాటులో పోలీసుల సేవలు
- డీజీపీ మహేందర్‌రెడ్డి



మెయిన్‌లో ▶

పోలీస్ కమిషనరేట్‌లో సీసీ కెమెరాల పనితీరు పరిశీలిస్తున్న డీజీపీ

2018 నయా జోష్..





కొత్త సంవత్సరానికి గ్రాండ్ వెల్‌కమ్ చెప్పేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. ఏడాదంతా గుర్తుండేలా వేడుకలను ధూంధాంగా జరుపుకొనేందుకు ఎవరికివారు ప్లాన్ చేసుకున్నారు. కొంతమంది కుటుంబసభ్యులతో కలిసి రోజంతా సరదాగా గడిపేందుకు సిద్ధం అవగా.. ఇంకొందరు మిత్రులతో కలిసి ఎంజాయ్ చేసేందుకు రెడీ అయ్యారు. మరికొందరు పర్యాటక ప్రాంతాలకు వెళ్లి ఉత్సాహంగా సందడి చేసేందుకు సన్నద్ధమయ్యారు. ప్రత్యేక పూజలు.. ప్రార్థనలకు ఆలయాలు, చర్చిలు ముస్తాబయ్యాయి. మరోవైపు రంగులు.. కేక్‌ల కొనుగోళ్లతో ఆదివారం మార్కెట్లలో ఎక్కడ చూసినా కోలాహలం నెలకొంది.

- సాక్షి, నెట్‌వర్క్

వివరాలు 8-9లో ▶

రాష్ట్రంలో 'పేట' ఆదర్శం

- ప్రజల సహకారంతోనే సిద్దిపేట ప్రగతి
- కోట్లాది నిధులతో సిద్దిపేటలో ప్రగతి పరుగు
- రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: సిద్దిపేట ప్రజలు చాలా గొప్ప వారని, వారి సహకారం, సంపూర్ణ తోడ్పాటుతోనే పట్టణం నేడు రాష్ట్రంలోని మున్సిపాల్టీలకు రోల్ మోడల్‌గా నిలిచిందని, స్వచ్ఛసర్వేక్షణ్‌లో మొదటి విడత సర్వేలో సిద్దిపేట ఇప్పటికే రాష్ట్రంలోనే అగ్రగామిగా కొనసాగుతోందని, అభివృద్ధిలో భాగంగా కళాత్మక నిర్మాణం క్లాక్ టవర్‌ను పట్టణ ప్రజలకు న్యూ ఇయర్ కానుకగా అందిస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు వద్ద ఆదివారం క్లాక్ టవర్‌ను ఆవిష్కరించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 ఏళ్ల కిందట 10 కోట్లను సిద్దిపేటకు తీసుకురావాలంటే గగనమయ్యేదని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిధులకు కొదవ లేదన్నారు. మున్సిపాలిటీ ఎలా ఉండాలో సిద్దిపేటను చూసి తయారు చేసేలా మార్గదర్శకంగా నిలిచిందన్నారు. అందుకు పట్టణ ప్రజల సహకారం గొప్పదని, ఈ ఘనత ప్రజలకే చెందుతుందన్నారు. దేశవ్యాప్తంగా పట్టణాల, నగర పంచాయితీల పనితీరును విశ్లేసిస్తూ కేంద్రం స్వచ్ఛసర్వేక్షణ్ సర్వేను నిర్వహిస్తోందన్నారు. ఇప్పటికే సిద్దిపేట మెరుగైన స్థానంలో ఉందని, అందుకు ప్రజల సంపూర్ణ మద్దతు ఉందన్నారు. కోమటి చెరువు కింద మరో రూ.25 కోట్లతో చెరువు కింది భాగంలో బోటానికల్ పార్క్, రైతుబజారు, శిల్పారామాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. అడ్వెంచర్ పార్క్, రాక్ గార్డెన్, వాటర్ స్కేట్టింగ్, మల్లీప్లెక్స్ థియేటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. రూ.5 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్విమ్మింగ్ పూల్‌ను జనవరి 2వ వారంలో ప్రజలకు అంకితం చేయనున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, డీఆర్‌ఓ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ ముత్యంరెడ్డి, జనగామ, సిద్దిపేట జిల్లాల మహిళా శిశు సంక్షేమశాఖ కో ఆర్డినేటర్ విజయ, చైర్మన్ రాజనర్సు, వైస్ చైర్మన్ అక్తర్, కౌన్సిలర్లు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, బర్ల మల్లికార్జున్, గ్యాదరి రవి, చిప్ప ప్రభాకర్, మోహీజ్, పల్లె వెంకట్‌గౌడ్, బోనాల నర్సింలు, నాయకులు సికిందర్, రవీందర్‌రెడ్డి, బీమసేన పాల్గొన్నారు.


క్లాక్ టవర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

రంజీ మ్యాచ్‌లకు వేదిక సిద్దిపేట

- హెచ్‌సీఏ తోడ్పాటుతో మరింత కృషి
- గ్రామీణ క్రీడాకారులకు సర్కారు చేయూత
- రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు


బ్యాటింగ్ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: క్రికెట్ మంచి ఆట అని, హైదరాబాద్ వారికి మాత్రమే గతంలో అవకాశం ఉండేదని, కానీ గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్రీడా స్ఫూర్తి, ప్రతిభ కలిగిన క్రికెట్ క్రీడాకారులు ఉన్నారని, వారిని గుర్తించి మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని, భవిష్యత్‌లో సిద్దిపేట మినీస్టేడియం రంజీ మ్యాచ్‌లకు వేదికగా మార్చేందుకు ప్రయత్నిస్తానని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మినీస్టేడియంలో వెంకటస్వామి మెమోరియల్ క్రికెట్ టీ–20 టోర్నీని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సిద్దిపేటలో 8 జిల్లాల క్రీడాకారులకు సంబంధించి లీగ్ టోర్నీ నిర్వహణ జరగడం సంతోషంగా ఉందన్నారు. మరో 15 రోజుల్లో స్టేడియంలో ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేస్తామని, పట్టణంలో 60 రూములతో త్రీస్టార్ హోటల్ ఏర్పాటు జరగనుందన్నారు. దీంట్లో రంజీ క్రీడాకారులకు వసతులు కూడా ఉంటాయని, భవిష్యత్‌లో రంజీ మ్యాచ్‌లకు సిద్దిపేట కూడా వేదికగా మారే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారికి ఒక అవకాశం ఇవ్వాలని, గ్రామీణ ప్రాంతాలపై దృష్టి పెట్టాలని హెచ్‌సీఏకు సూచించారు. సిద్దిపేట మినీస్టేడియం అభివృద్ధికి హెచ్‌సీఏ పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు.

ఫైనల్‌లో అవసరమైతే ఆడుతా..

సిద్దిపేట ఫైనల్‌కు చేరితే సిద్దిపేట మినీస్టేడియంలో జరిగే ఫైనల్ మ్యాచ్‌ను తాను దగ్గరుండి వీక్షిస్తానని, అవసరమైతే ఆడుతానని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. స్వతహాగా క్రికెట్‌పై మక్కువతోపాటు ఆటలో ఆయనకు ఉన్న అనుభవం దృష్ట్యా ఆదివారం మినీ స్టేడియంలో మంత్రి హరీశ్‌రావు సుమారు అరగంట పాటు బ్యాటింగ్ చేశారు. మాజీ మంత్రి వినోద్ బౌలింగ్ వేసి టోర్నీని ప్రారంభించగా మంత్రి హరీశ్‌రావు బ్యాటింగ్ చేశారు. అనంతరం పలువురు వర్ధమాన క్రీడాకారులు బౌలింగ్ చేయగా.. మంత్రి సరదాగా కాసేపు తనదైన శైలిలో బ్యాటింగ్ చేశారు. వినూత్నమైన షాట్స్ కొడుతూ.. అక్కడి క్రీడాకారులను ఆశ్చర్య చకితులను చేశారు. మంత్రి బ్యాటింగ్ చేస్తున్నంత సేపు ఆయన కొట్టే షాట్‌లను క్రీడాకారులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, కరీంనగర్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగంరావు, మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు, హెచ్‌సీఏ ప్రతినిధులు సురేష్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఈ యేడు మరింత మంచి జరగాలి

- జిల్లా ప్రజలకు హ్యాపీ న్యూఇయర్
- మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేటజోన్: జిల్లా అభివృద్ధిలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలవడంలో జిల్లా ప్రజల పాత్ర ఎంతో కీలకమని, అలాంటి జిల్లా ప్రజలు కొత్త సంవత్సరంలో మరింత సుఖశాంతులతో ఆరోగ్యంగా ఉండాలని న్యూఇయర్ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. న్యూ ఇయర్ సందర్భంగా ఆదివారం జిల్లా ప్రజలకు, అధికారులకు, అనధికారులకు, నాయకులకు పత్రికాముఖంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం ఎన్నో ఆశయాలతో, లక్ష్యాలను సాధించి సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. గతేడాది కాలంలో విద్య, వైద్యం, వ్యవసాయం విద్యుత్ రంగాల్లో అనేక పెనుమార్పులు తెచ్చామన్నారు. ఈ యేడు వ్యవసాయానికి 24 గంటల కరంట్‌ను ఇవ్వబోతున్నామని, ఇదోక చారిత్రాత్మక నిర్ణయమని అభివర్ణించారు. స్వచ్ఛ జిల్లాగా మార్చామని, అన్ని రంగాల్లో ప్రగతి సాధించామని, ఈ యేడు కూడా అదే స్థాయిలో ప్రగతి సాధించడంలో జిల్లా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రజాప్రతినిధులకు మంత్రి సూచన
- రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు


అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్

సిద్దిపేటరూరల్: ప్రజల కోసం ప్రభుత్వం ఎన్నో కోట్ల రూపాయలు ఖర్చు చేసి సంక్షేమ పథకాలను ప్రజలకు అందుబాటులోకి తెస్తోందని, వాటిని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకునేలా స్థానిక ప్రజాప్రతినిధులు చూడాలని రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట రూరల్ మండలంలోని నారాయణరావుపేటలో ఆదివారం ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రారంభోత్సవం చేసిన వాటిలో అంగన్‌వాడీ సెంటర్, రెడ్డి సంఘం భవనం, వికలాంగుల కమ్యూనిటీ హాల్, పద్మశాలి భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, ఏఎంసీ గోదాం, కుమ్మరి సంఘం భవనం ఉన్నాయి. అలాగే డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రైతుల కోసం ఏర్పాటు చేస్తున్న గోదాంలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరు పథకాలను ఉపయోగించుకొని లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ నల్ల నరేందర్‌రెడ్డి, ఎంపీపీ ఎర్ర యాదయ్య, జెడ్పీటీసీ గ్యార వజ్రవ్వ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, సర్పంచ్ బందారపు రాజమణి, రంగాగౌడ్, ఎంపీటీసీ మునిగెల కిష్టయ్య, నాయకులు రవిందర్‌రెడ్డి, యాదగిరి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన జ్యోతిని సన్మానించిన మంత్రి


జ్యోతిని సన్మానిస్తున్న మంత్రి

సిద్దిపేటజోన్: కిలిమంజారో పర్వత శిఖరంపై తెలంగాణ జెండా ఎగురవేసిన జిల్లా ఉపాధ్యాయురాలు జ్యోతిని మంత్రి హరీశ్‌రావు ఆదివారం సన్మానించారు. సిద్దిపేటలో మంత్రిని కలిసిన ఆమెను ఆయన అభినందించి శాలువాతో సత్కరించారు. దుబ్బాక మండలానికి చెందిన జ్యోతి ప్రభుత్వ పాఠశాల పీఈటీగా పనిచేస్తోంది.

అర్చకుడి మృతి


పడిగన్నగారి కుమారస్వామి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామి ఆలయ అనువంశిక అర్చకుడు పడిగన్నగారి కుమారస్వామి అలియాస్ కుమారయ్య (73) ప్రమాదవశాత్తు గాయపడి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పడిగన్నగారి కుమారస్వామి కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామికి 40 సంవత్సరాలు ఆలయ అనువంశిక అర్చకుడిగా సేవలందించారు. మృతుడికి నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన కుటుంబ సభ్యులను వీరశైవ లింగాయత్ సమాజం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఈశ్వరప్ప, రాష్ట్ర అధ్యక్షుడు సంఘమేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శివప్ప, కొమురవెల్లి మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గొల్లపల్లి భాగ్యలక్ష్మికిష్టయ్య, ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు, ఉద్యోగుస్తులు, సిబ్బంది పరామర్శించి సంతాపం తెలిపారు.

'దాడులు చేస్తే సహించేది లేదు'

గజ్వేల్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జెండాలు వేరైనా మనుధర్మపాలనే ఎజెండాగా భారత రాజ్యాంగాన్ని తోసిపుచ్చి దళిత బడుగు, బలహీన వర్గాలను కులమతాల పేరుతో దాడులకు, చిత్ర హింసలకు గురిచేస్తోందని. వారి నాయకులను ఆదర్శంగా తీసుకొని గ్రామాల్లోని దళితులపై అగ్రకుల రాజకీయ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు మైస రాములు ఆరోపించారు. గజ్వేల్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేబర్తి యాదగిరి, ఎంఈఎఫ్ నాయకులు నాగభూషణం, ఎంఎస్ఎఫ్ నాయకులు ముంద్రాతి కృష్ణ, ప్రభాకర్, కుమార్, రాజు తదితరులు ఉన్నారు.

కరెంటు షాక్‌తో పాడిగేదె మృతి


కరెంట్ షాకుతో మృతిచెందిన పాడి గేదె

దుబ్బాక టౌన్ : కరెంటుషాక్‌తో పాడిగేదె మృతి చెందిన సంఘటన దుబ్బాక పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం... దుబ్బాక పట్టణానికి చెందిన రైతు మల్లుగారి నర్సింహారెడ్డి తన గేదెలను ఏదుల్లా చెరువు సమీపంలోని తన పొలం వద్ద మేపుతున్నారు. ఓ గేదె పొలంలో నీరు తాగేందుకు వెళ్లింది. ఈ క్రమంలో కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె మృతి చెందడంతో రూ.70 వేల నష్టం వాటిల్లిందని నర్సింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి రైతును ఆదుకోవాలని ప్రజలు కోరారు.

అగ్ని ప్రమాదాలు.. జాగ్రత్తలు

పటాన్‌చెరు టౌన్:

ప్రశ్న : ఉమ్మడి జిల్లాలో ఎన్ని అగ్నిమాపక కేంద్రాలున్నాయి?

జవాబు : ఉమ్మడి మెదక్ జిల్లాలో సంగారెడ్డి, పటాన్‌చెరు, సదాశివపేట్, జహీరాబాద్, జోగిపేట్, నారాయణఖేడ్, మెదక్, నర్సాపూర్, రామాయంపేట్, సిద్దిపేట్, గజ్వేల్, హుస్నాబాద్‌లో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. నర్సాపూర్, రామాయంపేట్, ఉష్ణాణ్ణబాద్‌లోని కేంద్రాలు ప్రవేట్‌కు సంబంధించినవి.

ప్రశ్న : 2017లో ఎన్ని ప్రమాదాలు జరిగాయి?

జవాబు : సంవత్సరం మొత్తం 1,019 అగ్నిప్రమాదాలు జరిగాయి. అందులో 14 తీవ్రస్థాయిలో, 37 మధ్యస్థాయిలో, 968 చిన్నస్థాయి ప్రమాదాలు ఉన్నాయి.

ప్రశ్న : జిల్లాలో 2017 డిసెంబర్ 30వ తేదీ వరకు జరిగిన అగ్నిప్రమాదాల్లో ఎంత మంది మృతి చెందారు?

జవాబు : జిల్లాలో ఏడాది కాలంగా జరిగిన అగ్ని ప్రమాదాల్లో 26 మంది మృతి చెందారు. ఈ సందర్భంగా 10 మందిని రక్షించాం.

ప్రశ్న : వివిధ అగ్ని ప్రమాదాల్లో ఎంత ఆస్తినష్టం జరిగింది?

జవాబు : సంవత్సర కాలంగా మొత్తం 125 కోట్ల 66 లక్షల 30 వేల రూపాయల విలువ గల ఆస్తి అగ్నిప్రమాదానికి గురైంది. ఇందులో 20 కోట్ల 64 లక్షల ఆస్తి నష్టం జరిగింది. 100 కోట్ల 99 లక్షల ఆస్తినష్టం జరగకుండా అగ్నిమాపక సిబ్బంది కాపాడారు.



శ్రీధర్‌రెడ్డి
అంశం : అగ్ని ప్రమాదాలు
సంగారెడ్డి జిల్లా అగ్నిమాపక అధికారి

ప్రశ్న : జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని అవగాహన సదస్సులు నిర్వహించారు?

జవాబు : జిల్లాలో ఏడాదిలో 409 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ప్రజలను చైతన్యపరిచాం.

ప్రశ్న : అగ్నిప్రమాదాలు జరగడానికి కారణాలు ఏమిటి?

జవాబు : అగ్నిప్రమాదాలు జరగడానికి ముఖ్యకారణం అవగాహన లేకపోవడం. పరిశ్రమల్లో సేఫ్టీకి సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఈ విషయాన్ని తెలియజేశాం.

ప్రశ్న : కొత్తగా అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారా?

జవాబు: కొత్తగా 2018లో దుబ్బాక, పెద్దశంకరంపేట్, జిన్నారం, తుఫ్రాన్‌లో అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం.

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

ఇద్దరిపై కేసు నమోదు

మెదక్‌రూరల్: బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసిన సంఘటన మెదక్ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. మెదక్ టాస్క్‌ఫోర్స్ సీఐ కృష్ణ కథనం ప్రకారం... డిసెంబర్ 31 దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారో విశ్వసనీయ సమాచారం మేరకు మండల పరిధిలోని పాతూర్, శమ్నాపూర్ గ్రామాల్లో బెల్టుషాపులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. కేసులు నమోదు చేశారు. పట్టుబడిన బెల్టుషాపు నిర్వాహకులను మెదక్ సీఐ గోపాల్‌కు అప్పగించారు. అక్రమ మద్యం విక్రయాలపై ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు.

కల్లు సీసాలో బల్లి వచ్చిందని ఆందోళన

రామాయంపేట(మెదక్): రామాయంపేట మండలం అక్కన్నపేటలోని ఓ కల్లు దుకాణంలో కల్లుసీసాలో చనిపోయిన బల్లి వచ్చిందని ఆరోపిస్తూ గ్రామస్తులు కొందరు ఆదివారం ఆందోళనకు దిగారు. ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎక్సైజ్ ఎస్ఐ యాదగిరి కల్లు దుకాణం వద్దకు వెళ్లి శాంపిల్ సేకరించారు. శాంపిల్‌ను టెస్టింగ్ నిమిత్తం ల్యాబ్‌కు పంపుతున్నామని చెప్పారు. ఫలితం వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని అన్నారు.

బైక్‌ను ఢీకొన్న ట్యాంకర్ : ఒకరి మృతి

పటాన్‌చెరు టౌన్: ట్యాంకర్ బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ బాల్‌రాజు కథనం ప్రకారం... ప్రభాకర్(43) అమీన్‌పూర్ గ్రామ పంచాయతీలో వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట నుంచి బీరంగూడ వైపు బైక్‌పై వస్తున్నాడు. ఆ సమయంలో బీరంగూడ విజేత సూపర్ మార్కెట్ సమీపంలో వెనుకాల నుంచి రెడ్‌మిక్స్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొంది. దీంతో ప్రభాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఓ ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రభాకర్ మరణించినట్లు డాక్టర్ వెల్లడించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విషం తాగి వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్‌రావు మృతదేహం

కొల్చారం(నర్సాపూర్): ఏడేళ్లుగా భార్యాపిల్లలు దూరం కావడం, కోర్టులో విడాకుల కేసు నడుస్తుండటంతో తీవ్ర మనస్థాపానికి గురై ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొల్చారం మండలం అంసాన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ పెంటయ్య కథనం ప్రకారం... అంసాన్‌పల్లి గ్రామానికి చెందిన దేవర శ్రీనివాస్‌రావు(42)కు 15 ఏళ్ల క్రితం ప్రసన్నతో వివాహం చేశారు. వీరికి ఇద్దరు కొడుకులు. ఏడేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. భార్య ప్రసన్న ఇద్దరు పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది. భర్తకు దూరంగా ఉంటున్న ప్రసన్న విడాకుల కోసం కోర్టులో కేసు వేసింది. ఏడేళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతూ వస్తున్న శ్రీనివాస్‌రావు విసిగి వేశారి తీవ్ర మనస్థాపానికి గురై ఆదివారం ఇంట్లో విషం సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం గమనించిన కుటుంబీకులు అతన్ని మెదక్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని తండ్రి రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్య



అవంతిక(ఫైల్)

దుబ్బాకరూరల్ : అత్తింటివారి వేధింపులను తట్టుకోలేక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుబ్బాక మండలం ఆకారం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ గౌడ్ కథనం ప్రకారం... ఆకారం గ్రామానికి చెందిన గుంటి అలియాస్ గ్యాదరి అవంతిక(22)ను అత్తమామలు గత కొన్ని రోజుల నుంచి వేధిస్తున్నారు. ఆదివారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అత్తమామల వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్ రాసింది. మృతురాలి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు అత్త కళావతి, మామ ఎల్లయ్యాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

తాటిపల్లిలో ఎడ్ల అపహరణ

మేళసంగ్యం శివారు రోడ్డుపై ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

మునిపల్లి(అందోల్): తాటిపల్లి గ్రామంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ఎడ్లను దొంగిలించినట్లు బుదేరా ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపారు. ఆదివారం మండలంలోని బుస్సారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బుస్సారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ తాటిపల్లి గ్రామంలోని తన మామ దగ్గర ఎడ్లను ఉంచి పిల్లోడి గ్రామంలో పది ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఎప్పటిలాగే ఎడ్లకు మేత వేసి సమీపంలో నిద్రిస్తున్నాడు. తిరిగి వచ్చే సరికి ఎడ్లు కొటంలో లేకపోవడంతో గ్రామంలోని వ్యవసాయ భూముల్లో వెతికాడు. మేళసంగ్యం గ్రామ శివారు రోడ్డులో ఓ ఎద్దు రోడ్డుపై మృతి చెందినట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి చూశాడు. మృతి చెందిన ఎద్దును చూసి బోరున విలపించాడు. ఒక ఎద్దును దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపారు.

భారీగా వాహనాల తనిఖీలు



హత్నూర(సంగారెడ్డి): మండలంలోని దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద సీఐ వెంకటేశం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి భారీగా వాహనాలను తనిఖీ చేశారు. 10 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, సరైన పత్రాలు లేని వాహనదారులు 50 మందిపై కేసులు నమోదు చేశామని సీఐ వెంకటేశం తెలిపారు. తనిఖీల్లో హత్నూర, జిన్నారం ఎస్ఐలు రాజేశ్ నాయక్, శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యపై కొడవలితో దాడి

మహిళకు గాయాలు



గాయపడిన మంజుల

రాయపోలు(దుబ్బాక): మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని నిలదీసిన భార్యపై భర్త కొడవలితో దాడి చేసి హత్యాయత్నం చేసిన సంఘటన రాయపోలు మండలం రామారంలో చోటు చేసుకుంది. తొగుట సీఐ వెంకటేశం కథనం ప్రకారం... రామారం గ్రామానికి చెందిన రెడ్డమైన లక్ష్మణ్ మరో మహిళతో వివాహేతర సంబంధం నెరపుతున్నాడని ఆదివారం భార్య మంజుల(30) అతన్ని నిలదీసింది. ఇద్దరూ గొడవపడ్డారు. మంజులపై లక్ష్మణ్ కొడవలితో దాడి చేశాడు. మంజుల గదవపై తీవ్ర గాయమైంది. చుట్టుపక్కల వారు విషయాన్ని గమనించి అడ్డుకున్నారు. బాధితురాలు రాయపోలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ వెంకటేశం సంఘటనా స్థలం వద్ద వివరాలు సేకరించారు. మంజులకు గజ్వేల్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. లక్ష్మణ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి

జహీరాబాద్ టౌన్: ప్రమాదవశాత్తు రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే ఎస్ఐ వెంకట్‌రావు కథనం ప్రకారం... బిహార్‌కు చెందిన గుర్తుతెలియని వ్యక్తి గుల్బర్గాకు వెళ్లడానికి నిర్ణయించాడు. బీదర్ వెళ్లడానికి జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో టిక్కెట్ తీసుకుని నడుస్తున్న రైలు ఎక్కడానికి ప్రయత్నించాడు. ప్రమాదావశాత్తు రైలు కింద పడిపోయాడు. ఆయన కాలు, చేయిపై నుంచి రైలు చక్రాలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణానికి చెందిన ముబీన్ పోలీసులకు సమాచారం అందించాడు. ఆ వ్యక్తిని జహీరాబాద్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని మార్చురీలో భద్రపరిచామని ఎస్ఐ వివరించారు.



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

వాతావరణం

రానున్న 24 గంటల్లో ఢిల్లీ, వాయవ్య భారతదేశం, ఉత్తరప్రదేశ్, బిహార్, ఉత్తర మధ్యప్రదేశ్, ఉత్తర జార్ఖండ్, అస్సాంలలో దట్టమైన పొగమంచు ఆవరించి ఉంటుంది. అండమాన్, నికోబార్ దీవుల్లో మోస్తరు వర్షాలు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా తీరప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. పశ్చిమ హరియాణా, ఉత్తర రాజస్తాన్‌లో చలిగాలులు వీచే అవకాశం ఉంది.

సిద్దిపేట వాతావరణం

గరిష్టం కనిష్టం
29.0°/15.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	23.9	06.4
కోల్‌కతా	27.2	15.3
బెంగళూరు	26.8	16.1
ముంబై	31.7	16.3
చెన్నై	30.5	22.4

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట
ఒంగోలు	33.7/20.9	తాడేపల్లిగూడెం	30.8/19.7
గుంటూరు	32.2/14.2	కర్నూలు	30.8/16.8
ఖమ్మం	31.8/11.0	హైదరాబాద్	30.8/12.0
చిత్తూరు	31.5/18.5	రంగారెడ్డి	30.8/12.0
తిరుపతి	31.5/18.5	కడప	30.7/17.5
విజయవాడ	31.5/18.5	విశాఖపట్నం	30.6/21.8
నెల్లూరు	31.4/22.0	నిజామాబాద్	30.5/13.9
మెదక్	31.2/09.7	ఆదిలాబాద్	30.4/05.7
అనంతపురం	31.1/16.2	కాకినాడ	30.0/19.4
మహబూబ్‌నగర్	31.1/15.0	వరంగల్	29.7/13.5
కరీంనగర్	31.0/12.0	నల్లగొండ	29.1/13.6
ఏలూరు	30.8/19.7	శ్రీకాకుళం	27.9/15.5
రాజమండ్రి	30.8/19.7	విజయనగరం	27.9/15.5

బుల్లితెర

W

SAKSHI TV


ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 గుడ్ మార్నింగ్
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.30 న్యూస్ ఫీచర్
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 బతుకు చిత్రం
ఉ.10.30 జనపథం
ఉ.11.30 న్యూస్ ఫీచర్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.00 రీజనల్ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజైన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే


టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.07.00 అమ్మోరు తల్లి
ఉ.09.30 ఉలవచారు బిర్యాని
మ.12.00 గ్యాంగ్ లీడర్
మ.03.00 చెప్పవే చిరుగాలి
రా.09.00 తుఫాన్



మూవీస్ నౌ
ఉ.09.45 మినియన్స్
ఉ.11.30 జురాసిక్ పార్క్
మ.01.30 ద జంగిల్ బుక్
మ.03.20 స్పెక్ట్రే
రా.09.00 ద రివెనెంట్




హెచ్‌బీవో
ఉ.06.00 ట్రెసర్స్
ఉ.07.27 స్టోర్క్స్
ఉ.10.53 సూసైడ్ స్క్వాడ్
సా.06.59 మీట్ ద ఫాకర్స్
రా.09.00 మ్యాన్ ఆఫ్ స్టీల్



స్టార్ మూవీస్
ఉ.06.32 జూమ్
ఉ.08.13 ద క్రూడ్స్
ఉ.11.36 డాక్టర్ స్ట్రేంజ్
మ.01.46 ఫైండింగ్ డోరీ
రా.09.00 ఫ్రోజెన్



మా మూవీస్
ఉ.07.00 ఆనంద్
ఉ.09.00 డాన్
మ.12.00 ఖుషి
సా.06.00 భలే భలే మగాడివోయ్
రా.09.00 మాస్



జీ సినిమా
ఉ.07.30 కొరియర్ బాయ్ కళ్యాణ్
మ.12.02 ఫిర్ హెరా ఫేరీ
మ.03.20 వివాహ్
రా.09.00 బాఘీ
రా.11.49 ఆర్య: ఏక్ దీవానా

తిరుమల సమాచారం

తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ చాలా తగ్గింది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు మాత్రమే నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు – ఖాళీ లేవు
రూ.50 గదులు – ఖాళీ లేవు
రూ.100 గదులు – ఖాళీ లేవు
రూ.500 గదులు – ఖాళీ లేవు

రద్దీ కారణంగా జనవరి రెండో తేదీ వరకు ప్రత్యేక సేవలు రద్దు చేశారు.



కొమురవెల్లి ఆలయ సమాచారం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లిలోని మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ సాధరణం కంటే ఎక్కువగా ఉంది. భక్తులు స్వామి వారిని ఆలయ ముఖ మండపం నుంచి అర్ధ మండపం ద్వారా దర్శించుకున్నారు.

నిత్య పూజలు: ఆలయంలో తెల్లవారుజామున 4 నుంచి 4.30 వరకు స్వామి వారి మేలుకొలుపు (ఒగ్గు ప్రార్ధన). 4.30 నుంచి 5 వరకు సుప్రభాతం. ఉ.5 నుంచి 6 వరకు స్వామివారికి తీర్థపు బిందె తెచ్చుట (రుద్రాభిషేకం). మ.12కు మహానివేదన (ద్వార బంధనం). ఉ.6 నుంచి రాత్రి 7 వరకు దైవ దర్శనం. రాత్రి 7.30 నిత్యాభిషేకం. రాత్రి 8.30 గంటలలకు ద్వార బంధనం.

ఆర్జిత సేవలు: ఉ.6 నుంచి ఉ.10 వరకు అభిషేకాలు, ఉ.9 నుంచి సా.6 వరకు వాహన పూజలు, ఉ.10.30 నుంచి స్వామి వారి నిత్య కల్యాణం.

రాత్రి 8 గంటలకు ఒగ్గు ప్రార్ధన (పవళింపు సేవ)
ఆలయంలో సోమవారం గదుల సమాచారం:
రూ.300 గదులు 52 ఖాళీగా ఉన్నాయి.
రూ.600 గదులు 25 ఖాళీగా ఉన్నాయి.

ఆలయ ఈఓ రామకృష్ణారావు ఫోన్: 94910 00652
గదుల విచారణ ఇన్‌చార్జి అధికారి
ఎం.పోచయ్య ఫోన్: 95537 83488





Padi-Panta

జొన్నలో సస్యరక్షణ చర్యలు

- చీడపీడల నివారణతో అధిక దిగుబడులు
- ఏడీఏ వినోద్‌కుమార్



జహీరాబాద్ టౌన్:

జొన్న రొట్టె ఆరోగ్యానికి చాలా మంచింది. జహీరాబాద్ వ్యవసాయ డివిజన్‌లోని రైతులు జొన్న పంటను అధిక విస్తీర్ణంలో సాగుచేస్తారు. రబీ సీజన్‌లో సాయి జొన్న, నీళ్ల జొన్నను పండిస్తున్నారు. ఇతర పంటల మాదిరిగా జొన్న పంటకు కూడా చీడపీడల బెడద ఉంటుంది. జొన్న పంటకు ఆశించే పురుగులు నివారణ చర్యల గురించి వ్యవసాయ శాఖ ఏడీఏ వినోద్ కుమార్ వివరించారు.


కాండం తొలుచు పురుగు

- కాండం తొలుచు పురుగు పంట సాగుకు 30 రోజుల తర్వాత కోత దశవరకు వస్తుంది.
- ఈ పురుగు ఆశిస్తే ఆకులపై గుండ్రని వరుస రంధ్రాలు ఏర్పాడతాయి.
- లార్వాలు కాండాన్ని తొలుస్తాయి. కాండం చీల్చిచూస్తే ఎర్రని కణజాలం కనిపిస్తుంది.
- ఈ పురుగులు ఆశిస్తే జొన్న కంకి పొట్టు నుంచి బయటకు రాదు. కంకి ఏర్పడినా తాలు గింజలు ఎక్కువగా ఉంటాయి.
- నివారణకు విత్తిన 30–35 రోజులలోపు ఎకరాకు 3 నుంచి 4 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను కాండపు సుడుల్లో వేయాలి. లేదా 2 గ్రాముల క్లోరిపైరిఫాస్ లీటరు నీటి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

మొవ్వుతొలుచు పురుగు

- ఈ పురుగులు జొన్నకు ఆశిస్తే పంట ఎండుతుంది.
- మొవ్వును లాగినప్పుడు సులువుగా ఊడి కుళ్లిపోయిన వాసన వస్తుంది.
- పిలక మొక్కలు అధికంగా వస్తాయి.
- ఈ తెగులు పంట ప్రారంభం నుంచి 30 రోజుల వరకు వస్తుంది. పంటను ఆలస్యంగా విత్తకూడదు. అక్టోబర్ మొదటి వారంలో విత్తిన పంటకు మొవ్వుతొలుచు పురుగు అధికంగా ఆశిస్తుంది.
- నివారణకు విత్తనం నాటేటప్పుడు 1.5 గ్రాముల థయోడికార్బ్ లేదా 1.5 గ్రాముల క్లోరిపైరిపాస్, 2 మి.లీ ల్యామిడా సైహలోత్రిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

జొన్న పంట



లద్దె పురుగు

- జొన్న పంటకు లద్దె పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది. మొక్కసుడుల్లో ఈ పురుగు చిరి సాయంత్రం సమయంలో ఆకులను తింటుంది.
- ఆకులను కొరికి తినడం వల్ల రెండు రోజుల్లో మొక్కలు మొళ్లుగా మారుతాయి.
- ఆకుసుడుల్లో పురుగు విసర్జనను గుర్తించవచ్చు. నివారణకు వెంటనే 2.5 మి.లీ క్లోరిఫైరిపాస్ లేదా ఒక గ్రాము థయోడికార్బ్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

పేను బంక పురుగు

- ఈ పురుగులు జొన్న ఆకుల వెనుక భాగంలో చేరి రసం పీల్చి నష్టం కలుగజేస్తాయి.
- ఈపురుగులు తీపి ద్రావాన్ని ఆకులపై స్రవిస్తాయి. దీంతో ఆకులపై నల్లని బూజు ఏర్పడుతుంది. నివారణకు 2 మి.లీ మిథైల్‌డె మటాన్ లేదా డైమితోయేట్, లేదా మిథైల్‌డై లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



చికెన్ (సుగుణ)	స్కిన్	స్కిన్‌లెస్
	160	190

భవిష్యం

మేషం: ఉత్సాహం, పట్టుదలతో ముందుకు సాగుతారు. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి. పనులు విజయవంతంగా పూర్తి. వ్యాపారవృద్ధి. ఉద్యోగులకు అనుకూలం.

వృషభం: సన్నిహితులతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. ఆలయాలు సందర్శిస్తారు. పనుల్లో స్వల్ప ఆటంకాలు. వ్యాపారాలు కొద్దిపాటి లాభాలు. ఉద్యోగులకు మార్పులు ఉండవచ్చు.

మిథునం: బంధువుల కలయిక. విందువినోదాలు. పనుల్లో పురోగతి. ఆధ్యాత్మిక చింతన. వాహనయోగం. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు ప్రోత్సాహం.



కర్కాటకం: శ్రమకు ఫలితం కాస్త కనిపిస్తుంది. పనుల్లో జాప్యం. ఆర్థిక పరిస్థితి మందగిస్తుంది. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి.

సింహం: దూరపు బంధువుల కలయిక. విందు వినోదాలు. యత్నకార్యసిద్ధి. మీ అంచనాలు నిజమవుతాయి. వ్యవహారాలలో విజయం. వ్యాపార, ఉద్యోగాలలో ముందడుగు వేస్తారు.

కన్య: అనుకున్న పనుల్లో విజయం. ఆప్తుల నుంచి ఆహ్వానాలు అందుతాయి. ఒక సమాచారం ఊరటనిస్తుంది. ఆలయ దర్శనాలు. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహవంతంగా ఉంటుంది.

తుల: రుణాలు చేస్తారు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. బంధువులతో తగాదాలు. పనులు నెమ్మదిగా సాగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిడులు.

వృశ్చికం: కుటుంబసమస్యలు. ఆర్థిక ఇబ్బందులు. పనులు నిదానంగా సాగుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి.

ధనుస్సు: కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. పలుకుబడి పెరుగుతుంది. బంధువులతో సఖ్యత. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహవంతంగా ఉంటాయి.

మకరం: శుభకార్యాలకు హాజరవుతారు. ఆర్థికాభివృద్ధి. కీలక నిర్ణయాలు. వ్యవహారాలలో విజయం. ఆప్తుల నుంచి ఆహ్వానాలు. వృత్తి, వ్యాపారాలు అనుకూలిస్తాయి.

కుంభం: రాబడి కన్నా ఖర్చులు అధికం. పనులు నిదానంగా సాగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. బంధువులతో వివాదాలు. వృత్తి, వ్యాపారాలు సాదాసీదాగా ఉంటాయి.

మీనం: మిత్రులతో మాటపట్టింపులు. ధన వ్యయం. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప మార్పులు.

– సింహంభట్ల సుబ్బారావు

హలో సాక్షి..
సిద్దిపేట: 98665 53321
సిద్దిపేట రూరల్: 90109 09073
సిద్దిపేట అర్బన్: 99859 16666
చిన్నకోడూరు: 97054 44264

కొత్త సంవత్సర కోలాహలం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2017కు బై బై చెప్పి, 2018కి హాయ్ హాయ్.. చెపుతూ నూతన సంవత్సరంలోకి అడుగువేశాము. కేకులు కట్ చేస్తూ, నృత్యాలు చేస్తూ నూతన సంవత్సరంలోకి ఎన్నో ఆశలతో, ఆనందంగా అడుగుపెడుతున్నారు. సిద్దిపేట పట్టణంలో నూతన సంవత్సరానికి చిన్నా పెద్ద వయస్సుతో నిమిత్తం లేకుండా నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొంటున్నారు.

2017 సంవత్సరపు చివరిరోజయిన డిసెంబర్ 31ని యువకులు అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం నుంచే పట్టణంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలో ఉదయం నుంచే కలర్స్ అమ్మారు. బేకరీల వద్ద ప్రజలు బారులు తీరారు. నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవడానికి కేక్‌లను కట్ చేయాడానికి కేక్‌లు తీసుకుపోయి కట్ చేశారు. అదే విధంగా చిన్నారులులతో సహా పెద్దలు కేక్‌లు కట్ చేసి ఆనందాన్ని పొందారు. వివిధ గ్రామాల్లో, పట్టణాల్లోని వార్డులో గల ప్రజలు కుటుంబాలవారిగా గ్రూప్‌లుగా విడిపోయి పార్టీలు చేసుకున్నారు. తమ నిర్ధేశించుకున్న గమ్యాన్ని సాధించాలని, తాము పెట్టుకున్న ఆశయాన్ని ఈ సంవత్సరంలో ఖచ్చితత్వంతో పూర్తిచేయాలని, వివిధ ఆశలతో కొత్త సంవత్సరంలోకి ప్రవేశించారు. విద్యా, ఉద్యోగం, కుటుంబ పరంగా స్థిరపడటం లాంటివి ఈ నూతన సంవత్సరంలో సాధించాలన్న తపనతో కొత్తగా అడుగులు వేస్తున్నారు. గత సంవత్సరం జ్ఞాపకాలు తలుచుకుంటేనే నూతన సంవత్సరం ఆరంభిస్తున్నారు. గత పాత జ్ఞాపకాలు మదిలో మెదులుతుండగా వాటిని గత పాత మధుర స్మృతులుగా తలుచుకుంటునే వివిధ ఆశలతో కొత్తగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఈ నూతన సంవత్సరంలో నూతనోత్సాహంతో తాము గత సంవత్సరంలో కన్న కళలు సాధించాలని ముందుకు సాగుతాం..


న్యూ ఇయర్ వేడుకలలో యువతుల కేరింతలు

మహార్ సైనికుల విజయోత్సవ ర్యాలీకి స్వాగతం

జహీరాబాద్ టౌన్: హైదరాబాద్ నుంచి పూణేకు బయలుదేరిన మహార్ సైనికుల విజయోత్సవ ర్యాలీ ఆదివారం జహీరాబాద్ పట్టణానికి చేరింది. రాహిల్ కిరణ్, శ్యాంల ఆధ్వర్యంలో బయలుదేరి పట్టణానికి చేరుకున్న ర్యాలీకి అంబేద్కర్ కోఆపరేటీవ్ సొసైటీ అధ్యక్షుడు రాంతీర్థం నర్సింలు, కార్యదర్శి దశరథ్, సమతా సైనిక్ దళ్ అధ్యక్షుడు ఆకాష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, నాయకులు రాంచందర్ భీవంశీ, శ్రీనివాస్, శ్రీకాంత్, విష్ణు, రవికాంత్ తదితరులు స్వాగతం పలికారు. 1818 సంవత్సరం జనవరి 1న బ్రిటీష్ సైన్యానికి వ్యతిరేకంగా 500 మంది మహార్ సైనికులు వీరోచితంగా పోరాటం చేసి 2800 సైనికులను హతమార్చి వీరమరణం పొందారు. వారి త్యాగానికి గుర్తుగా ప్రతీ సంవత్సరం జనవరి 1న పూణేలోని కోరేగావ్‌లో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తారు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన ర్యాలీకి స్థానిక దళిత సంఘాల నాయకులు స్వాగతం పలికారు.

ఎంత కష్టం

- ఎముకలు కొరికే చలిలో రాత్రంతా జాగారమే
- జోగిపేట జాతీయ రహదారి పక్కనే...
- భోపాల్ కూలీల కష్టాలు అన్నీ ఇన్నీ కావు
- ఇనుప పనిముట్ల తయారీలో మహిళలే కీలకం

జోగిపేట(అందోల్): ఎముకలు కొరికే చలిలో చంటి బిడ్డలతో కంటి నిండా నిద్ర లేకుండా గడిపారు.. తెల్లారాక పొద్దంతా కష్టం చేశారు.. మళ్లీ తెల్లారితే మరో గ్రామానికి వలస వెళ్లాలి.. ఇలా సంవత్సరంలో వందల గ్రామాలు సంచరిస్తూ పొట్టపోసుకుంటున్నారు మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌కు చెందిన సంచార జీవులు. ఇక్కడికి వచ్చిన ఐదు కుటుంబాల్లో చిన్నపిల్లలు సహా 15 మంది సంచార జీవులున్నారు.

శనివారం రాత్రి 7 గంటలకు జోగిపేటలోని జాతీయ రహదారి పక్కన పోస్టాఫీసు దగ్గరలో దిగారు. వస్తూనే వారు రోడ్డు పక్కనే ఎలాంటి గుడారం లేకుండా పడుకోవడానికి ఉపక్రమించారు. రాత్రంతా ఎముకలు కొరికే చలిలో పసిపిల్లలు ఏడుస్తూ ఉండగా నేలపై వాలారు. వెంట తెచ్చుకున్న దుప్పట్లు ఆ చలి నుంచి రక్షించకపోవడంతో రాత్రంతా జాగారమే అయ్యింది. పిల్లలు, పెద్దలు చలికి వణికిపోతూ నిద్రపోకుండానే తెల్లారిపోయింది. ఆదివారం ఉదయం 5.30 గంటల వరకే అందరూ నిద్రలేచారు. రాత్రి అందరూ తిన్నాక మిగిలిన అన్నం ఉదయమే వారంతా తినడం కనిపించింది. వెంటనే వారికి అన్నంపెట్టే కొడవళ్లు, బర్సీలు, కత్తులు, గొడ్డళ్లు తయారీ చేయడంలో నిమగ్నమయ్యారు. ఉదయం 7 గంటల నుంచే వారు పనులకు ఉపక్రమించడంతో దారిన వెళ్లే వారంతా ఆశ్చర్యపోయారు. మహిళలు సైతం ఇనుమును సాగదీయడానికి పెద్ద పెద్ద సుత్తెలతో కొట్టడం కనిపించింది. వాళ్ల పడుతున్న కష్టాన్ని చూసి స్థానికులు సానుభూతిని వ్యక్తం చేశారు.


జోగిపేటలో ఇనుప చువ్వలను సాగదీసేందుకు సుత్తితో కొడుతున్న మహిళలు


పనిముట్లను విక్రయిస్తున్న మహిళ

పొట్టతిప్పల కోసం ఊరూరా తిరుగుతాం



మాపై ఆధారపడి ఉన్న పిల్లల పొట్టతిప్పల కోసం జిల్లా, రాష్ట్రం అని చూడకుండా ఊరూరా తిరుగుతూ పనిచేసుకుంటూ బతుకుతున్నాం. మేం తయారు చేస్తున్న ఇనుప పనిముట్ల కొనుగోళ్లు అంతగా లేకున్నా అర్థాకలితో కాలాన్ని వెల్లదీస్తున్నాం. నాలుగు నెలల క్రితం స్వంత ఊరు నుంచి బయలుదేరి వచ్చాం. ఎక్కడ జాగ దొరికితే అక్కడే నిద్రపోతున్నాం. ఈ ఊరు నుంచి మరో ఊరికి వెళ్లేందుకు అయ్యే రవాణా ఖర్చులే తలకు మించిన భారం అవుతున్నాయి. స్వంత ఊరుకు ఎప్పుడు వెళతామో మాకే తెలియదు.

–ముఖేష్, సంచార జీవి, భోపాల్

సంచార జీవులకు సౌకర్యాలు కల్పించాలి



పొట్టకూటికోసం ఊరూరా తిరిగే మాకు రాత్రిపూట సేదతీరేందుకు ప్రభుత్వం సదుపాయాలు కల్పించాలి. పొద్దంతా కష్టపడి పనిచేస్తే ఆ పనిముట్లు ఒక్కోసారి అమ్ముడవుతాయి. కొన్ని సార్లు ఎవరూ కొనరు. మాకు ఈ వృత్తి తప్ప వేరే ఏ పనీ రాకపోవడంతో దీన్నే నమ్ముకున్నాం. అయినా అన్నింటిని భరించి ముందుకు వెళతాం. ఎలాంటి వసతులు లేకున్నా రోడ్డు పక్కనే పడుకుంటున్నాం. మూడు రోజుల పాటు ఉండి మరో ఊరికి వెళతాం. రాను రాను ఇలాంటి వస్తువుల ఆదరణ కూడా తగ్గిపోతోంది..

–దశరథబాయి, సంచారజీవి, భోపాల్

నూతన సంవత్సర శుభాకాంక్షలు

వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గొరిరెడ్డి శ్రీధర్‌రెడ్డి

సంగారెడ్డి జోన్: జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాల మధ్య నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గొరిరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గత సంవత్సరాల అనుభవాలతో నూతన సంవత్సరంలో ఆర్థిక ప్రగతిని సాధించడంతోపాటు జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


గొరిరెడ్డి శ్రీధర్‌రెడ్డి

సంతోషంగా ఉండాలి

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు
మెదక్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బి.సంజీవరావు

జోగిపేట(అందోల్): మెదక్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.సంజీవరావు అందోల్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ 2018 నూతన సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు. గత ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా ప్రజా సమస్యలపై వైఎస్సార్‌సీపీ తరఫున ఆందోళన కార్యక్రమాలను చేపడుతూ పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ యువత విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బాగయ్య, మండల శాఖ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.శంకర్, జిల్లా నాయకులు ప్రవీణ్‌కుమార్, నాయకులు గురుప్రసాదులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.


బి.సంజీవరావు

సాగుకు సింగూర్ జలాలు

- రైతుల పంటలకు గిట్టుబాటు ధర
- రైతు అధ్యయన కమిటీ జిల్లా చైర్మన్ బీరయ్య యాదవ్ డిమాండ్

మునిపల్లి(అందోల్): స్థానికులకు సింగూర్ జలాలను సాగుకు ఇవ్వాలని రైతు అధ్యయన కమిటీ జిల్లా చైర్మన్ బీరయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మగ్దుంపల్లి గ్రామంలో రైతు అధ్యయన యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగూర్ ప్రాజెక్టులో ముంపునకు గురైన రైతుల భూములకు పరిహారం మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పత్తితోపాటు ఆయా పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పత్తిని ప్రారంభంలో రూ.3.340లకే సీసీఐ కొనుగోలు చేస్తుందని చెప్పడంతో రైతులు సీసీఐకి అమ్ముకున్నారన్నారు. ప్రస్తుతం నెల రోజులకే పత్తి ధర అమాంతం సుమారు రూ. 5300కు పెరగడంతో సీసీఐకి అమ్ముకున్న రైతులు ఆందోళన చెందుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మగ్దుంపల్లి, లింగంపల్లి గ్రామాల సరిహద్దులో సుమారు 600 ఎకరాల భూమి ఎస్ఈజెడ్ పేరిట నిరుపయోగంగా ఉందని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు భూములు లేని రైతులకు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జీపీసీ ఉద్యోగుల సంఘం చైర్మన్ ఎస్‌పీ మల్లికార్జున్, డివిజన్ కన్వీనర్ తుల్జారెడ్డి, మునిపల్లి మండల కన్వీనర్ రమేశ్ యాదవ్, నీలిదండు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కామగల్ల రమేశ్, సంగమేశ్వర్, ఈశ్వర్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

సంఘటితమైతేనే సమస్యల పరిష్కారం

హెచ్‌ఎంఎస్ రాష్ట్ర నాయకుడు ఈశ్వర్‌ప్రసాద్

జహీరాబాద్ టౌన్: పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులంతా సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర నాయకుడు ఈశ్వర్‌ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీనగర్ సమీపంలో ఏర్పాటు చేసిన ముంగి పరిశ్రమ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల శ్రమను దోపిడీ చేయాలని చూస్తుంటాయన్నారు. దోపిడీ నుంచి బయటపడడానికి కార్మిక చట్టాలు ఉన్నాయన్నారు. కార్మికులంతా ఐకమత్యంగా ఉంటూ సమస్యలపై పోరాటం చేసినప్పుడే చట్టాలు చుట్టాలవుతాయన్నారు. లేకుంటే యాజమాన్యాల వేధింపులు తప్పవన్నారు. ముంగి పరిశ్రమ యాజమాన్యం కార్మికుల ముక్కు పిండి పనితీసుకుంటోందన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ అబ్దుల్లా, హెచ్‌ఎంఎస్ నాయకుడు గోవర్దన్, అబ్దుల్‌హై, సలీం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈశ్వర్‌ప్రసాద్

మద్యం దుకాణాలు తనిఖీ

నారాయణఖేడ్: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రయ్య ఆదివారం నారాయణఖేడ్ ప్రాంతంలో పలు మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఇటీవల బీజేపీ నాయకులు కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఎక్సైజ్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. దీంతో స్పందించిన ఈఎస్ సర్కిల్ పరిధిలోని పలు మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. దీంతోపాటు మద్యం విక్రయాలు, బెల్టు షాపులపై ఆరా తీశారు. ఆయన వెంట సీఐ మహేష్, ఎస్ఐ సూర్యప్రకాష్, కిరణ్‌కుమార్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.



పల్లె ప్రగతి పథకం కింద ప్రభుత్వం కొన్ని ప్రాథమిక అంశాలను పరిగణనలోకి తీసుకొని వెనుకబడిన మండలాలను ఎంపిక చేసింది. రాష్ట్రంలోనే తక్కువ వర్షపాతం నమోదు కావడం, ఎక్కువ నిరక్షరాస్యత, ప్రభుత్వ ఆస్పత్రుల్లో తక్కువ ప్రసవాల శాతం.. ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ జనాభా ఉన్న ప్రాంతాలు, పౌష్టికాహారం సరిగా అందని ప్రాంతాలను గుర్తించి ఈ పథకం కింద ఎంపిక చేశారు.

75 లక్షల మందికి ఆర్థిక ప్రయోజనం

- **150** తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో ఎంపికైన మండలాలు
- **రూ.653 కోట్లు** స్వయం ఉపాధి కల్పనకు కేటాయించిన నిధులు..
- **రూ.450 కోట్లు** ప్రపంచ బ్యాంకు సమకూరుస్తున్న నిధులు
- **రూ.203 కోట్లు** రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించాల్సిన నిధులు

పట్టాలెక్కని పల్లె ప్రగతి


నిధులున్నా ఖర్చుచేయని వైనం.. మూడేళ్లుగా ప్రచారానికే పరిమితం

జనగామ నుంచి ఇల్లందుల వెంకటేశ్వర్లు:

ప్రపంచ బ్యాంకు సహకారంతో వెనుకబడిన ప్రాంతాల్లోని ప్రజలకు స్వయం ఉపాధి కల్పించడం కోసం ప్రారంభించిన తెలంగాణ పల్లె ప్రగతి పథకం (తెలంగాణ రూరల్ ఇన్‌క్లూసివ్ గ్రోత్ ప్రాజెక్ట్ –టీఆర్ఐజీపీ) పట్టాలెక్కడం లేదు. పథకం ప్రారంభించి మూడేళ్లు కావొస్తున్న పురోగతి కన్పించడం లేదు. కోట్ల రూపాయలు కేటాయించినా ఇప్పటివరకు ఖర్చు చేయని దుస్థితి కన్పిస్తోంది.

ఉపాధి కల్పనే ప్రధానాంశం..

పల్లె ప్రగతి కింద గుర్తించిన గ్రామాల్లోని ప్రజలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. వెనుకబడిన ప్రాంతాలను వృద్ధిలోకి తీసుకురావడం ప్రధాన ధ్యేయం. గ్రామీణ ఉత్పత్తి రంగాలను అభివృద్ధి చేస్తూనే ప్రజల ఆసక్తిని బట్టి ఉపాధి కల్పించాలి. గేదెలు, గొర్రెల పెంపకం, పెరటి కోళ్ల పెంపకం, స్వయం ఉపాధి పొందడం కోసం ఏర్పాటు చేసుకునే కుటీర పరిశ్రమలకు తక్కువ వడ్డీతో రుణాలు అందించాల్సి ఉంది. మహిళా పొదుపు సంఘాల సభ్యులకు రుణాలు అందించడం ప్రత్యేక అంశం.



ఆయా జిల్లాలు (ఎంపికైన మండలాలు): వరుసగా.. ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం, మెదక్, నల్లగొండ, కరీంనగర్, రంగారెడ్డి, నిజామాబాద్

కేటాయింపులు ఉన్నా..

రాష్ట్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకు సంయుక్తంగా తెలంగాణ పల్లె ప్రగతి పథకానికి శ్రీకారం చుట్టాయి. ప్రపంచ బ్యాంకు రూ.450 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.203 కోట్లతో అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లోని ప్రజల ఆర్థికవృద్ధి రేటును పెంచడం కోసం ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు.

కొనసాగింది ఆరు నెలలే..


హైదరాబాద్ మినహా నాటి తొమ్మిది ఉమ్మడి జిల్లాలోని 150 అత్యంత వెనుకబడిన మండలాలను ఈ పథకానికి ఎంపిక చేశారు. అప్పటి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి కేటీఆర్ తెలంగాణ పల్లె ప్రగతి కార్యక్రమాన్ని 2015, ఆగస్టులో మెదక్ జిల్లా కౌడిపల్లిలో ప్రారంభించారు. ఆరు నెలలపాటు పల్లె ప్రగతి కార్యక్రమాలు కొనసాగాయి. ఉన్నట్టుండి ఈ కార్యక్రమాల అమలును నిలుపుదల చేశారు.

లక్ష్యం పెద్దదే.. అయినా..

రూ.653 కోట్ల వ్యయంతో 150 మండలాల్లోని సుమారు 75 లక్షల మందికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చే విధంగా చేపట్టిన ఈ పథకం అర్ధంతరంగానే ఆగిపోయింది. పల్లె ప్రగతితో తమ జీవితాలు మారిపోతాయని భావించిన వెనుకబడిన ప్రాంతాల్లోని ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదు.

ఈ పథకం కింద ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతులకు విత్తనాలు, ఎరువుల పంపిణీతో పాటుగా పంట చేతికి వచ్చిన తర్వాత మార్కెటింగ్ సౌకర్యం స్థానికంగానే కల్పిస్తారు.

ఈ పథకంలో మంచి అంశాలను చేర్చినా అమలులో జాప్యం జరుగుతోంది. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నా ఏ కారణాల వల్ల నిలిపివేశారో తెలియడం లేదు. ఈ పథకంపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.



లైన్ క్లియర్

ఢిల్లీ టూ చెన్నై.. చురుగ్గా సాగుతున్న రైల్వే మూడో లైన్ పనులు

పెద్దపల్లి నుంచి ఆది వెంకట రమణారావు:

ఉత్తర, దక్షిణ భారత దేశాన్ని అనుసంధానం చేసే కీలకమైన రైల్వే మూడో ట్రాక్ కొత్త సంవత్సరంలో మొదలు కానుంది. ఢిల్లీ టూ చెన్నై గ్రాండ్ ట్రంక్‌లైన్‌లో రద్దీ తగ్గించేందుకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేస్తున్న మూడో లైన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గూడ్స్ రైళ్లతో ఆదాయం మరింత పెంచుకోవడం, ప్యాసింజర్ రైళ్లు మరిన్ని నడిపించడం, సమయం ఆదా చేయడానికి ఈ మూడో లైన్ దోహదం చేయనుంది. ఇందుకోసం ఉత్తర తెలంగాణలోని వరంగల్ అర్బన్, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో సాగుతున్న పనులు చివరి దశకు చేరుకొన్నాయి.



రామగుండంలో చురుగ్గా సాగుతున్న మూడో లైన్ పనులు

కాజీపేట టూ బల్లార్షా

ఎన్నో ఏళ్లుగా ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా కేంద్రం వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట నుంచి మహారాష్ట్రలోని బల్లార్షా వరకు 202 కిలోమీటర్ల మేర రైల్వే మూడో లైన్‌ను నిర్మించేందుకు అనుమతినిచ్చింది. రూ.2063.03 కోట్ల అంచనా వ్యయంతో 2010 జనవరిలో పనులు మొదలయ్యాయి. పలు సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది. ప్రస్తుతం ఎగువ, దిగువతో కూడిన రెండు లైన్లు మాత్రమే ఉండడంతో రద్దీ అధికమై, రైల్వేశాఖకు నష్టం వాటిల్లుతోంది. దీనితో దక్షిణమధ్య రైల్వేశాఖ కాజీపేట నుంచి మహారాష్ట్రలోని బల్లార్షా వరకు కొత్తగా మూడో రైల్వే ట్రాక్‌ను ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టింది. ఈ పనులు మొత్తం పూర్తయ్యేనాటికి రూ.2,403.22 కోట్లు ఖర్చు కావచ్చన్నది రైల్వే శాఖ అంచనా.

ఈ రూట్లో రద్దీ అధికం..

ఉత్తర, దక్షిణ భారత దేశాలను కలిపే కాజీపేట టూ బల్లార్షా రైల్వే లైను అత్యంత రద్దీగా ఉంటుంది. చెన్నై టూ ఢిల్లీ వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. ఈ మార్గంలోని ఘట్ చందూర్, మానిక్‌ఘడ్, కాగజ్‌నగర్, రేచిన్‌రోడ్, బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, రాఘవాపూర్, పెద్దపల్లి, జమ్మికుంటలో గూడ్స్ రైళ్లు ఎక్కువగా తిరుగుతూ ఉంటాయి. సిమెంట్, బొగ్గు, ఎఫ్‌సీఐ సరుకులను రవాణా చేసే గూడ్స్ రైళ్ల ద్వారా ఒక్కో స్టేషన్‌లో ఏటా సుమారు రూ.వెయ్యి కోట్ల నుంచి రూ.1500 కోట్ల ఆదాయం రైల్వేకు వస్తోంది.

ఒక అంచనా ప్రకారం ప్రస్తుతం ట్రాక్‌పై 100 రైళ్లు నడవాల్సి ఉంటే, 180 రైళ్లు నడుస్తున్నాయి.

“ కాజీపేట–మందమర్రి–బల్లార్షా లైనులో సింగరేణి బొగ్గు గనులు అధికంగా ఉన్నాయి. మూడో రైల్వే ట్రాక్ పూర్తయితే బొగ్గు రవాణా ఊపందుకోవడంతో పాటు, రైల్వే ఆదాయం గణనీయంగా పెరగనుంది.

“ మూడో రైల్వే లైను పనులను విభజించి చేపడుతున్నారు. దీన్నే చెన్నై – న్యూఢిల్లీ నుంచి గ్రాండ్ ట్రంక్ రూట్‌గా పేర్కొంటారు. ఈ లైన్ కోసం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్ అర్బన్, కరీంనగర్ జిల్లాల పరిధిలో 29.35 ఎకరాల భూమిని సేకరించారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.160 కోట్లు కేటాయించడంతో పనులు త్వరగా సాగుతున్నాయి. పనులు తుది దశకు రావడంతో జనవరి నెలలో రైల్వే మూడో ట్రాక్ నుంచి రైళ్లు నడిపించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సేఫ్టీ అధికారుల బృందం పర్యటించి ట్రాక్ స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. వీరిచ్చే నివేదిక ఆధారంగా ప్రారంభోత్సవానికి తేదీ ఖరారు చేస్తామని రైల్వే అధికారి ఒకరు తెలిపారు.

మూడు ముళ్ల బంధానికి మున్నెన్నడూ లేని కష్టమొచ్చింది. జీవితకాలం కొనసాగాల్సిన వైవాహిక బంధం బలహీనమైపోతోంది. ఏ గొడవొచ్చినా పరిష్కరించే కుటుంబ పెద్దలు కరువయ్యారు. ఒకప్పటి లాగా గుట్టుగా సాగాల్సిన సంసారం మూణ్ణాళ్లకే వీధిన పడుతోంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు పెరిగి దాంపత్య జీవితం దారి తప్పుతోంది. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకొని జీవిత కాలం కలిసిమెలసి ఉండాల్సిన దంపతులు విడిపోతున్నారు. అనుమానం, అవగాహనా లేమి, ఒకరిపై మరొకరికి ప్రేమ లేకపోవడం, వివాహేతర సంబంధాలకు తోడు.. సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్, ఫేస్‌బుక్, వాట్సాప్ చాటింగ్‌లు సైతం కాపురాల్లో చిచ్చుపెడుతున్నాయి. ఏ కారణం వల్ల జంటలు విడిపోయినా అది తప్పని వైవాహిక జీవితపు గొప్పదనాన్ని చాటిచెప్పుతూ.. భార్యాభర్తలు పరస్పర అవగాహన, ప్రేమ కలిగి ఉండాలని.. అనుమానాలను దూరం పెట్టాలని, సర్దుకొని పోతేనే సంసారం సాగుతుందని తెలియజెప్పి వారి బంధం బలంగా ఉండేందుకు కృషి చేస్తోంది 'కుటుంబ సలహా కేంద్రం'.. మీ బంధం బలహీనమైతే దానికి బలమైన పునాదులు వేసేందుకు రెడీగా 'కుటుంబ సలహా కేంద్రం' ఉందన్న విషయాన్ని మరవొద్దని చెబుతోంది.

బంధం బలంగా..


కౌన్సెలింగ్ ఇస్తున్న నిర్వాహకులు (ఫైల్)

- క్షణికావేశంలో దూరమవుతున్న దంపతులు
- ఇద్దరి మధ్య మనస్పర్థలు
- క(న)ష్టాలపాలవుతున్న బాధితులు
- కౌన్సెలింగ్‌తో ఏకం చేసేందుకు యత్నిస్తున్న 'కుటుంబ సలహా కేంద్రం'

గజ్వేల్‌రూరల్: మన జీవితంలో టీవీలు, సెల్‌ఫోన్, ఇంటర్నెట్ల వినియోగం ఓ భాగమైపోయింది. వీటి వినియోగం వల్ల మేలు జరుగుతున్నప్పటికీ అనర్థాలు సైతం అదే స్థాయిలో ఉంటున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. వీటి వ్యామోహంలో చదువుకున్న యువత, గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్థికంగా ఎదగాలనే ఆకాంక్షతోపాటు జల్సాలకు అలవాటు పడి కుటుంబ సభ్యుల్లో ప్రేమానురాగాలు తగ్గి క్షణికావేశంలో... విచక్షణ కోల్పోయి చేసే పనుల వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటాయి.

మూడు ముళ్లు.. ఏడడుగులు.. భాజా బజంత్రీలు, వేద మంత్రాల సాక్షిగా ఏకమై అన్యోన్య దాంపత్యానికి ప్రతీకగా నిలవాల్సిన భార్యాభర్తలు చిన్నపాటి మనస్పర్థలు, అపర్థాలు, అపోహలతో వారి దాంపత్య జీవితం ముణ్ణాళ్ల ముచ్చటగా మార్చుకుంటున్నారు. దీనికి ముఖ్య కారణం భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలు కరువై సఖ్యత లేకపోవడమే.

దాంపత్య జీవితానికి బీటలు

గ్రామాల్లో, పట్టణాల్లో గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి... అన్నాదమ్ములు, భార్యాభర్తల మధ్య ఎలాంటి సమస్య తలెత్తినా ఇంటి పెద్ద పరిష్కరించేవారు. కానీ ఇప్పుడు పెళ్లయిన కొన్నాళ్లకే ఉమ్మడి కుటుంబంలో ఇమడలేక భార్యాభర్తలు వేరుపడి వైయక్తిక కుటుంబంగా మారుతున్నారు. అలా వేరుగా వచ్చిన భార్యాభర్తల్లో మనస్పర్థలు, అవగాహన లోపంతో చిన్నపాటి సమస్యలకు కూడా పెద్దగా ఫీలవుతూ సతమతమవుతున్నారు. దీంతో విడిపోవడం దాకా నిర్ణయం తీసేసుకుంటూ జీవితాలను దారి మళ్లించుకుంటున్నారు.

పెరిగిపోతున్న 'ఇగో'యిజం

చదువుకున్న యువతలో అహం పెరిగిపోయి జల్సాలకు అలవాటు పడడం.. చదువు, సంపాదనలో తానేం తక్కువా అన్నట్లు వ్యవహరించడం... సెల్‌ఫోన్, ఇంటర్నెట్, ఇల్లీగల్ కాంటాక్ట్స్(వివాహేతర లైంగిక సంబంధాలు), మద్యపానం వంటివాటి మత్తులో ఎంతో మంది తమ జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, క్షణికావేశం వల్ల తలెత్తే అనర్థాలు ఎంతో దూరం తీసుకెళ్తున్నాయి. దీంతో వారి పిల్లలు అనాథలుగా మారి తల్లిదండ్రుల ప్రేమకు దూరమవుతున్నారు.ఇలాంటి వారిని కౌన్సెలింగ్ ద్వారా ఏకం చేసేందుకు కృషి చేస్తోంది 'కుటుంబ సలహా కేంద్రం'...


గ్రామాల్లో అవగాహన కల్గిస్తున్న దృశ్యం (ఫైల్)

చిన్న సమస్యలతో భార్యాభర్తల మధ్య విద్వేషాలు పెరిగి దాంపత్య జీవితానికి దూరమవుతున్న వారికి కుటుంబ సలహా కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చి వారిని ఏకం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మహిళా శిశు సంక్షేమశాఖ, సాంఘీక సంక్షేమ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల ఆధారంగా కుటుంబ సలహా కేంద్రాలు కొనసాగుతున్నాయి. దీని ఆధ్వర్యంలో ఉమెన్, మేల్ కౌన్సిలర్లు మనస్పర్థలతో విడిపోయిన జంటలను ఏకం చేసేందుకు కౌన్సెలింగ్ ఇస్తుంటారు.

గజ్వేల్‌లోని కుటుంబ సలహా కేంద్రం పరిష్కరించిన కేసులు

మహిళా శిశు సంక్షేమశాఖ, సాంఘీక సంక్షేమ మండలి సహకారం తో గజ్వేల్ పట్టణంలోని ఆంధ్రాబ్యాంకు సమీపంలో 'విజన్ ఎన్జీఓ స్వచ్ఛంద సంస్థ' ఆధ్వర్యంలో 2012లో కుటుంబ సలహా కేంద్రం ఏర్పాటైంది. రాష్ట్ర వ్యాప్తంగా 40 కుటుంబ సలహా కేంద్రాలు ఉండగా.... గజ్వేల్‌లో ఉన్న ఈ కేంద్రం ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో 516 కేసులను పరిష్కరించారు. అయితే ప్రస్తుత 2017లో ఇప్పటి వరకు 68 కేసులు పరిష్కరించినట్లు నిర్వాహకుడు కైలాష్ పేర్కొన్నారు.

గ్రామైక్య సంఘాలు, పోలీసుల సహకారంతో..

గ్రామైక్య సంఘాలు, పోలీసుల ద్వారా ఈ సెంటర్లలో ఎంఎస్‌డబ్ల్యూ చేసిన కౌన్సిలర్లతో దూరమవుతున్న జంటలకు కౌన్సెలింగ్ ఇప్పిస్తారు. ఇటీవలి కాలంలో మనస్పర్థలు, అపనమ్మకాలు, సెల్‌ఫోన్, ఇల్లీగల్ కాంటాక్ట్స్, వరకట్నం వేధింపుల వంటి సమస్యలతో దూరమవుతున్న జంటలు ఎక్కువగా ఉంటున్నాయని, వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఏకం చేస్తున్నామని చెబుతున్నారు.

క్షణికావేశంలో మాటామాట పెరిగి తీసుకున్న నిర్ణయాలతో భార్యాభర్తల మధ్య అగాధం ఏర్పడం వల్ల వారి పిల్లలు ఎక్కువగా నష్టపోయే ప్రమాదముందని చెబుతున్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ ఉన్నా, ఎవరో ఒకరు (వివాహేతర సంబంధం)ఇతరులతో వెళ్లిపోవడం వల్ల పిల్లలు వారి ప్రేమను కోల్పోవడంతో పాటు అనాథలుగా మారుతున్నారు. దూరమవుతున్న జంటలకు పెద్దల సమక్షంలో పంచాయితీలు, పోలీసు కేసుల వరకు వెళ్లినటువంటి వారికి ఈ కేంద్రాలలో కేసులు, కోర్టుల చుట్టూ తిరగడం వల్ల అయ్యే ఖర్చు, కోల్పోతున్న జీవితం, భార్యాభర్తల బంధం, విడిపోవడానికి గల కారణాలను తెలియజేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఈ కేంద్రాలకు వచ్చే కేసులలో ఎక్కువ ఒకటీ రెండుసార్ల కౌన్సెలింగ్‌తోనే పరిష్కారం అవుతున్నట్లు గజ్వేల్ కుటుంబ సలహా కేంద్రం, విజన్ సంస్థ నిర్వాహకుడు కైలాష్ తెలిపారు. అంతే గాకుండా గ్రామీణ ప్రజలకు, మహిళా సంఘాలలో సమావేశాలు నిర్వహిస్తూ కుటుంబ సలహా కేంద్రం ఉన్నట్లు తెలపడంతోపాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

విభేదాలకు కారణాలు..

దాంపత్య జీవితంలో భార్యాభర్తల మధ్య సమన్వయం లేకపోవడం, ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడం, అనుమానాలకు తావివ్వడం, ఇతరుల మాటలు నమ్మి మోసపోవడం, కట్న కానుకల విషయంలో తగాదాలు, ఆధిక్యత కోసం పోటీ పడటం, నిరక్షరాస్యత, అవగాహన లోపం, మూఢనమ్మకాలు, అపోహలు, ఆచార వ్యవహారాలు, వివాహేతర సంబంధాలతో తలెత్తే వివాదాల కారణంగా జంటలు దూరమవుతున్నాయి.

అలా కాకుండా భార్యాభర్తల మధ్య ఎటువంటి విభేదాలు, అనుమానాలకు తావులేనప్పుడే దాంపత్య బంధం నూరేళ్లు కొనసాగుతుంది.

చిచ్చు పెట్టిన సెల్‌ఫోన్..

అమ్మాయిది వర్గల్ మండలంలోని ఓ గ్రామం. ఆమె 10వ తరగతి వరకు చదువుకుంది. గజ్వేల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న అబ్బాయితో పెళ్లైంది. వీరు రెండేళ్లు బాగానే ఉన్నారు. భర్త స్నేహితుడొకరు ఆమెతో తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. దీంతో భర్తకు అనుమానం కలిగింది. భార్య కాల్ లిస్ట్ చెక్ చేసి ఆమె తన స్నేహితుడితో మాట్లాడుతున్నట్లు గుర్తించాడు. అనుమానానికి మరింత బలం చేకూరి గొడవలు తలెత్తాయి. దీంతో అమ్మాయిపై చేయి చేసుకున్నాడు. ఆమె చనిపోతానని బెదిరిస్తూ ఇంట్లో నుంచి చుట్టాల ఇంటికి వెళ్లిపోయింది. దీంతో అతడు అత్తామామలకు సమాచారం అందించాడు. వారు అమ్మాయిని ఇంటికి తీసుకువెళ్లారు. భార్యను తీసుకువెళ్లడానికి భర్త రాగా పెద్ద మనుషుల మధ్య మాట్లాడిన తర్వాతే పంపిస్తామని అత్తింటివారు తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఓ సారి అతడిని బావమరుదులు కొట్టడంతో విభేదాలు తలెత్తాయి. గ్రామ మహిళా సంఘాల ద్వారా సమాచారం అందుకున్న గజ్వేల్‌లోని కుటుంబ సలహా కేంద్రం ప్రతినిధులు 15 రోజుల వ్యవధిలో రెండు కుటుంబాలవారిని వేర్వేరుగా పిలిపించారు. పెళ్లి.. జీవితం అంటే ఏమిటి.. భార్యాభర్తల మధ్య వచ్చిన తగాదాలకు కారణాలను తెలియజేశారు. నీ స్నేహితుడే దీనికి కారణం.. నిన్నే మోసం చేయాలని చూశాడని, తప్పు నీవైపునే ఉంది కాబట్టి.. పీడకలలా మరచిపోవాలని సూచనలివ్వడంతోపాటు కౌన్సెలింగ్ నిర్వహించి ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. 6 నెలలుగా వీరు పటాన్‌చెరులోని ఓ ప్రాంతంలో వేరు కాపురం పెట్టి బాగానే ఉంటున్నారు.

గ్రామాల్లో ప్రచారం



చిన్నపాటి సమస్యలు, తగాదాలతో దూరమవుతున్న జంటలకు కలిగే నష్టాలపై వివరిస్తున్నాం. సమస్య ఎటువంటిదైనా పరిష్కరించుకునే అవకాశముంటుంది. భార్యాభర్తల మధ్య సయోధ్య కుదిరితేనే జీవితం ముందుకు సాగుతుంది. దీనికోసం గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి భార్యాభర్తల బంధంపై అవగాహన కల్పిస్తున్నాం.
– రవి, కౌన్సిలర్

మానసిక వేధింపులతో...

దీంతో తొగుట మండలానికి చెందిన అబ్బాయికి గజ్వేల్ మండలానికి చెందిన అమ్మాయితో రెండేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి పిల్లలు లేరు. అబ్బాయి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో మొదట్లో బాగానే ఉన్నా.. తర్వాత అమ్మాయిని మానసికంగా వేధించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో అమ్మాయి పుట్టింటికి వెళ్లిపోయింది. అబ్బాయి తల్లిదండ్రులు వెళ్లినా అమ్మాయిని పంపించలేదు. ఈ విషయం కుటుంబ సలహా కేంద్రానికి అందడంతో రెండు కుటుంబాల సభ్యులను పిలిపించారు. ఈ సందర్భంలో అబ్బాయి మానసిక ప్రవర్తన బాగా లేదని, అమ్మాయికి అతడి నుంచి ప్రాణహాని ఉందనే అనుమానం ఆందోళన కలిగిస్తోందని ఆమె తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో రెండు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులతో అబ్బాయి డిప్రెషన్‌కు గురయ్యాడని, ఆసుపత్రిలో చికిత్స చేయించాలని సూచించారు. అతడికి చికిత్స పూర్తయిన తర్వాత అమ్మాయిని పంపించేలా చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పారు. రెండు నెలల ట్రీట్‌మెంట్ తర్వాత అబ్బాయిలో కొంత మార్పు వచ్చింది. దీంతో పెద్ద మనుషుల సమక్షంలో ఈ జంటను కలిపారు. ఈ జంట మూడు నెలలుగా వేరుగా ఉంటోంది.

భార్యాభర్తలిద్దరూ సమానమే



బండికి రెండు చక్రాలు ఎలానో... భార్యాభర్తలనేది కూడా అలానే కలిసుండాలి. మా వద్దకు వచ్చే జంటలకు విడిపోవడం వల్ల కలిగే నష్టాలు, కలిసుండడం వల్ల ఒనగూరే ప్రయోజనాలను వివరిస్తున్నాం. భార్యాభర్తల బంధంపై కౌన్సెలింగ్ ఇస్తున్నాం. జల్సాలకు అలవాటు పడి, వివాహేతర సంబంధాలతో ఎక్కువగా దూరమవుతున్నారు. వారిలో మార్పును తీసుకువస్తూ ఒక్కటయ్యే విధంగా కుటుంబ సలహా కేంద్రం ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.
– కైలాష్, కుటుంబ సలహా కేంద్రం నిర్వాహకుడు,

క్షణికావేశంతో దూరమవుతున్నారు

భార్యాభర్తలు చిన్న సమస్యకు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో అనర్థాలు జరుగుతాయి. అలా కాకుండా ఒకరిపై మరొకరికి పూర్తి అవగాహన కలిగి ఉండాలి. జీవితం ఎంతో విలువైనది. అపోహలు, విభేదాలకు తావులేకుండా భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. అదే విధంగా గృహహింస, వరకట్న నిరోధక చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం.
– రాధ, కౌన్సిలర్

- స్వాగతం విభిన్నం... వేడుక వైవిధ్యం
- బేకరీలు, మాంసం దుకాణాల్లో గిరాకీ
- మద్యం షాపుల్లో మందుబాబుల సందడి
- కొత్త దుస్తులు.. రెస్టారెంట్ల ఘుమఘుమలు
- రంగవల్లులు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- శుభాకాంక్షల పేరుతో 'ఫ్లెక్సీ'ల్లో ప్రచారం

కొత్త పుంతలు


బొకేలతో పూల వ్యాపారులు


కేక్‌లు, కూల్ డ్రింకులతో ప్రత్యేక కౌంటర్లు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా వేడుకలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఆధునికత, సంప్రదాయం కలబోతగా కొత్త సంవత్సరానికి వినూత్న రీతిలో స్వాగత సన్నాహాలు జరిగాయి. సాంకేతికతను కూడా జోడించి న్యూ ఇయర్ వేడుకల్లో నయా జోష్ నింపేందుకు యువత ఉవ్విల్లూరింది. ఆహారం, దుస్తులు, మద్యం, సంగీతం.. ప్రస్తుత వేడుకల్లో కీలకంగా మారగా.. రంగవల్లులు, గృహాలంకరణ, ప్రత్యేక పూజలతో సంప్రదాయ రంగులు అద్దే ప్రయత్నమూ జరుగింది. నూతన సంవత్సర వేడుకల్లో జిల్లా అంతా మునిగితేలిన వేళ.. కొత్త సంవత్సరం స్వాగత సంరంభాలను కళ్లకు కట్టే ప్రయత్నం ఇది.

గ్రీటింగ్ కార్డులు, పరస్పర అభివాదాలు, ఆలింగనాల నడుమ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే సన్నివేశం ఇప్పటికే కనుమరుగైంది.. న్యూ ఇయర్ వేడుకల్లో కొత్త ట్రెండ్ కనిపిస్తోంది. పట్నం, పల్లె తేడా లేకుండా అన్ని చోట్లా ఒకే విధమైన వాతావరణం కనిపిస్తోంది. న్యూ ఇయర్ షాపింగ్ సంస్కృతి క్రమంగా విస్తరిస్తోంది. గతంలో పండుగల సందర్భాలకే పరిమితమైన దుస్తుల కొనుగోలు వ్యవహారం ప్రస్తుతం న్యూ ఇయర్ సందర్భంగా మండల కేంద్రాలు, గ్రామాలకు కూడా పాకింది. కొత్త సంవత్సరంలో కొత్త దుస్తులు ధరించాలని కోరుకుంటున్న యువత జీన్స్, టీ షర్టు, ట్రెండీ దుస్తులపై మక్కువ చూపుతూ షాపింగ్ చేస్తోంది. బర్త్ డేలకు పరిమితమయ్యే తరగతుల వారూ డిసెంబర్ 31 అర్ధరాత్రి కేక్ కట్ చేసే సంప్రదాయానికి అలవాటు పడుతున్నారు. దీంతో బేకరీలు న్యూ ఇయర్ సందర్భంగా వెరైటీ కేక్‌లు, పేస్ట్రీలు, బర్గర్లు, పిజ్జాలు, కుకీస్ పేరిట కొత్త కొత్త తినుబండారాలను ప్రత్యేక ఆఫర్ల పేరిట అమ్మకాలు సాగిస్తున్నాయి. ఫ్రీ ఆఫర్ పేరిట కూల్ డ్రింక్‌లను ఉచితంగా బేకరీ ఐటమ్స్‌తోపాటు ఇస్తున్నాయి. చికెన్ సెంటర్లు, మటన్ షాప్‌లు తాత్కాలిక ఔట్‌లెట్లను ఓపెన్ చేసి.. 'న్యూ ఇయర్' జోష్‌ను సొమ్ము చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నాయి. హోటళ్లు, రెస్టారెంట్లు మాంసాహార వంటకాలతో స్పెషల్ రెసిపీలను సిద్ధం చేసుకున్నాయి. రొట్టెలు, కబాబ్‌లు, మాంసాహారం పార్శిళ్లకు వందల సంఖ్యలో ఆర్డర్లు ఉండటంతో స్పెషల్ కౌంటర్ తెరిచినట్లు సంగారెడ్డిలోని ఓ రెస్టారెంట్ యజమాని తెలి పారు. పెళ్లిళ్లు, పేరంటాల్లో వండి వడ్డించే వంటల పార్టీలు కూడా న్యూ ఇయర్ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాయి. మద్యం ప్రియులకు మాత్రం న్యూ ఇయర్ జోష్ మూడు రోజుల ముందే మొదలైనట్లు అమ్మకాలు సూచిస్తున్నారు. మూడు నెలల క్రితం లా టరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వైన్ షాప్ ఓనర్లు 'న్యూ ఇయర్' జోష్‌తో గల్లా నిండుతుందని లెక్కలు వేసుకున్నారు.


రంగుల కొనుగోలు

వేడుకల్లో యూత్ టాప్..!

యూత్ కేంద్రంగానే న్యూ ఇయర్ స్వాగత సన్నాహాలు జరుగుతున్నాయి. మద్యం, బాణాసంచా, డీజే మ్యూజిక్, బైక్ రైడింగ్ యూత్ న్యూ ఇయర్ వేడుకల ప్రాధాన్యాల్లో అగ్రస్థానంలో ఉన్నాయి. గ్రీటింగ్ కార్డులు, ఎస్ఎంఎస్‌లు, ఎంఎంఎస్‌లకు కాలం తీరిపోయి.. ప్రస్తుతం వాట్సాప్, ఫేస్‌బుక్ పోస్టిం గుల్లో సెల్ఫీలు, క్రియేటివ్ మెసేజ్‌లు పంపేలా మెదడుకు పదును పెట్టారు. ప్రచార ఆర్భాటం కోరుకునే రాజకీయ నాయకులు, యూత్ లీడర్లు, ఔత్సాహికులు న్యూ ఇయర్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, చెక్‌పోస్టులు, పెట్రోలింగ్‌తోపాటు సెక్షన్ 30 పేరిట పోలీసు శాఖ యూత్ న్యూ ఇయర్ జోష్‌ను కట్టడి చేస్తామని ప్రకటించింది.

పూలు, రంగులకు గిరాకీ

కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు యువతులు, మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దేందుకు అవసరమైన రంగులు కొనుగోలు చేశారు. బంతి, చామంతి పూలకు కూడా ఎక్కువ గిరాకీ ఉన్నట్లు పూల వ్యాపారులు చెప్తున్నారు. బొకే సంస్కృతి కూడా విస్తరించడంతో వివిధ ధరల్లో అందుబాటులోకి తెచ్చారు. దీపావళి తరహాలో రంగుల విద్యుద్దీపాలు (చైనీస్ లైట్లు) కొనుగోలుకు కూడా మహిళలు ఆసక్తి చూపుతున్నారు. పూలు, విద్యుద్దీపాలతో అలంకరించడంతో పండుగ శోభ కనిపించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వైకుంఠ ఏకాదశి తరహాలో మరోమారు కొత్త సంవత్సరంలో ప్రత్యేక పూజలకు ఆలయాలు ఏర్పాట్లు చేశాయి. ఝరాసంగం కేతకీ సంగమేశ్వరాలయం, బీరంగుట్ట మల్లికార్జున స్వామి ఆలయం, సంగారెడ్డి వైకుంఠపురం దేవాలయాల్లో రద్దీని తట్టుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే కుటుంబాలు తోటలు, రిజర్వాయర్ల వద్ద వన్ డే పిక్నిక్‌కు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

సంతోషించే వారు. నేడు వాటిన్నింటికి గుడ్‌బై చెబుతున్నారు. కాలం అతి వేగంగా మారిపోయింది. మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి యువతలో నూ మార్పులు వస్తున్నాయి. ప్రపంచంలో నే ఎక్కువ ప్రాధాన్యత కలిగి ఉన్న పండుగలా న్యూఇయర్‌ను జరుపుకుంటుంటారు. సం వత్సరం చివరి రోజు డిసెంబర్ అర్ధరాత్రి 12గటల నుంచి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సంబరాలు జరుపుకుంటున్నారు. అయితే నేటి యువత అనుకున్న సమయానికి తమ ఆత్మీయుల కు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

పలు రకాలుగా శుభాకాంక్షలు

చేతిలో ఒక స్మార్ట్ ఫోన్.. అందులో నెట్ బ్యాలెన్స్ ఉంటే చాలు సోషల్ మీడియాలో ఉంది. అదే విధంగా తమ దూరంగా ఉన్న ఆత్మీయులకు ప్రత్యేకంగా వీడియో కాల్ చేసి నేరుగా చూస్తూ, మాట్లాడుతూ శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. అంతే కాకుండా సంవత్సర కాలంలోని ఫొటోలను సెలక్ట్ చేసుకుని వాటిని వీడియోగా మార్చి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో శుభాకాంక్షలు తెలుపుతున్నారు. గ్రీటింగ్ కార్డుల స్థానాలను అరచేతిలోని స్మార్ట్‌ఫోన్లు ఆక్రమిస్తున్నాయి. వాట్సాప్, టెలిగ్రామ్, స్కైప్‌లతో ఇంటర్నెట్‌లలో కబుర్ల జోష్ పెరిగింది. డిసెంబర్ 31 రాత్రంతా సెల్‌ఫోన్లు వదల లేదు జనం. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆన్‌లైన్లో, సోషల్ మీడియాలో పోటీపడుతూ శుభాకాంక్షలు చెప్పేసుకున్నారు.


- వేదికవుతున్న సెల్‌ఫోన్
- ఇంటర్నెట్
- వాట్సాప్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్, ఇన్‌స్ట్రాగామ్, బ్రోడ్‌కాస్ట్, ట్విట్టర్
- ముందుగానే ప్రారంభమైన శుభాకాంక్షల పరంపర
- తక్కువ ఖర్చుతో ఎక్కువ మందికి గ్రీటింగ్స్

శుభాకాంక్షలు @ ఆన్‌లైన్

ఝరాసంగం(జహీరాబాద్): నూతన సంవత్సర వస్తోందంటే తమ స్నేహితులకు, బంధువులకు, మిత్రులకు ఏ విధంగా శుభా కాంక్షలు తెలపాలని ఆలోచించేవారు. వారం రోజుల ముందుగానే గ్రీటింగ్ కార్డుల కొనుగోళ్ల సందడి మొదలయ్యేది. కొనుగోలు చేసిన కార్డులపై తమ పేర్లను రాసి ఆత్మీయులకు అందించి, శుభాకాంక్షలు తెలిపేవారు. తమకు వచ్చిన కార్డులను తీపి గుర్తుగా భద్రపర్చుకునేవారు. ఖాళీ సమయాల్లో వాటిని చూస్తూ అనుకుంటోంది నేటి యువతరం. పండుగ ఏదైనా సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగిస్తున్నారు. అందులో భాగంగా వాట్సాప్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్, ఇన్‌స్ట్రాగామ్, బ్రోడ్‌కాస్ట్, ట్విట్టర్ తదితర వేదికల ద్వారా విషెస్ తెలుపుతున్నారు. తమకు ఇష్టమైన ఇమేజ్, మెసేజ్‌లను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని షేర్ చేస్తున్నారు. ఒక షేర్‌తో ఎంతో మందికి శుభాకాంక్షలు తెలిపే సౌకర్యం



రుస్తుం చిత్రం


రుస్తుం ఆవిష్కరించిన చిత్రం

సిద్దిపేటజోన్: 2018 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో ప్రముఖ చిత్రకారుడు రుస్తుం సిద్దిపేట క్లాక్ టవర్ కాన్వాస్ చిత్రాన్ని ఆవిష్కరించారు. సిద్దిపేటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్న సృజన శిల్పి మంత్రి హరీశ్‌రావు చిత్రాన్ని, క్లాక్ టవర్‌ను ఒకే చిత్రంలో పొందుపరిచారు. ఆయన నూతన సంవత్సరంలో మరిన్ని విజయాలను సాధించాలని విక్టరీ సంకేతం చూపుతున్నట్లుగా చిత్రాన్ని గీశారు.


ప్రశాంత్‌నగర్: సిద్దిపేటలో కేకులు కొంటున్న మహిళలు


ప్రశాంత్‌నగర్: సిద్దిపేటలో కేక్ కట్ చేసి సెల్ఫీ దిగుతున్న మహిళలు

గోదావరి ఏరులై..

▸మొదటిపేజీ తరువాయి

ముందుకు వెళ్తున్నా..' అని రాష్ట్ర భారీ నీటిపారుదల, మార్కెటింగ్‌శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

ఏడాదంతా అభివృద్ధి పరుగులు..

గతేడంతా జిల్లాను అభివృద్ధి వైపు పరుగులు పెట్టించాం. ఉపాధి హామీ, హరితహారం, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, రోడ్లు, మిషన్ కాకతీయ ఒక్కటి.. రెండు.. కాకుండా అన్ని రంగాల్లో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాం. స్వచ్ఛ భారత్ మిషన్ కింద జిల్లాను బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా మార్చాం. సిద్దిపేట పట్టణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కోమటిచెరువు రూపుదిద్దుకుంది. విశాలమైన రోడ్లు, వెజిటెబుల్ మార్కెట్, మాంసం మార్కెట్, రైతుబజార్లు.. ఇలా అన్ని పనులు పూర్తి కావస్తున్నాయి. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. నూతనంగా నిర్మించిన క్లాక్‌టవర్ సిద్దిపేటకు మరో మణిహారంగా నిలిచింది. డిజిటల్ సిస్టమ్, ఎల్‌ఈడీ లైటింగ్‌లో సిద్దిపేట వెలుగులు విరాజిల్లుతున్నాయి. ప్రభుత్వం ఆస్పత్రిని మెరుగుపర్చడంతో పాటు, జిల్లా ప్రజలకు వరంగా ఉన్న మెడికల్ కళాశాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య ఊహించని విధంగా పెరిగాయి. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ బోధన జరుగుతోంది. ఇందుకు ఒక్క హరీశ్‌రావు చేసిన పని కాదు.. ప్రజాప్రతినిధులు, కలెక్టర్.. ఇతర అధికారులు టీమ్‌గా ఏర్పడి.. అంకితభావంతో పనిచేయడంతోనే సాధ్యమైంది. ఇందుకు ప్రతీ ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. ఇదే ఉత్సాహంతో నూతన సంవత్సరంలో కూడా ముందుకు వెళ్లాలని కోరుతున్నాను.

కాళేశ్వరం నీళ్లు తేవడమే లక్ష్యం..

జిల్లాను కోనసీమను మించిన విధంగా చేయాలి. అంటే గోదావరి జలాలు తీసుకొస్తేనే ఇది సాధ్యం.. అందుకోసమే.. మేడిగడ్డ పనులు ముమ్మరం చేస్తున్నాం. జిల్లాలోని రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ పనులు ముమ్మరం చేయాల్సి ఉంది. ఇందు కోసం దాదాపుగా 92 శాతం భూసేకరణ పూర్తి చేశాం. ఇంకా మిగిలింది కొంత మాత్రమే. మిగిలిన భూసేకరణ కూడా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. రిజర్వాయర్ల కోసం భూమిని త్యాగం చేసిన రైతులకు చేతులెత్తి నమస్కరిస్తున్నా.. మిగిలిన రైతులు కూడా ప్రతిపక్ష నాయకులు చేసే కుట్రకు లోను కాకుండా ఆలోచించాలి. ప్రభుత్వం అండగా ఉంటుంది.. అన్ని విధాలుగా ఆదుకుంటుంది. ఈ ఏడాది ప్రాజెక్టులు పూర్తి చేసి.. గోదావరి గలగలలు జిల్లాలో వినిపించాలనేదే నా తపన.. నా ఆశయం.. ఆశ..

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

రామాయంపేట(మెదక్): రామాయంపేట, నిజాంపేట మండలాల పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక ఎంపీపీ పుట్టి విజయలక్ష్మి, ఎంఈఓ నర్సింలు ఆదివారం నాడిక్కడ ప్రారంభించారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రమోద్, సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆశయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు వెంకట నర్సింహారెడ్డి, సురేశ్, శ్రీనివాస్, రామాయంపేట, నిజాంపేట మండలాల అధ్యక్షుడు నర్సాగౌడ్, గోపాల్‌రెడ్డి, రెండు మండలాల ప్రధాన కార్యదర్శులు యాదవరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మండలశాఖ ఉపాధ్యక్షుడు శంకర్‌నాయక్, కార్యదర్శి స్వామిగౌడ్, మహిళా కార్యదర్శులు రేఖ, కవిత పాల్గొన్నారు.

యువత సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వం

- హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం
- యువజన సంఘాల రాష్ట్ర కన్వీనర్ మిద్దెల గాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మిద్దెల గాల్‌రెడ్డి

రేగోడ్(మెదక్): ప్రభుత్వం యువత సంక్షేమాన్ని మరచిపోయిందని యువజన సంఘాల రాష్ట్ర కన్వీనర్ మిద్దెల గాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రేగోడ్‌లో ఆదివారం యువజన సంఘాల మండల కమిటీని ఎన్నుకున్న సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ పాలకులకంటే ఆంధ్రోళ్ల పాలనే నయమన్నారు. యువకుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో యువకులకు, యువజన సంఘాల సభ్యులకు ఎంతో గౌరవం ఉండేదని, ప్రస్తుతం పాలకులు, అధికారులు వారిని పట్టించుకోవడం లేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. యువకుల హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. సంగారెడ్డిలో ఈ నెల 12న స్వామివివేకానంద జయంతిని నిర్వహిస్తామని, గ్రామాల్లో ఇదివరకు సేవా కార్యక్రమాలను చేపట్టిన యువజన సంఘాలను గుర్తించి ప్రశంసాపత్రాలను ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు డాకూర్ వెంకటేశం, ఉపాధ్యక్షుడు సాయిలు, నియోజకవర్గ అధ్యక్షుడు సంగమేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి

వెల్దుర్తి(తూప్రాన్): అన్ని రంగాలలో వెనుకబాటుకు గురైన ముదిరాజ్‌లను ప్రభుత్వం బీసీ-ఏలోకి మార్చి అభివృద్ధి చేయాలని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పుట్టి రాజు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రామంతాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ముదిరాజ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ రంగాలలో ముదిరాజ్‌లు వెనుకబాటుకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముదిరాజ్‌లను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి జనాభాలో 40 శాతం ఉన్న ముదిరాజ్‌లను ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా సిద్దిరాములుతోపాటు మరో 10 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కరణం వెంకటేశం, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు భిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాగ్దానాలతో మోసం చేస్తున్న ప్రభుత్వం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌రావు విమర్శ

చిన్నశంకరంపేట(మెదక్): రోజుకో కొత్త వాగ్దానంతో ప్రజలను టీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఏకే గంగాధర్ రావు అన్నారు. ఆదివారం ఆయన గవ్వలపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన టీఆర్ఎస్ ప్రభుత్వం నేడు రోజుకో కొత్త పథకం పేరుతో ముందుకుసాగుతోందన్నారు. దళితులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం అంటూ ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. కానీ ఎక్కడ కూడా ప్రభుత్వం హామీలను అమలు చేసేందుకు ప్రయత్నించడం లేదన్నారు. టీఆర్ఎస్‌కు సరైన సమయంలో తగినబుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకులు ఉన్నారు.

చేగుంట మున్నూరుకాపు సంఘానికి 'సేవ' అవార్డు



ఉత్తమ సేవ అవార్డు అందుకుంటున్న చేగుంట మున్నూరుకాపు సంఘం సభ్యులు

చేగుంట(తూప్రాన్): సంఘం ఏర్పాటు చేసిన మూడు నెలల్లో ఆరు సేవా కార్యక్రమాలను నిర్వహించిన చేగుంట మున్నూర్ కాపు సంఘానికి ఉత్తమ సేవ అవార్డు వచ్చినట్లు సంఘం ప్రధాన కార్యదర్శి లింగమూర్తి తెలిపారు. ఆదివారం రవీంద్రభారతిలో మున్నూర్ కాపు డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన సంఘాలకు ప్రశంస, బహుమతులను అందించారు. చేగుంట మున్నూర్ కాపు సంఘానికి ఉత్తమ సేవ అవార్డు లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సీ నేతి విద్యాసాగర్‌రావు, సామాజిక బీసీ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పు సంతోష్ చేతుల మీదుగా ఉత్తమ సేవ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేగుంట మున్నూర్‌కాపు సంఘం అధ్యక్షుడు సుకేందర్, నర్సింలు, మహిపాల్, మంద్రు సుధాకర్, చల్లా లక్ష్మణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు తడక జగదీశ్వర్‌గుప్తా



తడక జగదీశ్వర్‌గుప్తా

సిద్దిపేటటౌన్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు తడక జగదీశ్వర్‌గుప్తా జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 'సాక్షి'తో ఆదివారం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ.. జిల్లా ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉంటూ దేవుడి ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరం రోజున ప్రజలు చేపట్టే పనులు దిగ్విజయంగా సాగాలని కోరుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సంవత్సరంలో అన్ని రకాలుగా శుభం కలగాలని ఆకాంక్షించారు.

సిద్దిపేటలో క్రీడా సందడి

టీ ట్వంటీ టోర్నీ షురూ
సిద్దిపేటపై నిజామాబాద్ విజయం

సిద్దిపేటజోన్: సిద్దిపేటలోని మినీస్టేడియంలో ఆదివారం క్రికెట్ పండుగ మొదలైంది. వెంకటస్వామి స్మారక రాష్ట్ర స్థాయి టీ-20 టోర్నీలో భాగంగా తొలి లీగ్ మ్యాచ్ కొనసాగింది. తొలి మ్యాచ్‌లో సిద్దిపేటపై నిజామాబాద్ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన సిద్దిపేట నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసింది. అందులో అఫ్రీద్ 32 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నిజామాబాద్ 15 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసి విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వాజీద్‌కు అవార్డు కింద రూ.1000 అందజేశారు. టోర్నీని హెచ్‌సీఏ ప్రతినిధులు ఆగంరావు, ఎస్‌పీ.రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మల్లికార్జున్, బజ్జి పర్యవేక్షించారు.

దళితులపై దాడికి పాల్పడిన వారిపై చర్య తీసుకోవాలి

గజ్వేల్‌రూరల్: దళితులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొండపాక మండల మాజీ ఉపసర్పంచ్ శ్రీను, మండలంలోని వెలికట్ట గ్రామానికి చెందిన సంపత్‌లను దూషించడమేగాకుండా తన అనుచరులతో దాడికి పాల్పడడానికి కారణమయ్యాడని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూపాల్, నాయకులు రాజేందర్, ప్రభాకర్, రవి, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చంద రాజు, నాయకులు రవి, మహేందర్, శివ, అరవింద్, గిరి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న మాజీ మంత్రి సునీతారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామిని మాజీ మంత్రి సునీతారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి సునీతారెడ్డికి ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలోని శ్రీమల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఉపప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ మాజీ మంత్రి సునీతారెడ్డిని శాలువాతో సన్మానించారు.

పెళ్లి రోజే కళ్యాణలక్ష్మి చెక్కులు అందేలా చూస్తా..

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): పేదింటి ఆడపడుచులకు ప్రభుత్వం అందిస్తున్న కానుక కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలని, పెళ్లి రోజే ఆడపిల్ల తల్లిదండ్రులకు వాటి చెక్కులు అందేలా చూస్తామని స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కౌడిపల్లిలో 26 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు. ఇందులో 10 మందికి రూ. 51వేలు, 16మందికి రూ. 75,116 చొప్పున అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటోందన్నారు. ఆడపిల్ల పెళ్లి కుటుంబ సభ్యులకు భారం కావద్దని సీఎం కేసీఆర్ భావించారని తెలిపారు. అందుకోసమే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం అందించే సహాయంతో కుటుంబానికి ఎంతో ఆసరా అవుతుందన్నారు.

అనాథ వృద్ధులకు చేయూత

- కిరాణ సరుకులు, బియ్యం, రగ్గుల పంపిణీ
- సంస్థ డైరెక్టర్ క్యాథలిన్‌సిస్టర్



కేక్ కట్ చేసి వృద్ధుల నోరు తీపి చేస్తున్న సిస్టర్

జగదేవ్‌పూర్(గజ్వేల్): 'అనాథ వృద్ధులకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి కలుగుతుంది. వృద్ధులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి' అని ఎస్‌సీవీ(రోస్) సంస్థ డైరెక్టర్ క్యాథలిన్‌సిస్టర్ అన్నారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో 25 మంది అనాథ వృద్ధులకు కిరాణ సరుకులు, బియ్యం, కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా దుస్తులు అందజేశారు. సాయిమానస నిర్వాహకులు, దాత రవి వృద్ధులకు సొంతంగా రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్యాథలిన్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో పదిహేడు ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. వితంతువులకు చేయూతనందించడం, అనాథ బాలలకు విద్యను అందించడం, వృద్ధులకు అసరాగా నిలవడం తదితర సేవలు అందిస్తున్నామని చెప్పారు. ప్రతి ఏటా వృద్ధులకు సరిపడా నిత్యావసర సరుకులు అందిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

బర్త్ డే సంబరాలు..

సంస్థ డైరెక్టర్ క్యాథలిన్‌సిస్టర్ జన్మదిన వేడుకలను అనాథ వృద్ధుల మధ్య ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు సరుకులు అందించిన తర్వాత కేక్ కట్ చేసి జన్మదిన సంబరాలు చేసుకున్నారు. సిస్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అనూష్, పెద్దమ్మ, కోఆర్డినేటర్లు శ్వేత, దీప, దాతలు శ్రీను, అంథోస్ పాల్గొన్నారు.

మాచిన్‌పల్లిలో మద్య నిషేధం



మద్య నిషేధంపై తీర్మానం చేస్తున్న మహిళలు

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లిలో సంపూర్ణ మద్య నిషేధం పాటించాలని మహిళలు నిర్ణయించి ఆదివారం గ్రామ పంచాయతీ పాలకవర్గంతో తీర్మానం చేయించారు. మద్యం సేవించి పలు కుటుంబాలు వీధిన పడ్డాయని శనివారం రాత్రి మహిళలంతా సమావేశం ఏర్పాటు చేశారు. విషయాన్ని సర్పంచ్ యాదమ్మకు వివరించారు. ఆదివారం ఉదయం మరోసారి సమావేశం ఏర్పాటు చేసి సంపూర్ణ మద్య నిషేధం పాటించాలని తీర్మానించారు. గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే వారికి రూ.20 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. తాగినా జరిమానా తప్పదని గ్రామచావిడీ వద్ద తీర్మానం చేసి గ్రామంలో ప్రచారం చేశారు.

స్నేహం..సేవాభావం..!

- విద్యార్థి దశలోనే సామాజిక సేవకు పునాదులు
- అంకిత భావం.. క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

అంకిత భావం.. క్రమ శిక్షణకు మారుపేరుగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు నిలుస్తున్నారు. సామాజిక సేవ చేసేందుకు ముందడుగు వేస్తూ విద్యార్థి దశ నుంచే సామాజిక సేవకు పునాదులు వేస్తున్నారు. మహనీయుల స్ఫూర్తిగా.. జాతీయ సేవ పథకంలో చేరేందుకు ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. అధ్యాపకులు సేవా పాఠాలు నేర్పుతున్నారు. చదువుతో పాటు సేవా భావం అలవర్చుకోనేందుకు బీజాలు నాటుతున్నారు. ఆర్మీ, పోలీసు కానిస్టేబుల్స్ ఉద్యోగాల సాధనకు, దేశ సేవ చేసేందుకు కళాశాల స్థాయిలోనే పునాదులు వేస్తున్నారు.



గోవర్ధనగిరిలో మొక్కల సంరక్షణ పనులు చేస్తున్న ప్రభుత్వ బాలుర కళాశాల విద్యార్థులు



ఆర్థిక ప్రగతిపై పొట్లపల్లిలో ఇంటింటి సర్వే చేస్తున్న ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థులు

హుస్నాబాద్ రూరల్: స్నేహితులతో సేవా భావం అలవర్చుకునే అవకాశం విద్యార్థి దశ నుంచి ప్రారంభమవుతుంది. పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు వస్తే ఉరకలేసే కుర్రకారులు తోటి విద్యార్థులతో కలిసి మరో గ్రామానికి వెళ్లి సామాజిక సేవచేసేందుకు సిద్ధపడ్డారు. హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు 50 మంది శీతాకాల శిబిరానికి తరలి వెళ్లారు. గోవర్ధనగిరి, పొట్లపల్లి గ్రామాల్లో శీతాకాల శిబిరం నిర్వహిస్తున్న విద్యార్థులు ఏడు రోజుల ప్రణాళిక తయారు చేసుకొని సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, నగదు రహిత లావాదేవీలు, మరుగుదొడ్ల నిర్మాణం వ్యక్తికి, ఇంటికి ఎంత ప్రాధాన్యంతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యం చేస్తున్నారు. కళాశాలలో పాఠాలు నేర్చుకోవాల్సిన విద్యార్థులు శిబిరం రోజుల్లో రాత్రింబవళ్లు ఒకే దగ్గర ఉంటూ, సహపంక్తి భోజనాలు చేస్తూ సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ సేవా భావం అలవర్చుకుంటున్నారు.

పండుగలకు వెళ్లని విద్యార్థులు..

హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర, బాలికల కళాశాల విద్యార్థులు పండుగ సెలవులు వచ్చినా... ఇంటికి పోకుండా స్నేహితులతో కలిసి పల్లెలో సేవ చేసేందుకు ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాల శిబిరానికి తరలివెళ్లారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పల్లెలో శ్రమదానం చేయడంపై పలువురు అభినందిస్తున్నారు. సామాజిక సేవా పరమావధిగా ముందుకు సాగుతున్నారు. జీవితంలో ఉపయోగపడే అనేక విషయాలను తెలుసుకుంటున్నామని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పండుగ మరోసారి..



కళాశాలకు సెలవులు వస్తే ఇంటి దగ్గర ఆటలతో వృథా చేస్తాం. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరానికి వస్తే స్నేహితులతో కలిసి శ్రమపడటంతో సంతృప్తి ఉంటుంది. అందుకే క్రిస్మస్ సెలవుల్లో ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాల శిబిరానికి వచ్చిన. స్నేహితులతో కలిసి సేవ చేసే అవకాశం దొరకడం సంతోషంగా ఉంది. **– బెజ్జంకి మనోజ్, బీపీసీ ద్వితీయ సంవత్సరం**

స్నేహితులతో కలిసి..



50 మంది స్నేహితులతో కలిసి గ్రామంలో రోడ్లను బాగు చేస్తున్నం. వీధుల్లో నాటిన మొక్కలకు నీళ్లు పోస్తున్నం. 6 రోజులు ఒకే దగ్గర స్నేహితులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం, ఒక పనిని అందరూ పంచుకోవడం సంతోషం కల్గించింది.

– రాజిరెడ్డి, హెచ్‌ఈసీ ద్వితీయ సంవత్సరం

విద్యార్థులకు రిజర్వేషన్



విద్యార్థుల దశలోనే దేశ సేవపై బోధిస్తున్నాం. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు డిగ్రీ అడ్మిషన్, పీజీ ప్రవేశాల్లో రిజర్వేషన్ ఉంటుంది. సోషల్‌వర్కు ఉద్యోగాలు, సీఆర్‌పీఎఫ్ ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత ఇస్తారు. ప్రతి ఏటా ఒక కళాశాల నుంచి 50 మంది విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరుతున్నారు.

– బండారి ఎల్లయ్య, ప్రోగ్రాం అధికారి

వెంటనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కోమండ్ల రాంరెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేస్తూ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కోమండ్ల రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ మేడిశెట్టి శ్రీదర్, ఎంఈఓ జి.రాములుతో కలిసి టీపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు అన్యాయం చేసే సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. చేర్యాల ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాల స్థానంలో నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చుంచనకోట ఎంపీటీసీ సభ్యుడు వడ్లకొండ శ్రీనివాస్, జిల్లా నాయకులు పిల్లి చంద్రం, పి.కొండల్ రెడ్డి, వెంకటరమణ, సురేందర్‌రెడ్డి, కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ సున్నితమైన అంశం


మాజీ డిప్యూటీ సీఎం దామోదర్

తొగుట(దుబ్బాక): భూ సేకరణ రైతుల జీవితాలతో ముడిపడిన సున్నితమైన అంశమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మండలంలోని వేములఘాట్ గ్రామస్తులు చేపట్టిన దీక్షలకు ఆదివారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిపాటి సాగు భూమిని ప్రాజెక్టుల పేరుతో తీసుకుని పరిహారం చెల్లింపులో అన్యాయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 1894 నుంచి 2013 వరకు ప్రభుత్వాలు భూసేకరణ చేస్తూ రైతులకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సంపూర్ణ న్యాయం చేయాలనే సదుద్దేశంతో 2013 చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భూ పోరాటాల వారసత్వ చరిత్ర తెలంగాణ ప్రజలదన్నారు. 1946లో రావి నారాయణరెడ్డి, చాకలి ఐలమ్మ, బద్దం ఎల్లారెడ్డి వారసత్వం వేములఘాట్ రైతులదని అన్నారు. భూ సేకరణకు గ్రామసభలు నిర్వహించకుండా బలవంతంగా లాక్కోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చట్టం ప్రకారంగా ఊరుకు ఊరు, బడికి బడి, గుడికి గుడి నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్బంధం కొనసాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా న్యాయానిదే అంతిమ విజయమన్నారు. వేములఘాట్ పోరాటంపై డాక్యుమెంటరీ నిర్మించనున్నట్టు ప్రకటించారు. అంతకు ముందు మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి మాట్లాడుతూ రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని కోరారు. అనంతరం దామోదర్ రాజనర్సింహను రైతులు సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి బెల్లయ్య నాయక్, నాయకులు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, రైతులు హయాతుద్దీన్, రంగారెడ్డి, కనకయ్య, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.



దామోదర్‌ను సన్మానించిన గ్రామస్తులు

రైతే విద్యుత్ సిబ్బందిగా విధులు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కాపలా ఉన్న వ్యక్తి



స్తంభంపై వేరును సరి చేస్తున్న రాములు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన రైతు స్తంభంపై ఎక్కి విద్యుత్ మరమ్మతులు చేసుకుంటూ ప్రమాదకరంగా దర్శనమిచ్చారు. ఆదివారం మండలంలోని గాగిళ్లాపూర్ గ్రామంలోని నారాదాసు రాములు తన వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ వైర్లు తెగిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి బంద్ చేశాడు. ఓ వ్యక్తిని కాపాల ఉంచి స్తంభంపైకి ఎక్కి ప్రమాదకరంగా వైర్లకు మరమ్మతులు చేశారు. రాములును వివరణ కోరగా కరెంటు అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రమాదమని తెలిసి నా... తామే స్తంభంపై ఎక్కి వైర్లను చుట్టుకుంటున్నామని తెలిపారు.

వెండితెర



సిద్దిపేటలో..

హలో
వెంకటేశ్వరా కళామందిర్
11.15, 2.15, 6.00,9.00.

ఎంసీఏ
శ్రీనివాస్ డీలక్స్
11.15, 2.15, 6.00,9.00

2 కంట్రీస్
బాలాజీ డీలక్స్ 11.00, 2.00, 6.00, 9.15.

ఎంసీఏ
సీతారామాంజనేయ

గోడలే నిర్మాణాలు



చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో గొడలన్నీ నిర్మాణాలుగా మారుతున్నాయి. అంతగిరి ప్రాజెక్టు భూ సేకరణలో భాగంగా పలువురు భూములను కోల్పోతున్నారు. వారిలో కొందరు భూ పరిహారంపై ఆశతో అధికంగా డబ్బులు వస్తాయని గొడలనే నిర్మాణాలుగా మార్చుతున్నారు.

అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు

నంగునూరు(సిద్దిపేట): నీటిపారుదల శాఖమంత్రి హరీశ్‌రావు చేసిన కృషితో అన్ని గ్రామాలరకు వైంకుంఠధామాలు మంజూరయ్యాయని ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాంపూర్‌లో వైకుంత ధామం నిర్మాణాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని చాల గ్రామాల్లో ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభమయ్యాయన్నారు. గ్రేవీ యార్డుల్లో నీటి వసతి, టాయిలెట్ల నిర్మాణాలు చేపట్టి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, మురళి, శంకర్, గఫూర్, తిరుపతి, రవి, తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

సైడ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్ గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న బావి ప్రమాదకరంగా మారింది. ఇటీవల సాక్షిలో 'పొంచి ఉన్న ముప్పు' అనే కథనం వెలువడింది. స్పందించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు అప్రమత్తమయ్యారు. ఆదివారం పంచాయతీ రాజ్ ఏఈ బ్రహ్మం, గ్రామ సర్పంచ్ ఏలేటి అరుణలు ప్రమాదకరంగా ఉన్న బావి పక్కన సైడ్‌వాల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ నిర్మాణం పూర్తయితే ప్రమాదాలు జరిగే ఆస్కారం తగ్గుతుందని స్థానికులు సంతోషిస్తున్నారు.



బావి పక్కన సైడ్ వాల్ నిర్మాణ పనులు చేపడుతున్న అధికారులు

తడి,పొడి చెత్త విభజన

సిద్దిపేటజోన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆదివారం తడి, పొడి చెత్త సేకరణ ప్రక్రియను స్థానిక 32వ వార్డులో వేగవంతం చేశారు. మున్సిపల్ ఏఈ రఘు, మెప్మా అధికారి సాయికృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటి నుంచి చెత్తను సేకరించారు. సేకరించిన చెత్తను మున్సిపల్ సిబ్బంది ద్వారా డంప్‌యార్డుకు తరలించారు.

వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్‌గా రాజేందర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాసవిక్లబ్ సిద్దిపేట జిల్లా గవర్నర్‌గా కొర్తివాడ రాజేందర్ ఎన్నికయినట్లు వాసవిక్లబ్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఏన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు.

బీజేపీ అర్బన్ మండల అధ్యక్షుడిగా లింగారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట మండల అర్బన్ బీజేపీ అధ్యక్షుడిగా వంగా లింగారెడ్డి నియమితులైనారు. ఆదివారం జిల్లా అధ్యక్షుడు నరోత్తం రెడ్డి లేఖ ద్వారా నియమాక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మార్కెండేయులు, యాదగిరి, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చేర్యాల(సిద్దిపేట): మండల మున్నూరు కాపు సంఘం క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక మున్నూరు కాపు సంఘ భవనంలో ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీధర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి శిల్ప కళా వైభవం

చిన్నకోడూరు(సిద్దిపేట): యాదాద్రిలో ఈ నెల 21న ఒక వెయ్యి 116 మంది కవులతో యాదాద్రి శిల్పకళా వైభవం జరగనున్నట్లు సిద్దిపేట జిల్లా ఉదయ కళానిధి బాధ్యులు వరుకోలు లక్ష్మయ్య పేర్కొన్నారు. జనవరి 21 యాదాద్రిలో ఉదయ కళానిధి సాహిత్య సేవ సంస్థ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరుగనుందన్నారు. ఈ ఉత్సవాన్ని జయప్రదం చేయాలని కవులందరికి తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రాలతో పాటు సన్మానం చేయడం జరుగుతందన్నారు.

దేశ సంస్కృతిని కాపాడాలి...

చిన్నకోడూరు(సిద్దిపేట): నూతన సంవత్సర వేడుకలతో దేశ సంస్కృతిని దెబ్బతీస్తున్నారని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి అల్లం దుర్గాప్రసాద్ ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మన కొత్త సంవత్సర పండుగ ఉగాదిని ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గ్యాదరి రాజారాం తదితరులు పాల్గొన్నారు.

గీతా కార్మిక సంఘం ఎన్నిక

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు గ్రామ గీత కార్మిక పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మిట్టపల్లి నర్సాగౌడ్, ప్రధాన కార్యదర్శిగా రాజలింగం గౌడ్, ఉపాధ్యక్షులుగా బత్తిని పోచయ్య మరియు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నిరుద్యోగులతో చెలగాటమా!

వైఎస్సార్ సీపీ జిల్లా యువత ప్రధాన కార్యదర్శి విజయ్



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్

సిద్దిపేటటౌన్: నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన ధ్యేయంగా కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా నిరుద్యోగుల ప్రాణాలతో సీఎం కేసీఆర్ చెలగాటం ఆడుతున్నారని సిద్దిపేట జిల్లా వైఎస్సార్‌సీపీ యువత ప్రధాన కార్యదర్శి మేదరి విజయ్ ఆరోపించారు. ఆదివారం సిద్దిపేటలో మాట్లాడుతూ నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, రాష్ట్ర సాధనకోసం ప్రాణాలను లెక్కచేయకుండా కొట్లాడిన నిరుద్యోగులను ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. 2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో యువత విభాగం జిల్లా ప్రచార కార్యదర్శి ప్రవీణ్, తిరుపతి, మధు, సాయి, దినేష్, రాజు, యాదగిరి, పాల్గొన్నారు.

ఏబీవీపీ క్యాలెండర్ ఆవిష్కరణ

బెజ్జంకి(సిద్దిపేట): ఏబీవీపీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఆ సంఘం నియోజకవర్గ కన్వీనర్ క్రాంతికిరణ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి దోనె అశోక్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం నిరంతరంగా వారి వెంట ఉండి ఉద్యమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధిలో యువతే కీలకం

బెజ్జంకి(సిద్దిపేట): గ్రామ అభివృద్ధిలో యువత కీలకమని (ఎన్‌వైకే) నెహ్రూ యువ కేంద్ర బజరంగ్ యూత్ సభ్యులు రమేష్ పేర్కొన్నారు. మండలంలోని రేగులపల్లెలో ఆదివారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి యువత పట్టుగొమ్మలని, అన్నింటిల ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌రెడ్డి, ఎసర్ల ప్రవీణ్, జాప శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు టీడీపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు దరిపల్లి శ్రీనివాస్ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. నూతన సంవత్సరం అందరికీ సకల శుభాలు కలగించాలని కోరుకున్నారు.

ఇంటర్వ్యూ

నాగేశ్వర్
అంశం: పశువులపాక నిర్మాణాలు
ఎంపీడీఓ, నంగునూర్



నంగునూరు(సిద్దిపేట):

సాక్షి: నంగునూరు మండలానికి ఎన్ని పశువుల పాకలు మంజూరయ్యాయి?

అధికారి: మండలంలోని 24 గ్రామాలకు గాను 684 పశువుల పాకలు మంజూరయ్యాయి.

సాక్షి: ఒక్కో పాక నిర్మాణానికి ఎన్ని డబ్బులు అందజేస్తారు?

అధికారి: ఒక్కో నిర్మాణం కోసం ప్రభుత్వం రూ 56,047 అందజేస్తుంది.

సాక్షి: ఇప్పటి వరకు ఎన్ని నిర్మాణాలు పూర్తైయ్యాయి? ఎంత మందికి బిల్లులు చెల్లించారు?

అధికారి: ఇప్పటి వరకు 214 పశువుల పాకలు పూర్తయ్యాయి. అందులో 166 మంది లబ్ధిదారులకు బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు వేశాం. ఇంకా 48 మందికి అందించాల్సి ఉంది. వారికి త్వరలోనే అందజేస్తాం.

సాక్షి: బిల్లులు చెల్లించడంలో జాప్యం జరగడంతోనే నిర్మాణాలు చేపట్టడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు ?

అధికారి: రెండు నెలలుగా బిల్లులు రానిమాట నిజమే. కాని బిల్లుల చెల్లించడంలో జాప్యంతోనే పశువుల పాకలు కట్టుకోవడం లేదని చెప్పడం సరికాదు. ఇప్పటి వరకు నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి అక్టోబర్ నెల వరకు పూర్తిగా బిల్లులు చెల్లించాం.

సాక్షి: మిగతా నిర్మాణాలు ఎప్పటి వరకు పూర్తి చేయిస్తారు ?

అధికారి: నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని, లేకుంటే రద్దు చేస్తామని అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించాం. రెండు నెలల్లోపు నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

సాక్షి: రైతులకు ఎమైనా సలహాలు, సూచనలు ఇస్తారా?


అధికారి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పశువులపాక నిర్మాణాల పథకం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. నిర్మించుకున్న తరువాత బిల్లులు రావడంతో రైతులు డబ్బుల కోసం ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం రెండు విడతలుగా బిల్లులు చెల్లిస్తోంది. ఎమైనా సమస్యలు ఉంటే మాదృష్టికి తేవాలి. దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతు నిర్మాణం చేపట్టాలి, లేకుంటే రద్దవుతాయి.

సాక్షి
సిద్దిపేట | సోమవారం | జనవరి | 1 | 2018
Portal Updates:
www.sakshieducation.com
→ PhD Course 2017-18 at Dr. NTRUHS
→ Current Affairs - 2017 EM Video Lectures Available
→ AP & TS Tenth Class, Intermediate Study Material Available
విద్య
శ్రద్ధావాన్ లభతే జ్ఞానం

Sakshi Vidya Online Edition www.sakshieducation.com/Vidya.aspx
Send your Feedback to vidya@sakshi.com

More transpiration leads more rainfall


Sura Satyanarayana



TRANSPORTATION THE CIRCULATORY SYSTEM

1 Mark Questions

1. **Observe the given information and answer the question.**

Student	Heartbeat	Pulse rate
Raju	72	72
Ravi	72	72

What is relationship between heartbeat and pulse rate?

A. Both Raju and Ravi's heartbeat and pulse rate equal.

2. **Write the relation between transpiration in plants and rainfall?**

A. 1) Plants release water in the form of water vapour through transpiration which helps to form clouds.
2) When air currents bring air near to clouds, it becomes fully saturated and come down as rain.
3) So more transpiration leads more rain fall.

3. **The lumen size is bigger in vein when compared with artery. Why?**

A. 1) The lumen size of veins is bigger because transportation of more blood volume without any pressure.
2) Besides, the valves occupy space inside veins.

4. **Artery walls are strong and elastic. Why?**

A. Arteries carry blood from heart to different parts of the body. Heart pumps the blood into arteries with a pressure. To withstand the increase in the pressure, the artery walls are strong and elastic.

5. **Which is the largest artery in the body? Why is it big in size?**

A. 1) The largest artery in the body is Aorta.
2) The aorta is big in size because it has to supply oxygenated blood to all the parts of the body except lungs.

Important 2 Marks Questions:

1. Write the differences between right auricle and left auricle?
2. Cockroach has open circulatory system. Why do we call it as open circulatory system? Mention any two animals that have open circulatory system?
3. After learning about blood circulatory system, what changes would you like to bring in your food habits?
4. What happens if the transpiration doesn't takes place in plants?
5. What questions do you pose to your teacher to understand "Blood clotting"?
6. If you get a chance to meet cardiologist, what questions you ask about the problems related heart?
7. Draw the block diagram of double circuit circulation.
8. After knowing about circulatory system, what precautions you would suggest to your elders about edema?


Important 4 Marks Questions

1. Examine the information given below and then write answer to the questions.

Person	Occupation	Age	B.P Reading	Remarks
Ramulu	Farmer	38	120/80	Normal B.P.
Srilatha	Housewife	62	150/120	High B.P.
Prakash	Business man	42	140/110	High B.P.
Kalpana	Teacher	35	90/70	Low B.P.

i) Is there any relation between age and blood pressure? Explain.
ii) What are the effects of high blood pressure?
iii) What are the effects of low blood pressure?
iv) What represent numerator and denominator in B.P. reading?

2. We know that roots absorb water with minerals from soil. Root hair plays an important role in absorbing water. Explain how plants absorb water through root hair.
3. If the valves in veins of the legs fail to stop the flow of blood, what could be the consequences of this failure?
4. How can you prove that the water transport through the xylem?
5. Draw a block diagram to explain single and double circulation. Write differences between them.
6. Observe the Heart diagram and answer the following questions.



i) Write the parts of A, B, C, D, E, F.
ii) Name the blood vessed that carries deoxygenated blood to chamber A
iii) Name the blood versel that carries oxygenated blood to chamber "B"

Choose the correct answer

1. The term "cardiac" refers to which organ?
1) Heart 2) Vein
3) Lymph 4) Capillary
2. On which side of the human heart is low in oxygen?
1) Left ventricle 2) Right auricle
3) Right ventricle 4) Both 1 and 2
3. Which structures of the heart control the flow of the blood?
1) Arteries 2) Veins
3) Valves 4) Capillaries
4. Which of the following opinions is correct?
1) Ravi said xylem and phloem cells are arranged one upon the other to form a tube like structure
2) John said, xylem and phloem are not separate tube like structures
3) Salma said, xylem and phloem cells connect together to form a tube like structure
4) Hari said, because of its shape xylem and phloem cells said to be tube like structures
5. An Aphid pierces its proboscis into the ___ to get plant juices.
1) Xylem 2) Phloem
3) Cambium 4) Vascular bundle
6. Heart is most important part in transport system. For smooth functioning of heart one should:
1) Take nutritious food
2) Do exercise daily
3) Habituated to smoking 4) 1, 2
7. The membrane that covers the lungs is "Pleura". The two layered membrane that covers the heart is:
1) Pleura 2) Pericardium
3) Cerebro spinal 4) Sclera
8. The word "pulmonary" refers to:
1) Heart 2) Lungs
3) Kidneys 4) Liver
9. The valves that present between right atrium and right ventricle are:
1) Bicuspid valves
2) Tricuspid valves
3) Pulmonary vales
4) Mitral valves
10. The valves that present between left atrium and left ventricle are:
1) Mitral valves
2) Tricuspid valves
3) Pulmonary valves
4) Aortic valves
11. Lower part of the legs of Raju was swollen due to overnight journey in sitting position without moving. This stage is called:
1) Hypoxia 2) Hyperemia
3) Edema 4) Clotting of blood
12. The pulse rate of children over 10 years and adults including senior citizens is:
1) 70 -10 2) 60 -110
3) 80 - 120 4) 90 - 120
13. The pulse rate of well trained adult athletes is:
1) 40 - 60 2) 60 - 100
3) 70 - 130 4) 90 - 120
14. Stethoscope was discovered by:
1) Calvin 2) Laennec
3) William Harvey 4) Landsteiner
15. The largest artery in our body is:
1) Pulmonary artery 2) Cardiac artery
3) Aorta 4) Inferior artery
16. The blood vessels which collect blood from upper parts (head) of the body are:
1) Superior vena cava
2) Inferior vena cava
3) Pulmonary veins 4) Cardiac veins
17. The whole processes of cardiac cycle is approximately completed in:
1) 0.8 sec 2) 0.9 sec
3) 0.10 sec 4) 0.11 sec
18. The liquid portion of the blood with nutrients that flows out of capillaries is:
1) Tissue fluid 2) Serum
3) Plasma 4) Trambin
19. The natural protoplasmic movements seen in amoeba are:
1) Drownian movements
2) Brownian movements
3) Peristaltic movements
4) Ciliated movement
20. The first eucoelomate animals are:
1) Platy helminthes 2) Nematy helminthes
3) Annelids 4) Arthropods
21. Open type of circulatory system is present in:
1) Cockroach 2) Earth warm
3) Humans 4) Frog

KEY

1) 1 2) 4 3) 3 4) 3 5) 2 6) 4
7) 2 8) 2 9) 2 10) 1 11) 3 12) 2
13) 1 14) 2 15) 3 16) 1 17) 1 18) 1
19) 2 20) 3 21) 1

సార్క్ దేశాల విపత్తు నిర్వహణ కేంద్రం ఎక్కడ ఉంది?



బొమ్మనబోయిన శ్రీనివాస్
సీనియర్ ఫ్యాకల్టీ

ప్రకృతి వైపరీత్యాలు

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో తరచుగా తుఫానులకు గురయ్యే ప్రాంతాలు ఏవి?
ఎ) తూర్పు, ఈశాన్య ప్రాంతాలు
బి) తూర్పు, ఆగ్నేయ ప్రాంతాలు
సి) పశ్చిమ, నైరుతి ప్రాంతాలు
డి) పశ్చిమ, వాయవ్య ప్రాంతాలు

2. వరదలు ఎక్కువగా సంభవించే మైదాన ప్రాంతాలు ఏవి?
ఎ) గంగా సింధూ మైదానం
బి) దక్కన్ పీఠభూమి మైదాన ప్రాంతం
సి) కృష్ణా- గోదావరి డెల్టా మైదానం
డి) గంగా-బ్రహ్మపుత్ర మైదానం

3. దక్షిణ భారతదేశంలో తీవ్ర కరువుకు గురయ్యే ప్రాంతం ఏది?
ఎ) రాయలసీమ (ఆంధ్రప్రదేశ్)
బి) కొంగునాడు (తమిళనాడు)
సి) దక్షిణ తెలంగాణ
డి) వయనాడు (కేరళ)

4. కింది వాటిలో వేగంగా వచ్చే విపత్తులు కానివి ఏవి?
ఎ) అగ్నిపర్వతాలు పగిలిపోవడం
బి) కొండ చరియలు విరిగిపడటం
సి) వరదలు రావడం
డి) కరువుకాటకాలు సంభవించడం

5. కింది వాటిలో విపత్తుల నిర్వహణ చర్యలకు సంబంధించనిది ఏది?
ఎ) విపత్తులు రాకుండా ఆపడం
బి) విపత్తుల ప్రభావాన్ని తగ్గించడం
సి) విపత్తులను ఎదుర్కొనే సంసిద్ధతను ఏర్పరచడం
డి) పైవేవీ కావు

6. 'సునామీ' అనే పదంలో 'సు' అంటే జపాన్ భాషలో అర్థమేమిటి?
ఎ) అల బి) ప్రమాదం
సి) సముద్రం డి) రేవు

7. సునామీకి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) సునామీ అలలు తీరాన్ని చేరుతున్నప్పుడు వాటి వేగం, తరంగ దైర్ఘ్యం తగ్గుతుంది
బి) సముద్రంలో భూపలకల కదలికల వల్ల, అగ్నిపర్వతాల విస్ఫోటనం వల్ల, కొండచరియలు విరిగిపడటం వల్ల సునామీ వస్తుంది
సి) రోజులో ఏ సమయంలోనైనా సునామీ సంభవించవచ్చు
డి) పైవన్నీ సరైనవే

8. తక్కువ వర్షపాతం కురవడం అంటే?
ఎ) సగటు వర్షపాతం కంటే తక్కువగా వర్షం పడటం
బి) సగటు వర్షపాతం కంటే 20-59 శాతం తక్కువగా వర్షం పడటం
సి) సగటు వర్షపాతం కంటే 19 శాతం ఎక్కువ నుంచి 19 శాతం తక్కువ వరకు వర్షపాతం ఉండడం
డి) సగటు వర్షపాతంలో 60 శాతం కంటే తక్కువగా వర్షం పడటం

9. కరువు ప్రభావం వల్ల ఏర్పడే తీవ్ర పరిణామాల్లో కింది వాటిలో లేనిది ఏది?
ఎ) భూగర్భ నీటిమట్టం పడిపోతుంది
బి) ప్రజల వలసలు పెరుగుతాయి
సి) వ్యవసాయ అనుబంధ రంగాల్లోని ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుంది
డి) పైవేవీ కావు

10. IWMPను విస్తరించండి.
ఎ) Integrated Watershed Management Programme
బి) Internal Water Management Programme
సి) Integrated Water Maintenance Project
డి) Internal Watershed Management Project

11. 'టెర్రరిజం' (ఉగ్రవాదం) అనే ఆంగ్ల పదం 'Terrorisme' అనే ఏ భాషాపదం నుంచి ఉద్భవించింది?
ఎ) గ్రీక్ బి) ఫ్రెంచ్
సి) లాటిన్ డి) ఇటాలియన్

12. భూకంపం సంభవించే ప్రాంతాన్ని ఏమని పిలుస్తారు?
ఎ) భూకంప నాభి
బి) భూకంప అధికేంద్రం
సి) భూకంప ద్రోణి
డి) భూకంప పరివాహం

13. భూకంపాలను నమోదు చేసే కేంద్రాలకు మొదటగా చేరే తరంగాలు ఏవి?
ఎ) P తరంగాలు బి) S తరంగాలు
సి) M తరంగాలు డి) L తరంగాలు

14. కింది వాటిలో 'ర్యాలీ తరంగాలు' ఏవి?
ఎ) P తరంగాలు బి) S తరంగాలు
సి) T తరంగాలు డి) L తరంగాలు

15. భూ ఉపరితలంపై నష్టానికి కారణమవుతున్న భూకంప తరంగాలు ఏవి?

టీఎస్‌పీఎస్సీ
టీఆర్‌టీ
ఎస్‌జీటీ - సోషల్ స్టడీస్
ప్రత్యేకం

ఎ) ప్రాథమిక తరంగాలు
బి) గౌణ తరంగాలు సి) దీర్ఘ తరంగాలు
డి) చర్యశీలా తరంగాలు

16. లోతునాభి (Deep Focus) భూకంపాలు అంటే?
ఎ) భూకంప నాభి లోతు 300కి.మీ. కంటే అధికంగా ఉండి ఏర్పడే భూకంపాలు
బి) భూకంప నాభి లోతు 500కి.మీ. కంటే అధికంగా ఉండి ఏర్పడే భూకంపాలు
సి) భూకంప నాభి లోతు 300కి.మీ.- 500కి.మీ. మధ్య ఉండి ఏర్పడే భూకంపాలు
డి) భూకంప అధికేంద్రానికి అతి లోతుగా ఏర్పడే భూకంపాలు

17. కింది వాటిలో భూకంపాలు సంభవించడానికి కారణం కానిది ఏది?
ఎ) హిమ సంపాతాలు
బి) భూపాతాలు
సి) అత్యధిక స్థాయిలో అంతర్భూజల నిక్షేపాలను వినియోగించడం
డి) పైవేవీ కావు

18. అత్యధికంగా భూకంపాలు సంభవించే ప్రాంతాల్లో కింది వాటిలో లేనిది ఏది?
ఎ) అల్యూషియన్ ద్వీపాలు
బి) కాకసస్ పర్వతాలు
సి) కురైల్ ద్వీపాలు డి) అక్కైషీ పర్వతాలు

19. కింది వాటిలో అత్యంత తీవ్ర భూకంపం ఏది?
ఎ) కోయనా భూకంపం (మహారాష్ట్ర- 1967)
బి) ఉత్తర కాశీ భూకంపం (ఉత్తరప్రదేశ్- 1991)
సి) లాతూరు భూకంపం (మహారాష్ట్ర- 1993)
డి) భుజ్ భూకంపం(గుజరాత్- 2001)

20. 'ఫూజితా స్కేలు' ఏ ప్రకృతి విధ్వంసాన్ని వర్గీకరిస్తుంది?
ఎ) భూకంపాలు బి) టోర్నెడోలు
సి) సునామీలు డి) భూపాతాలు

21. జాతీయ విపత్తుల నిర్వహణ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
ఎ) డిసెంబర్ 28 బి) అక్టోబర్ 29
సి) మే 10 డి) జూన్ 27

22. సాధారణంగా సునామీ సగటు వేగం ఎంత ఉంటుంది?
ఎ) 800 కి.మీ./గం.
బి) 500 కి.మీ./గం.
సి) 1000 కి.మీ./గం.
డి) 200 కి.మీ./గం.

23. ఇంటర్నేషనల్ సునామీ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఎక్కడ ఉంది?
ఎ) ఇవా (హవాయి)
బి) హోనోలులు (హవాయి)
సి) పాల్మర్ (అలస్కా) డి) గోవా

24. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థను ఏ సంవత్సరంలో నెలకొల్పారు?
ఎ) 2005 బి) 2006
సి) 2008 డి) 2009

25. జాతీయ విపత్తు స్పందన దళం (National Disaster Response Force) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
ఎ) హైదరాబాద్ బి) చెన్నై
సి) న్యూఢిల్లీ డి) ముంబై

26. కింది వాటిలో విపత్తు నిర్వహణ చర్యల్లో భాగం కాని కార్యక్రమం ఏది?
ఎ) సహాయక చర్యలు చేపట్టడం
బి) నియంత్రణ
సి) పునరావాసం కల్పించడం
డి) ఉపశమన చర్యలు

27. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఎవరు వ్యవహరిస్తారు?
ఎ) కేంద్ర హోం మంత్రి
బి) కేంద్ర రక్షణ మంత్రి
సి) కేంద్ర పర్యావరణ విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి
డి) ప్రధానమంత్రి

28. 'డిజాస్టర్' (విపత్తు) అనే ఆంగ్ల పదం 'Dusaster' అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. దాని అర్థం ఏమిటి?
ఎ) ప్రమాదకరమైన పక్షి
బి) దుష్ట రాక్షసి సి) చెడు నక్షత్రం
డి) శాంతి దేవత

29. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 7.0గా నమోదైతే, అది ఎన్ని అణుబాంబుల శక్తితో సమానంగా అంచనా వేస్తారు?
ఎ) 100 బి) 1000
సి) 10 డి) 10,000

30. ఇప్పటివరకు అత్యధిక ప్రాణ నష్టం కలిగించిన తుఫాన్ ఏది?
ఎ) కత్రినా బి) టిప్
సి) భోలా డి) ఐలా

31. భూకంప సముద్ర తరంగం అంటే?
ఎ) భూకంపం బి) సునామీ
సి) టోర్నెడో డి) భూపాతం

32. 'టోర్నెడో' అనే ఆంగ్ల పదం 'Tronada' అనే స్పానిష్ భాషాపదం నుంచి వచ్చింది. దాని అర్థం ఏమిటి?
ఎ) గాలి తుఫాను బి) మెరుపుల వర్షం
సి) భయంకరమైన ఉరుము
డి) ఉరుముల తుఫాను

33. అతి తీవ్రమైన టోర్నెడోల వాయువేగం గంటకు ఎన్ని కిలోమీటర్లు?
ఎ) 100 పైన బి) 200 పైన
సి) 300 పైన డి) 500 పైన

34. కాన్సాస్ (USA) నగరంలోని ఒక పిండి బస్తా ఏ ప్రకృతి విపత్తు వల్ల 177 కి.మీ. దూరంలోని ప్రదేశంలో లభించింది?
ఎ) సునామీ బి) భూపాతం
సి) వరదలు డి) టోర్నెడో

35. ప్రపంచంలోనే అత్యంత తీవ్రమైన టోర్నెడోలు ఏ దేశంలో సంభవిస్తున్నాయి?
ఎ) యు.ఎస్.ఎ. బి) కెనడా
సి) బంగ్లాదేశ్ డి) న్యూజిలాండ్

36. భూపాతాలకు దారితీసే ప్రధాన కారణాల్లో కింది వాటిలో లేనిది ఏది?
ఎ) భూసహజ ప్రకంపనలు
బి) అటవీ నిర్మూలన
సి) శిలా శైథిల్యం డి) గనుల తవ్వకం

37. 'అంతర్జాతీయ ప్రకృతి వైపరీత్యాల తగ్గింపు దశాబ్దం'గా యూఎన్‌వో ఏ కాలాన్ని ప్రకటించింది?
ఎ) 2000-2010 బి) 1990-2000
సి) 2005-2015 డి) 2010-2020

38. కింది వాటిలో 'కేంద్రీయ ఉద్భేదనం' ద్వారా ఏర్పడిన అగ్నిపర్వతం ఏది?
ఎ) ఎట్నా బి) క్రాకటోవా
సి) కిలిమంజారో డి) హెల్యాకోలా

39. కింది వాటిలో ప్రపంచ మధ్య పర్వత మేఖలలో ఉన్న అగ్నిపర్వతం ఏది?
ఎ) వెసూవియస్ బి) ఫ్యూజియామా
సి) బారెన్ డి) మానాలోవా

40. 'మధ్యధరా సముద్రపు దీపస్తంభం' అని ఏ అగ్నిపర్వతాన్ని పిలుస్తారు?
ఎ) కిలిమంజారో బి) స్ట్రాంబోలి
సి) నార్కొండం డి) ఫ్యూజియామా

41. సార్క్ దేశాల విపత్తు నిర్వహణ కేంద్రం ఎక్కడ ఉంది?
ఎ) ఢాకా బి) కొలంబో
సి) ఖాట్మండ్ డి) న్యూఢిల్లీ

42. ప్రపంచ విపత్తు నివేదికను ఎవరు తయారు చేస్తారు?
ఎ) యూఎన్‌వో
బి) ఇంటిగ్రేటెడ్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్
సి) ఇంటర్నేషనల్ రెడ్‌క్రాస్ సొసైటీ
డి) ఇంటర్నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆర్గనైజేషన్

43. విపత్తు నిర్వహణలో అత్యంత ముఖ్యమైన అంశం ఏది?
ఎ) ఉపశమన చర్యలు
బి) విపత్తు హెచ్చరిక సి) పునరావాసం
డి) నష్ట నివారణ చర్యలు

సమాధానాలు

1) బి	2) డి	3) ఎ	4) డి	5) ఎ
6) డి	7) డి	8) బి	9) డి	10) ఎ
11) బి	12) ఎ	13) ఎ	14) డి	15) సి
16) ఎ	17) డి	18) బి	19) డి	20) బి
21) బి	22) ఎ	23) బి	24) ఎ	25) సి
26) బి	27) డి	28) సి	29) ఎ	30) సి
31) బి	32) డి	33) ఎ	34) డి	35) సి
36) ఎ	37) బి	38) ఎ	39) ఎ	40) బి
41) డి	42) సి	43) బి		

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. ఆఫ్రికాలోని 'గుడ్‌హోప్ అగ్రం' వద్ద భూకంపం సంభవించింది. దాని 'S' తరంగాలు కింది వాటిలో ఏ ప్రాంతానికి ముందుగా చేరుతాయి? *(డీఎస్సీ-2012)*
ఎ) బ్రెజిల్ బి) ఈజిప్ట్
సి) ఆస్ట్రేలియా డి) అంటార్కిటికా

2. 2004లో హిందూ మహాసముద్రంలో వచ్చిన చారిత్రాత్మక సునామీ మాగ్నిట్యూడ్ ఎంత? *(డీఎస్సీ-2012)*
ఎ) 6.0 బి) 7.0
సి) 8.0 డి) 9.0

3. ప్రపంచంలో అత్యంత చురుకుగా ఉన్న అగ్నిపర్వతం ఏది? *(టెట్-2017)*
ఎ) మౌంట్ వెసూవియస్
బి) స్ట్రాంబోలి
సి) మౌంట్ కిలిమంజారో
డి) ఫ్యూజియామా


4. మెక్సికో సింధుశాఖలో ఏర్పడే చక్రవాతాలను ఏమంటారు? *(టెట్- 2014)*
ఎ) టైఫూన్లు బి) హరికేన్లు
సి) సైక్లోన్లు డి) విల్లీ-విల్లీ

5. ద్రవ పదార్థాల ద్వారా ప్రసరించలేని భూకంప తరంగాలు ఏవి? *(డీఎస్సీ-2006)*
ఎ) S తరంగాలు బి) M తరంగాలు
సి) L తరంగాలు డి) P తరంగాలు

సమాధానాలు

1) బి 2) డి 3) బి 4) బి 5) ఎ

అంకెలు కలపండి రంగులు వేయండి




నాన్నా చెప్పవా

గాల్లోంచి నీటిని వేరు చేయవచ్చా?



గాల్లో అనేక వాయువులతో పాటు నీటి ఆవిరి కూడా ఉంటుందన్న సంగతి మీకు తెలుసు కదా. గాలిలోని ఈ నీటి ఆవిరిని చల్లార్చి, వేరు చేయడం ద్వారా మనం మంచి తాగునీటిని పొందవచ్చు. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకుని ''వాటర్ మిల్'' (జలయంత్రం) పేరుతో శాస్త్రజ్ఞులు ఈ మధ్యనే ఒక ప్రత్యేక పరికరాన్ని రూపొందించారు. వాటర్ ఫిల్టర్ లాగా చాలా సులభంగా వాడుకొనేందుకు వీలయ్యే ఈ సాధనం త్వరలోనే ప్రపంచమంతటా అందుబాటులోకి వస్తుందని అంటున్నారు. ఏ ప్రదేశంలో ఉంచినప్పటికీ అక్కడి గాలిని స్వీకరించి, అందులోని నీటి ఆవిరిని వేరుచేసి, దానిని చల్లార్చి నీరుగా మార్చి ఈ పరికరం మనకు అందిస్తుంది. ఎడారి ప్రాంతాలు, నీటికి కటకటగా వుండే ప్రాంతాల వారికి 'వాటర్‌మిల్' ఒక వరం లాంటిదే అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఇప్పటికి కొన్ని వేల సంవత్సరాల కిందట మన భూగోళం మీద కొన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ తమ నీటి అవసరాలను తీర్చుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. క్రిమియా అనే ఎడారి ప్రాంతంలో నివసించే ప్రజలు దాదాపుగా ఒక పిరమిడ్ ఆకారంలో వుండే కట్టడాలను నిర్మించి వాటి సాయంతో మంచినీటిని ఉత్పత్తి చేసుకునే వారు.


సముద్రం నుంచి బయలుదేరి ఎడారి మీదుగా ప్రయాణించే గాలి కొన్ని ప్రత్యేకమైన ఏర్పాట్ల ద్వారా పిరమిడ్ (లాంటి కట్టడం) లోకి వెళ్లేది. ఆ వేడిగాలి పిరమిడ్‌లోకి వెళ్లగానే దాని లోపలి గోడలకు తగిలి చల్లబడేది. ఇందుకు అనువుగా ఆ కట్టడం లోపలి గోడల్లో లెక్కలేనన్ని రంధ్రాలు, చిన్న చిన్న సొరంగ మార్గాలు వుండేవి. ఇలా సముద్రపు గాలి చల్లబడగానే అందులోని నీటి ఆవిరి చిన్న చిన్న తుంపరల్లాగా పిరమిడ్ గోడలకు అంటుకొనేది. ఈ ప్రక్రియ మళ్లీ మళ్లీ జరుగుతూ వుండడంతో చిన్న చిన్న నీటి తుంపరలు క్రమేణా పెద్ద చుక్కలుగా మారి, రాతి కట్టడం గోడల వెంబడి జారి కిందికి చేరుకునేవి. ఆ విధంగా కట్టడం కింది భాగంలో పెద్ద మొత్తంలోనే నీరు సేకరించబడేది. పురాతత్వ శాస్త్రజ్ఞులు జరిపిన తవ్వకాలలో ఇలాంటి కట్టడాలు బయట పడినప్పుడు వారి తెలివితేటలకు నిజంగానే అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు.




పక్కన రెండు బొమ్మల మధ్య 10 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.

లెక్కించండి

కింది బొమ్మలో ఎన్ని త్రికోణాలు ఉన్నాయో లెక్కించండి



కింద ఇచ్చిన ఆవు బొమ్మను పక్కన ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి.



పక్కన ఉన్న ఆరు నీడలలో కింద రంగులలో ఉన్న బొమ్మ అసలైన నీడ ఏదో గుర్తించండి



త్రికోణాలు: 28

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు



స్వామికి మంగళహారతులు ఇస్తున్న మహిళలు

కొండపాక (గజ్వేల్): మండల పరిధిలోని సిర్సనగండ్ల గ్రామంలో గల రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాలు అత్యంత వైభంగా సాగుతున్నాయి. ప్రతిరోజూ ఉదయం 5 నుంచి 5.30 గంటల వరకు ఆలయ పూజారి అజయ్ ఆండాతల్లీ పార్శ పారాయణం చేయిస్తున్నారు. భక్తులు భజనలు చేస్తున్నారు. ఆదివారం మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. మొక్కులు చెల్లించుకున్నారు. పూజారి అజయ్ మాట్లాడుతూ నెల రోజుల పాటు భక్తులు పారాయణం చేయడంతో పాప విముక్తులు కావడంతో పాటు సంతోషంగా ఉంటారన్నారు. జనవరి 13వ తేదీ బోగి పండుగ రోజు గోదాదేవి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేత్రపర్వంగా అధ్యయనోత్సవాలు



నాచగిరీశుడికి పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రంలో స్వామివారి అధ్యయనోత్సవాలు నేత్రపర్వం చేస్తున్నాయి. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం రెండో రోజు శ్రీలక్ష్మీ నృసింహ స్వామివారికి, నమ్మాళ్వారులకు పంచామృతాభిషేకం చేశారు. ఉపనిషత్ పారాయణాలు, ద్రావిడ ప్రబంధ పారాయణాలు చేశారు. నవకలశ స్నపనం తదితర పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొట్టాల యాదగిరి, ఈఓ సుధాకర్‌రెడ్డి, ధర్మకర్త చంద్రారెడ్డి వేడుకల్లో భాగస్వాములయ్యారు. కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధ్యయనోత్సవాలు పురస్కరించుకుని స్వామివారు నాచగిరి తిరువీథుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. నేత్రపర్వంగా సాగిన ఈ మహోత్సవంలో భక్తులు పాల్గొని తరించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తిరుప్పావై కాలక్షేపం

అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం క్షేత్రంలో తిరుప్పావై కాలక్షేపం జరిగింది. వంగీపురం శ్రీనివాసాచార్యులు పదహారవ పాశురాన్ని తాత్పర్య సహితంగా వివరించారు.

కబ్జాకు గురవుతున్న భూములు

- పట్టించుకోని అధికారులు
- టీడీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దేవీ రవీందర్

గజ్వేల్‌రూరల్:

జిల్లాలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని టీడీబీఎస్(దళిత బహుజన శక్తి) రాష్ట్ర అధ్యక్షుడు దేవీ రవీందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు చాలా వరకు అన్యాక్రాంతమై అక్రమార్కుల చేతుల్లోకి చేరుతున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో కబ్జాకు గురైన చెరువులు, కుంటల భూములను సర్వే చేసి కంచె ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులకు పంపిణీ చేసేందుకు సరైన భూములు లేవని ప్రభుత్వం చెబుతుండగా... కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకొని వాటిని దళిత కుటుంబాలను అందజేయాలని కోరారు. టీడీబీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, మెదక్ జిల్లా ఇన్‌చార్జి అరిగె అశోక్, జిల్లా కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.

2017కు వీడ్కోలు.. 2018కి స్వాగతం



కేక్ కట్ చేసి మహిళల కేరింతలు



వస్తువులు కొనుగోలు చేస్తున్న దృశ్యం

2017కు విడ్కోలు.. 2018కి స్వాగతం అంటూ జిల్లా ప్రజలు నూతన సంవత్సరానికి ఆత్మీయంగా స్వాగతం పలికారు. నూతన సంవత్సరంలో అందరికీ శుభాలు జరగాలని జిల్లావాసులు కోరుకుంటున్నారు. సిద్దిపేట జిల్లా ముందుగానే ఆదివారం నూతన సంవత్సరానికి ముస్తాబైంది. ఉదయం నుంచి ప్రజలు 2017కు విడ్కోలు పలుకుతూ విందులు వినోదాలు చేసుకున్నారు. చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ కలిసి సంతోషంగా సందడి వాతావరణం సృష్టించారు.

- హ్యాపీ న్యూఇయర్ అంటూ కేరింతలు
- జిల్లాలో పండుగ వాతావరణం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో ఆదివారం ఉదయం నుంచే నూతన సంవత్సరం సంబరాలు చేసుకుంటున్నారు. గజ్వేల్, చేర్యాల్, హుస్నాబాద్, దుబ్బాక తదిర పట్టణాల్లోనూ యువకులు 2017 సంవత్సరం ముగింపు వేడుకలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు సమూహాలుగా ఏర్పడి విందులు చేసుకున్నారు. పాటలకు స్టెప్పులు వేస్తూ కనువిందు చేశారు. రెండు రోజులుగా పట్టణంలో బేకరీల వద్ద ప్రజలు అధికంగా కేక్‌లను ఖరీదు చేశారు. వెల్‌కమ్ టు న్యూయార్-2018 ఉండేలా తయారు చేయించుకుని ఆదివారం రాత్రి 12 గంటలకు కేక్‌లు కట్ చేయడానికి తీసుకెళ్లారు. నూతన సంవత్సరం రోజు వాకిళ్లను అందంగా తీర్చిదిద్దడానికి రంగులను కొనుగోలు చేశారు. మిత్రులు, బంధువులు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు పూల బుకేలు, గిఫ్టుల కోసం దుకాణాల వద్ద బారులు తీరారు. దీంతో పట్టణంలో పండుగ వాతావరణం వెల్లివిరిసింది. చిన్నారులు, యువతీ, యువకుల డ్యాన్స్‌లు, కేరింతలతో జిల్లా మార్మోగింది. సెండ్ ఆఫ్ 2017.. వెల్‌కమ్ 2018 అంటు పెద్దగా అరిచారు. సిద్దిపేటలోని వివిధ కాలానీలకు చెందిన కుటుంబ సభ్యులు 2017కు వీడ్కోలు చెప్పుకునేందుకు సువిశాలమైనా ప్రాంతాల్లో విందులు చేసుకున్నారు. ఆనందంతో సెల్ఫీలు తీసుకున్నారు. ఆటలు ఆడారు.

2018లో అందరికీ మంచి జరగాలి



2018 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలి. జిల్లా ప్రజలు క్షేమంగా ఉండాలి. ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి. ఈ సంవత్సరం అన్నీ శుభాలు కలిగేలా చూడాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా.

– జ్యోతి, సిద్దిపేట

ఉద్యోగాలు లభించాలి



2018 సంవత్సరంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాలి. విద్యార్థులు చదువులో విజయాలు సాధించాలి. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలి. జిల్లా ప్రజలకు ఎలాంటి బాధలు లేకుండా ఉండాలని కోరుకుంటున్నా.

– స్మిత, సిద్దిపేట

పంటలు బాగా పండాలి



నూతన సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురవాలి. రైతులు పంటలు బాగా పండించాలి. రాష్ట్రంలోని ప్రతి రైతుకు పంటలకు మద్దతు ధర లభించాలి. ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నా.

– లావణ్య, సిద్దిపేట

కొమురవెల్లిలో భక్తుల సందడి



గంగిరేగు చెట్టు వద్ద శివమెత్తిన భక్తులు



బోనంతో భక్తురాలు

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు భారీగా తరలిరావడంతో సందడి నెలకొంది. భక్తులతో మల్లన్న ఆలయ ప్రాంగణాలు మొత్తం నిండిపోయాయి. ఆలయ ప్రాంగణాలు మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. భక్తులు మల్లన్నకు ఒక్కపొద్దులతో బోనాలు తీసి గంగిరేగు చెట్టు వద్ద పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు భక్తులు ఆలయ ముఖ మండపంలో మల్లన్న నిత్యకల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలో వెళ్లి మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. ధర్మదర్శనంలో రెండు నుంచి మూడు గంటల సమయం పట్టింది. ప్రత్యేక దర్శనాల్లో గంటలోపు మల్లన్నను దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.



రాజగోపురం ఎదుట భక్తుల సందడి

బీడీ కార్మికుల పరిస్థితి దయనీయం

తెలంగాణ ఆల్ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ శంకర్

దుబ్బాక టౌన్ : తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న బీడీ పరిశ్రమ రోజురోజుకు కుచించుకుపోతోందని, ఈ పరిశ్రమపై ఆధారపడిన కార్మికుల పరిస్థితి దయనీయంగా తయారవుతోందని తెలంగాణ ఆల్ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తుమ్మ శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన దుబ్బాకలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 10 లక్షలకుపైగా బీడీ పరిశ్రమను నమ్ముకోని జీవిస్తున్నారన్నారు. కేంద్రం జీఎస్‌టీ విధించడంతో బీడీ పరిశ్రమ పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతోందన్నారు. బీడీ కట్టలపై పుర్రె గుర్తు, డేంజర్ బొమ్మలను పెట్టడంతోనే పరిశ్రమపై నీలినీడలు అలుముకున్నాయని తెలిపారు. బీడీలు చుట్టేవారు, ప్యాకింగ్, గంపచాట్, టేకేదార్లు, బట్టీవాలతో పాటు పరోక్షంగా లక్షలాది కార్మికులు ఆధారపడ్డారని అన్నారు. పరిశ్రమలు బంద్ అయితే వీరి పరిస్థితి రోడ్డున పడాల్సి వస్తుందన్నారు. బీడీ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమలు నెలలో ప్రస్తుతం 10 రోజులు కూడా సక్రమంగా నడవకపోవడంతో కార్మికుల కుటుంబాలు దినదిన గండంగా బతుకులు వెళ్లదీస్తున్నాయన్నారు. బీడీ కార్మికుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు.

సాక్షి
సిద్దిపేట
మన సిద్దిపేట
సోమవారం | జనవరి | 1 | 2018
5

హలో సాక్షి..
సిద్దిపేట: 98665 53321
సిద్దిపేట రూరల్: 90109 09073
సిద్దిపేట అర్బన్: 99859 16666
చిన్నకోడూరు: 97054 44264

కొత్త సంవత్సర కోలాహలం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2017కు బై బై చెప్పి, 2018కి హాయ్ హాయ్.. చెపుతూ నూతన సంవత్సరంలోకి అడుగువేశాము. కేకులు కట్ చేస్తూ, నృత్యాలు చేస్తూ నూతన సంవత్సరంలోకి ఎన్నో ఆశలతో, ఆనందంగా అడుగుపెడుతున్నారు. సిద్దిపేట పట్టణంలో నూతన సంవత్సరానికి చిన్నా పెద్ద వయస్సుతో నిమిత్తం లేకుండా నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొంటున్నారు.


న్యూ ఇయర్ వేడుకలలో యువతుల కేరింతలు

2017 సంవత్సరపు చివరిరోజయిన డిసెంబర్ 31ని యువకులు అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం నుంచే పట్టణంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలో ఉదయం నుంచే కలర్స్ అమ్మారు. బేకరీల వద్ద ప్రజలు బారులు తీరారు. నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవడానికి కేక్‌లను కట్ చేయాడానికి కేక్‌లు తీసుకుపోయి కట్ చేశారు. అదే విధంగా చిన్నారులులతో సహా పెద్దలు కేక్‌లు కట్ చేసి ఆనందాన్ని పొందారు. వివిధ గ్రామాల్లో, పట్టణాల్లోని వార్డులో గల ప్రజలు కుటుంబాలవారిగా గ్రూపులుగా విడిపోయి పార్టీలు చేసుకున్నారు. తమ నిర్ధేశించుకున్న గమ్యాన్ని సాధించాలని, తాము పెట్టుకున్న ఆశయాన్ని ఈ సంవత్సరంలో ఖచ్చితత్వంతో పూర్తిచేయాలని, వివిధ ఆశలతో కొత్త సంవత్సరంలోకి ప్రవేశించారు. విద్యా, ఉద్యోగం, కుటుంబ పరంగా స్థిరపడటం లాంటివి ఈ నూతన సంవత్సరంలో సాధించాలన్న తపనతో కొత్తగా అడుగులు వేస్తున్నారు. గత సంవత్సరం జ్ఞాపకాలు తలుచుకుంటేనే నూతన సంవత్సరం ఆరంభిస్తున్నారు. గత పాత జ్ఞాపకాలు మదిలో మెదులుతుండగా వాటిని గత పాత మధుర స్మృతులుగా తలుచుకుంటునే వివిధ ఆశలతో కొత్తగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఈ నూతన సంవత్సరంలో నూతనోత్సాహంతో తాము గత సంవత్సరంలో కన్న కళలు సాధించాలని ముందుకు సాగుతాం..



వెండితెర



సిద్దిపేటలో..

హలో
వెంకటేశ్వరా కళామందిర్
11.15, 2.15, 6.00,9.00.

ఎంసీప
శ్రీనివాస్ డీలక్స్
11.15, 2.15, 6.00,9.00

2 కంట్రీస్
బాలాజీ డీలక్స్ 11.00, 2.00, 6.00, 9.15.

ఎంసీప
సీతారామాంజనేయ

దేశ సంస్కృతిని కాపాడాలి...

చిన్నకోడూరు(సిద్దిపేట): నూతన సంవత్సర వేడుకలతో దేశ సంస్కృతిని దెబ్బతీస్తున్నారని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి అల్లం దుర్గాప్రసాద్ ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మన కొత్త సంవత్సర పండుగ ఉగాదిని ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గ్యాదరి రాజారాం తదితరులు పాల్గొన్నారు.

గీతా కార్మిక సంఘం ఎన్నిక

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు గ్రామ గీత కార్మిక పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మిట్టపల్లి నర్సాగౌడ్, ప్రధాన కార్యదర్శిగా రాజలింగం గౌడ్, ఉపాధ్యక్షులుగా బత్తిని పోచయ్య మరియు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నిరుద్యోగులతో చెలగాటమా!

వైఎస్సార్ సీపీ జిల్లా యువత ప్రధాన కార్యదర్శి విజయ్



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్

సిద్దిపేటటౌన్: నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన ధ్యేయంగా కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా నిరుద్యోగుల ప్రాణాలతో సీఎం కేసీఆర్ చెలగాటం ఆడుతున్నారని సిద్దిపేట జిల్లా వైఎస్సార్‌సీపీ యువత ప్రధాన కార్యదర్శి మేదరి విజయ్ ఆరోపించారు. ఆదివారం సిద్దిపేటలో మాట్లాడుతూ నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, రాష్ట్ర సాధనకోసం ప్రాణాలను లెక్కచేయకుండా కొట్లాడిన నిరుద్యోగులను ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. 2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో యువత విభాగం జిల్లా ప్రచార కార్యదర్శి ప్రవీణ్, తిరుపతి, మధు, సాయి, దినేష్, రాజు, యాదగిరి, పాల్గొన్నారు.

గోడలే నిర్మాణాలు



చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో గొడలన్నీ నిర్మాణాలుగా మారుతున్నాయి. అంతగిరి ప్రాజెక్టు భూ సేకరణలో భాగంగా పలువురు భూములను కోల్పోతున్నారు. వారిలో కొందరు భూ పరిహారంపై ఆశతో అధికంగా డబ్బులు వస్తాయని గొడలనే నిర్మాణాలుగా మార్చుతున్నారు.

అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు

నంగునూరు(సిద్దిపేట): నీటిపారుదల శాఖమంత్రి హరీశ్‌రావు చేసిన కృషితో అన్ని గ్రామాలరకు వైంకుంఠధామాలు మంజూరయ్యాయని ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాంపూర్‌లో వైకుంఠ ధామం నిర్మాణాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని చాల గ్రామాల్లో ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభమయ్యాయన్నారు. గ్రేవీ యార్డుల్లో నీటి వసతి, టాయిలెట్ల నిర్మాణాలు చేపట్టి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, మురళి, శంకర్, గఫూర్, తిరుపతి, రవి, తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

సైడ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్ గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న బావి ప్రమాదకరంగా మారింది. ఇటీవల సాక్షిలో 'పొంచి ఉన్న ముప్పు' అనే కథనం వెలువడింది. స్పందించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు అప్రమత్తమయ్యారు. ఆదివారం పంచాయతీ రాజ్ ఏఈ బ్రహ్మం, గ్రామ సర్పంచ్ ఏలేటి అరుణలు ప్రమాదకరంగా ఉన్న బావి పక్కన సైడ్‌వాల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ నిర్మాణం పూర్తయితే ప్రమాదాలు జరిగే ఆస్కారం తగ్గుతుందని స్థానికులు సంతోషిస్తున్నారు.



బావి పక్కన సైడ్ వాల్ నిర్మాణ పనులు చేపడుతున్న అధికారులు

తడి,పొడి చెత్త విభజన

సిద్దిపేటజోన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆదివారం తడి, పొడి చెత్త సేకరణ ప్రక్రియను స్థానిక 32వ వార్డులో వేగవంతం చేశారు. మున్సిపల్ ఏఈ రఘు, మెప్మా అధికారి సాయికృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటి నుంచి చెత్తను సేకరించారు. సేకరించిన చెత్తను మున్సిపల్ సిబ్బంది ద్వారా డంప్‌యార్డుకు తరలించారు.

వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్‌గా రాజేందర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాసవిక్లబ్ సిద్దిపేట జిల్లా గవర్నర్‌గా కొర్తివాడ రాజేందర్ ఎన్నికయినట్లు వాసవిక్లబ్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఏన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు.

బీజేపీ అర్బన్ మండల అధ్యక్షుడిగా లింగారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట మండల అర్బన్ బీజేపీ అధ్యక్షుడిగా వంగా లింగారెడ్డి నియమితులైనారు. ఆదివారం జిల్లా అధ్యక్షుడు నరోత్తం రెడ్డి లేఖ ద్వారా నియమాక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మార్కెండేయులు, యాదగిరి, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చేర్యాల(సిద్దిపేట): మండల మున్నూరు కాపు సంఘం క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక మున్నూరు కాపు సంఘ భవనంలో ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీధర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి శిల్ప కళా వైభవం

చిన్నకోడూరు(సిద్దిపేట): యాదాద్రిలో ఈ నెల 21న ఒక వెయ్యి 116 మంది కవులతో యాదాద్రి శిల్పకళా వైభవం జరగనున్నట్లు సిద్దిపేట జిల్లా ఉదయ కళానిధి బాధ్యులు వరుకోలు లక్ష్మయ్య పేర్కొన్నారు. జనవరి 21 యాదాద్రిలో ఉదయ కళానిధి సాహిత్య సేవ సంస్థ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరుగనుందన్నారు. ఈ ఉత్సవాన్ని జయప్రదం చేయాలని కవులందరికి తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రాలతో పాటు సన్మానం చేయడం జరుగుతందన్నారు.

ఏబీవీపీ క్యాలెండర్ ఆవిష్కరణ

బెజ్జంకి(సిద్దిపేట): ఏబీవీపీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఆ సంఘం నియోజకవర్గ కన్వీనర్ క్రాంతికిరణ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి దోనె అశోక్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం నిరంతరంగా వారి వెంట ఉండి ఉద్యమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధిలో యువతే కీలకం

బెజ్జంకి(సిద్దిపేట): గ్రామ అభివృద్ధిలో యువత కీలకమని (ఎన్‌వైకె) నెహ్రూ యువ కేంద్ర బజరంగ్ యూత్ సభ్యులు రమేష్ పేర్కొన్నారు. మండలంలోని రేగులపల్లెలో ఆదివారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి యువత పట్టుగొమ్మలని, అన్నింటిల ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌రెడ్డి, ఎసర్ల ప్రవీణ్, జాప శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు టీడీపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు దరిపల్లి శ్రీనివాస్ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. నూతన సంవత్సరం అందరికీ సకల శుభాలు కలగించాలని కోరుకున్నారు.

ఇంటర్వ్యూ

నాగేశ్వర్
అంశం: పశువులపాక నిర్మాణాలు
ఎంపీడీఓ, నంగునూర్



నంగునూరు(సిద్దిపేట):

సాక్షి: నంగునూరు మండలానికి ఎన్ని పశువుల పాకలు మంజూరయ్యాయి?

అధికారి: మండలంలోని 24 గ్రామాలకు గాను 684 పశువుల పాకలు మంజూరయ్యాయి.

సాక్షి: ఒక్కో పాక నిర్మాణానికి ఎన్ని డబ్బులు అందజేస్తారు?

అధికారి: ఒక్కో నిర్మాణం కోసం ప్రభుత్వం రూ 56,047 అందజేస్తుంది.

సాక్షి: ఇప్పటి వరకు ఎన్ని నిర్మాణాలు పూరైయ్యాయి? ఎంత మందికి బిల్లులు చెల్లించారు?

అధికారి: ఇప్పటి వరకు 214 పశువుల పాకలు పూర్తయ్యాయి. అందులో 166 మంది లబ్ధిదారులకు బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు వేశాం. ఇంకా 48 మందికి అందించాల్సి ఉంది. వారికి త్వరలోనే అందజేస్తాం.

సాక్షి: బిల్లులు చెల్లించడంలో జాప్యం జరగడంతోనే నిర్మాణాలు చేపట్టడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు ?

అధికారి: రెండు నెలలుగా బిల్లులు రానిమాట నిజమే. కాని బిల్లుల చెల్లించడంలో జాప్యంతోనే పశువుల పాకలు కట్టుకోవడం లేదని చెప్పడం సరికాదు. ఇప్పటి వరకు నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి అక్టోబర్ నెల వరకు పూర్తిగా బిల్లులు చెల్లించాం.

సాక్షి: మిగతా నిర్మాణాలు ఎప్పటి వరకు పూర్తి చేయిస్తారు ?

అధికారి: నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని, లేకుంటే రద్దు చేస్తామని అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించాం. రెండు నెలల్లోపు నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

సాక్షి: రైతులకు ఎమైనా సలహాలు, సూచనలు ఇస్తారా?

అధికారి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పశువులపాక నిర్మాణాల పథకం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. నిర్మించుకున్న తరువాత బిల్లులు రావడంతో రైతులు డబ్బుల కోసం ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం రెండు విడతలుగా బిల్లులు చెల్లిస్తోంది. ఎమైనా సమస్యలు ఉంటే మాదృష్టికి తేవాలి. దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతు నిర్మాణం చేపట్టాలి, లేకుంటే రద్దవుతాయి.

హ్యాపీ.. హ్యాపీ.. 'న్యూ ఇయర్'

- మార్కెట్‌లో కేక్స్, పూలు, రంగుల విక్రయాలు
- గ్రీటింగ్స్ కొనుగోలులో యువత ఆసక్తి
- మద్యం షాపుల వద్ద మద్యం ప్రియుల సందడి
- ఫుల్ జోష్‌లో యువత
- కొంగొత్త ఆశలతో 2018కి స్వాగతం



వేడుకల్లో యువతుల సందడి



కేకులను కొనుగోలు చేస్తున్న ప్రజలు



సిద్ధంగా ఉన్న స్పెషల్ కేకు

దుబ్బాక: హ్యాపీ.. న్యూ ఇయర్ విష్యూ హ్యాపీ.. న్యూఇయర్ అంటూ 2018కి నియోజకవర్గ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. 2017 ఏడాదికి వీడ్కోలు పలికి నూతన సంవత్సరమైన 2018ని సాదరంగా ఆహ్వానించారు. వేడుకలకు నియోజకవర్గంలోని దుబ్బాకతోపాటు మిరుదొడ్డి, తొగుట, దౌల్తాబాద్, రాయపోల్ మండలాల్లోని ప్రధాన పుణ్యక్షేత్రాలు, చర్చీలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండల కేంద్రమైన దుబ్బాకలోని బేకరి, పూల దుకాణాలు,రంగుల దుకాణాలు ఆదివారం కొనుగోలు దారులతో కిక్కిరిసి పోయాయి. నిన్న మొన్నటి వరకు కిలో పూలకు రూ. 150 ఉండగా ఆదివారం ఒక్కరోజే కేజీ పూలకు రూ. 200 పలికాయి. పట్టణంలో ఉన్న నాలుగైదు బేకరి దుకాణాల్లో సుమారుగా 10 వేల వరకు కేకులు అమ్ముడు పోయాయి. మార్కెట్‌లో చోటా భీమ్, రాబిట్, పీకాక్, గీటార్, జలకన్య, మిక్కి మౌస్, బార్బీ, ఫ్లవర్ లాంటి కేక్‌లను రంగు రంగులతో ఆకర్షణీయంగా తయారు చేశారు. కొనుగోలు దారులు ఎగబడి కొనుగోలు చేశారు.

వేడుకలకు సర్వం సిద్ధం..

క్రైస్తవులు మాత్రం చర్చీలల్లో రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. మసీదులల్లో సహితం ముస్లింలు నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక నమాజ్ చేశారు. హిందూ దేవాలయాల్లో కూడా 2017 ఏడాది కంటే 2018 ఏడాదిలో మరింత మంచిగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా పడి ప్రజలు, జంతుజలాలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. రాత్రి 12 గంటలకు దుబ్బాకలోని రామసముద్రం చెరువు కట్టపై రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి చేతుల మీదుగా కేక్‌ను కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేశారు.

దుబ్బాకరూరల్: 2017 సంవత్సరానికి వీడ్కోలు పలికి 2018వ, సంవత్సరంలోకి అడుగు పెడుతున్న తరుణంలో అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటిన తర్వాత ప్రతి ఒక్కరూ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ముంగిళ్లల్లో వివిధ రకాల రంగు రంగుల ముగ్గులు మార్కెట్లో సిద్దంగా ఉయి. ప్రజలు రంగు రంగుల ముగ్గలను కొనుగోలు చేస్తున్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవడానికి చిన్నారులతో పాటు, యువతీ యువకులు, విద్యార్థులు సింద్ధయ్యారు. న్యూ ఇయర్ వేడుకల కోసం మార్కెట్లో కేక్‌ల అమ్మకాలు జోరందుకున్నాయి.



దుబ్బాకలో పూలను కొనుగోలు చేస్తున్న ప్రజలు



దుబ్బాకరూరల్: మార్కెట్‌లో అమ్మకానికి రంగుల ముగ్గులు



రాయపోలు(దుబ్బాక): మండలంలోని వడ్డేపల్లికి చెందిన కురుమ యువజన సంఘం సభ్యులు గ్రామంలో శ్రమదానం చేశారు. సంఘం సభ్యులు అంతా కలిసి ఆదివారం గ్రామంలోని వీధులు శుభ్రం చేశారు. హరితహారం కింద నాటిన మొక్కల వద్ద మొలకెత్తిన పిచ్చిమొక్కలు తొలగించారు. వీధులను శుభ్రం చేశారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9989066762

న్యూస్ బాక్స్

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



ఎమ్మెల్యే రామలింగారెడ్డి

దుబ్బాక టౌన్: దుబ్బాక నియోజక వర్గ ప్రజలు, అధికారులకు రాష్ట్ర శాసన సభ అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2018 నూతన సంవత్సరంలో ప్రజలు, రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, రాజకీయ నాయకులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో నియోజక వర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి ఫలాలు అందుబాటులోకి వస్తాయన్నారు. నియోజక వర్గంలో ఇళ్లు లేని నిరుపేదలకు సొంతింటి కల నిజం చేస్తామని, దుబ్బాకలో 100 పడకల ఆస్పత్రి, రామసముద్రం, పెద్దచెరువు, క్యాంపు కార్యాలయం, టౌన్ హాల్, సీఎం కేసీఆర్ చదివిన బడితో పాటు చాల అభివృద్ధి పనులు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరుగుతుందన్నారు.

గౌడ సంక్షేమానికి ప్రభుత్వం కృషి



శ్రీనివాసగౌడ్

తొగుట(దుబ్బాక): గౌడ కులస్తుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మరుపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మట్లాడుతూ గీత కార్మికులు చెల్లిస్తున్న చెట్టు పన్ను రద్దుతో వేలాది కుటుంబాలకు మేలు జరగుతుందన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో రూ 1.5కోట్లతో గౌడ్ ఫంక్షన్‌హాల్ నిర్మించడం గొప్ప విషయమన్నారు. గత ప్రభుత్వాలు గౌడ కులాన్ని విస్మరించాయని ఆరోపించారు. ప్రజల అడగకున్నా వారి అవసరాలను గుర్తించి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం సబ్బండ వర్గాల సంక్షేమం కోసం కృషిచేస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని కులాలకు తగిన గుర్తింపు ఇచ్చి ఆదుకుంటున్న సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలబడాలని ఆయన కోరారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

మిరుదొడ్డి(దుబ్బాక): ధనుర్మాసోత్సవాల సందర్భంగా మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా పూజలు జరిగాయి. స్వామి వారికి పంచామృతాభిషేకాలు, వస్త్రాలంకరణ, పుష్పార్చన, కుంకుమార్చన, దీపారాధనతో పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మంగళ హారతులతో పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు అప్పన్ందాడై వరదాచార్యులు, పార్థసారథి, విఠాల రాజపున్నయ్య శర్మ, చంద్రశేఖర్ శర్మ, రమేశ్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు అంజిరెడ్డి, చంద్రమౌళి, మల్లయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

రాయపోలు(దుబ్బాక): దళితులపై దాడిచేసిన వారికి శిక్షపడేలా చూడాలని కోరుతూ ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కొండపాకలో డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి దళితులపై దాడిచేశారని, అతన్ని వెంటనే అరెస్టు చేసి శిక్షపడేలా చూడాలని ఎంఎస్ఎఫ్ నాయకులు సింహాచలం ఆధ్వర్యంలో పలు దళిత సంఘాల నాయకులు ఆదివారం దౌల్తాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి విన్నవించారు.

లోకల్ వాయిస్

డ్వాక్రా భవనాన్ని హనుమాన్ ఆలయం సమీపంలోనే నిర్మించాలి



దుబ్బాక: దుబ్బాక నగర పంచాయతీ పరిధిలోని లచ్చపేటకు రూ. 10 లక్షల నిధులను డ్వాక్రా భవనాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామంలోని 40 మహిళా సంఘాల సభ్యులకు అనుకూలంగా ఉన్న హనుమాన్ ఆలయ సమీపంలోని స్థలంలోనే డ్వాక్రా భవనాన్ని నిర్మించాలి. ఇక్కడ డ్వాక్రా భవనాన్ని నిర్మించొద్దని కొంత మంది స్వార్థ రాజకీయ నాయకులు అడ్డుకోవడమే కాకుండా కొందరిని రెచ్చగొడుతున్నారు. ఇలాంటి వ్యక్తుల ఆటలు సాగనివ్వం. మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదు. కేసీఆర్ ప్రభుత్వం మహిళల కోసం నిర్మించతపెట్టిన డ్వాక్రా భవనానికి మహిళా లోకమంతా మద్దతుగా నిలుస్తుంది

–ధాత్రిక భాగ్యలక్ష్మి, టీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు, దుబ్బాక నగర పంచాయతీ



వెండితెర



దుబ్బాక:హలో (శ్రీనివాస)-11.00,2.00,6.009.00
గజ్వేల్:MCA (సంతోష్) - 11.00,2.00,6.009.00
గజ్వేల్:హలో (యాదగిరి)-11.00,2.00,6.009.00

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామలింగారెడ్డి

దుబ్బాక టౌన్:

దుబ్బాక నగర పంచాయతీ పరిధిలోని చెల్లాపూర్‌లో ఇటీవల మృతిచెందిన వంగ చిన్న మల్లారెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుండవెల్లి ఎల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అమ్మన రవీందర్‌రెడ్డి, నాయకులు తౌడ శ్రీనివాస్,సద్ది రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన చికెన్ ధరలు

దుబ్బాకరూరల్:

2017డిసెంబర్ 31 కావడం అదే విధంగా ఆదివారం రోజు కలిసి రావడంతో చికెన్ వ్యాపారులు ధరలు ఎక్కువగా పెంచారు. నిన్న మొన్నటిదాకా రూ.160 దాకా ఉన్న చికెన్ ధరలు చివరి సంవత్సరం కావడంతో రూ.180 పెంచారు. చికెన్ వ్యాపారులు తమకు ఇష్టానుసారంగా ధరలు పెంచి ప్రజల వద్ద డబ్బులు దోచుకుంటున్నారు. దీంతో మాములు ప్రజలు చికెన్ కొందామంటే జంకుతున్నారు.

బొగ్గు బ్లోయర్ పొయ్యి

దుబ్బాక: పొద్దుగాల్ల లేస్తే పల్లెల సంస్కృతికి నిలువుటద్దంలా నిలిచే పొయ్యి కనుమరుగవుతోంది. కట్టెల పొయ్యి, బొగ్గుతో నడిపించే పొయ్యి, కిరోసిన్ పొయ్యిలు కనుమరుగవ్వగా, తర్వాత వచ్చిన గ్యాస్ పొయ్యినే అత్యధిక జనం వాడుతున్నారు. పల్లెల్లో నిర్వహించే హోటళ్లల్లో బొగ్గు బ్లోయర్ పొయ్యిని వాడడం కనిపిస్తోంది. మారుమూల పల్లెల్లో బొగ్గుతో నడిపించే బ్లోయర్ పొయ్యి అక్కడక్కడ కనిపిస్తూ చూపరులకు కనివిందు చేస్తోంది.



ప్రజా సంక్షేమమే సీఎం లక్ష్యం

- పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం
- యాదయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం
- ఎమ్మెల్యే రామలింగారెడ్డి



కాన్గల్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామలింగారెడ్డి

తొగుట(దుబ్బాక):రాష్ట్ర ప్రజల కలలను సాకారం చేసేందుకు సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషిచేస్తున్నారని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కాన్గల్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించేందుకు ఆదివారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో దుబ్బాక నియోజకవర్గంలో ముందుందన్నారు. ఇళ్లులేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు వరం అన్నారు. యుద్ధ ప్రాతిపదికననిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అంతకు ముందు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న చింతమడ్క యాదయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎల్లయ్య, రాజాగౌడ్, ఎంపీటీసీ సభ్యుడు సత్తయ్య, ఏఎంసీ డైరెక్టర్లు శ్రీనివా స్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ స్వామి పార్టీ మం డల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు కొమురయ్య, కలీముద్దీన్, రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి ఉన్నారు.

సమాజ సేవలో యువత ముందుడాలి..

రాయపోలు(దుబ్బాక): యువత సమాజసేవను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండలంలోని కోనాపూర్‌లో ఆదివారం జై భీం యువజన సంఘం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువతకు దేశభక్తి, సమాజసేవ అవసరమన్నారు. బాల్యవివాహాలు, మూఢవిశ్వాసాలపై యువజన సంఘాలు ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా యువజన సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, నాయకులు భూపాల్‌రెడ్డి, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

Zone Guide

నేడు ప్రత్యేక పూజలు

దుబ్బాకరూరల్: మండలం చౌదర్‌పల్లిలోని శ్రీదుబ్బరాజేశ్వరస్వామి దేవాలయంలో ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దేవాలయానికి మండలంలోని భక్తులే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

శిథిలావస్థలో కచీర్



దుబ్బాక: మండలంలోని చీకోడ్‌లో నైజాం కాలంలో నిర్మించిన కచీర్ శిథిలావస్థకు చేరింది. నైజాం జమానాలో దొంగతనాలు, నేరాలకు పాల్పడ్డ వారిని కచీర్‌లో వేసి శిక్షించేవారు. కాలక్రమేణ ఆ కచీర్ గ్రామపెద్దలు , గ్రామ సేవకులు, అధికారులకు సేద తీర్చుకోవడానికి , అప్పుడప్పుడు సమావేశాలు నిర్వహించుకోవడానికి అనువుగా ఉండేది. శిథిలావస్థకు చేరిన కచీర్‌ను పునరుద్ధరించాలని జనం కోరుతున్నారు.

ఇంటర్వ్యూ





మల్లేశం
అంశం : వ్యవసాయం
ఏఓ
దుబ్బాక:

సాక్షి:వ్యవసాయ భూమిలో పెరిగే మొండి జాతి మొక్కల పేర్లు ?

అధికారి:వ్యవసాయ భూమిలో సాధారణంగా మొండి జాతి మొక్కలు తుంగ, గరిక, దర్భ, వయ్యారి భామ మొక్కలు విరివిరిగా పెరుగుతాయి.

సాక్షి:భూమిలో తుంగ ఎప్పుడు పెరుగుతుంది. ఎన్ని రోజుల్లో తీసేయాలి.

అధికారి:మొండి జాతులైన తుంగ, గరిక, దర్భ భూమిలో ఏ కాలంలో నైనా పెరుగుతూనే ఉంటాయి. భూమిని దున్నక ముందు తుంగ మనకు స్పష్టంగా కనిపిస్తుంది. మొండి జాతులను 15 రోజుల నుంచి 20 రోజుల వరకు పెరగనివ్వాలి.

సాక్షి:మొండిజాతులు త్వరగా పెరగడానికి ఏఏ చర్యలు తీసుకోవాలి?

అధికారి:భూమిలో తుంగ మెళ్లమెళ్లగా పెరుగుతుంది. ముందుగా మొండి తుంగను తొలగించే చర్యలు చేపట్టాలి. తుంగ త్వరగా పెరగాలంటే నీటిని పెట్టి త్వరగా పెరిగేటట్లు చేసి భూమిని కలియదున్నాలి.

సాక్షి:మొండిజాతి తుంగలో ఏలాంటి కలుపు నివారణ చర్యలు చేపట్టాలి?

అధికారి:మొండిజాతి తుంగ బాగా పెరిగిన తర్వాత గ్లైఫోసేట్ 41 శాతం ఎస్.ఎల్. అనే మందును ఎకరాకు 2-2.5 లీ. అంటే లీటరు నీటిలో 10 మి.లీ, చొప్పున కలుపు బాగా తడిసేటట్లు పిచికారి చేయాలి. ప్రతి మందు ట్యాంక్‌కు(15 లీ.) పిచికారి చేసే మందు 300 గ్రా. యూరియా కలిపి పిచికారి చేస్తే ఎక్కువ మోతాదులో కలుపు మందును మొక్క పీల్చుకుంటుంది. దీంతో తుంగ త్వరగా చనిపోతుంది.

సాక్షి:రసాయన ఎరువులు కాకుండా సాంప్రదాయ పద్ధతిలో మొండిజాతి మొక్కలు నివారించే పద్ధతులు?

అధికారి:మొండిజాతి మొక్కలు పెరిగిన 10-15 రోజుల తర్వాత రెండు, మూడుసార్లు కలియ దున్నితే తుంగను, వయ్యారి భామను కొంత వరకు నివారించవచ్చు.

సాక్షి:వయ్యారి భామ ఎక్కడ అత్యధికంగా పెరుగుతుంది, కలుపు నివారణ చర్యలేవి?

అధికారి:వయ్యారి భామ బంజరు భూములు, పంటలు లేని ప్రాంతాల్లో అత్యధికంగా పెరుగుతుంది. కలుపు నివారణ చర్యలు సామూహికంగా చేపట్టాలి. ఎందుకంటే ఒక మొక్క నుంచి సుమారు 15 వేల నుంచి 30 వేల వరకు విత్తనాలు వృద్ధి చెందుతాయి. పంట పొలాల్లో వయ్యారి భామ ఎక్కువగా ఉంటే బంతి పంటతో పంట మార్పిడి చేస్తే దీని ఉధృతిని కొంతమేరకు తగ్గించవచ్చు. రసాయన ఎరువులు దొరక్క పోతే పూతకు వచ్చే దశలో 100 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలి.

దుబ్బాకలో చురుగ్గా పారిశుద్ధ్య పనులు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నర్సయ్య

దుబ్బాక టౌన్: పట్టణంలో పారిశుద్ధ్య పనులు చురుగ్గా చేపడుతున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2018లో దుబ్బాక పట్టణాన్ని జాతీయ స్థాయిలో ఉత్తమ గుర్తింపు సాధించేందుకు ప్రజలు తమ వంతుగా కృషి చేయాలని దుబ్బాక నగరపంచాయతీ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పిలుపునివ్వడంతో ప్రజలు భాగస్వాములు అవుతున్నారు. దుబ్బాక నగర పంచాయతీ పరిధిలోని లచ్చపేట, ధర్మాజీపేట, చెల్లాపూర్, దుంపలపల్లి, మల్లాయపల్లి, చేర్వాపూర్ వార్డుల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండటంతో పట్టణంలో పారిశుద్ధ్య పనులు యుద్ధ ప్రతిపదికన సాగుతున్నాయి. ప్రత్యేకంగా ప్రతి ఒక్కరూ ఇంట్లో మరుగుదొడ్లు నిర్మించుకోని ఉపయోగించుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మల,మూత్ర విసర్జన చేయొద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడవేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వాడొద్దని, పారిశుద్ధ్య సైనికులే మన ఆరోగ్యానికి, సంతోషానికి కారణమని వీరికి సహకరిస్తూ స్వచ్ఛ దుబ్బాకను సాధిద్దామని జోరుగా ప్రచారం చేస్తున్నారు.

జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తాం..

స్వచ్ఛ సర్వేక్షణ్-2018లో దుబ్బాక నగర పంచాయతీకి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించేలా కృషి చేస్తాం. ప్రజల మద్దతుతో స్వచ్ఛ దుబ్బాకను తయారు చేసుకుంటాం. బహిరంగ మల విసర్జన రహితంతో పాటు స్వచ్ఛత విషయంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– నగర పంచాయతీ కమిషనర్, నర్సయ్య





గజ్వేల్: గజ్వేల్ నగర పంచాయతీ పరిధిలోని జగదేవ్‌పూర్ రోడ్డు వైపున ఉన్న ఇళ్లపై నుంచి ఏర్పాటు చేసిన హైటెన్షన్ విద్యుత్ వైర్లతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.అధికారులు వీటిని వెంటనే తొలగించాలి.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9010144459

కొంగొత్త ఆశలతో..

- వేడుకలకు సిద్ధమైన పట్టణాలు, గ్రామాలు
- గజ్వేల్‌లో అంబరాన్నంటిన సంబరాలు
- కిక్కిరిసిన మద్యం దుకాణాలు
- మార్కెట్‌లో జోరుగా కేక్స్, గ్రీటింగ్స్, రంగుల విక్రయాలు



తయారైన స్పెషల్ కేకులు

గజ్వేల్: కోటి ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు అంతా సిద్ధమవుతున్నారు. ప్రత్యేకించి యువతలో కొత్త ఉత్సాహం అలుముకుంది. గడిచిన జ్ఞాపకాలకు వీడ్కోలు పలుకుతూ కొత్త ఆశలతో 'న్యూ ఇయర్'లోకి అడుగు పెట్టబోతున్నారు. ఈ వేడుకలకు పట్టణాలు, గ్రామాల్లో భారీగా ఏర్పాట్లు చేసుకున్నారు. ఆనవాయితీ ప్రకారం ఈ ఏడాది కూడా న్యూ ఇయర్



సినిమా థియేటర్ వద్ద చిన్నారుల సందడి



గజ్వేల్‌లో బేకరీల వద్ద న్యూఇయర్ కేక్స్ కొనుగోళ్ల సందడి

సంబరాలను ధూం..ధాం..గా జరుపుకోవడానికి అన్ని వర్గాల ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. సన్నిహితులు, స్నేహితులతో కలిసి విందు, వినోద కార్యక్రమాలకు తెరదీశారు. కొత్త సంవత్సరం నేపథ్యంలో గజ్వేల్ పట్టణంలో సందడి అలుముకుంది. బేకరీల్లో ప్రత్యేక ప్యాకేజీలతో కేక్‌లను విక్రయిస్తున్నారు. కిలో కేక్ రూ. 180, అరకిలో రూ. 90కి అందిస్తున్నారు. వినియోగదారులను ఆకర్షించేందుకు వీటితో పాటు ఉచితంగా కూల్‌డ్రింక్స్‌లు అందజేస్తున్నారు. ప్రతి బేకరీ ముందు ఇందుకు సంబంధించిన ఫ్లెక్సీలు భారీ ఎత్తున వెలిసాయి. ఉదయం నుంచే బేకరీల వద్ద రద్దీ కనిపించింది. మరోవైపు మద్యం దుకాణాలు, నాన్ వెజ్ రెస్టారెంట్లు కిక్కిరిసి పోయాయి. నియోజకవర్గంలోని గజ్వేల్, ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, కొండపాక, మర్కూక్ మండలాల్లోని గ్రామాల్లో సైతం యువత ప్రత్యేక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్ కటింగ్ కార్యక్రమాలు చేపట్టబోతున్నారు.

ఆశాజ్యోతి చిన్నారుల 'ఆట విడుపు'

కొత్త సంవత్సరం సందర్భంగా గజ్వేల్ నగర పంచాయతీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ఆశాజ్యోతి కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న అనాథ చిన్నారులు ఆదివారం సంతోషంగా గడిపారు. పట్టణంలోని సంతోశ్ సినిమా థియేటర్‌లో నగర పంచాయతీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో 'మిడిల్ క్లాస్ అబ్బాయి' సినిమా చూసి కేరింతలు కొట్టారు. 2017 ఏడాది ముగింపు రోజున తమకు ఈ అవకాశం కల్పించిన నగర పంచాయతీ చైర్మన్ భాస్కర్‌తో పాటు ఆశాజ్యోతి సంస్థ ఫాదర్ ఆల్విన్, కోఆర్డినేటర్ వీరబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

చూస్తుండగా గడిచిపోయింది..



జగదేవ్‌పూర్(గజ్వేల్):2017 చూస్తుండగానే గడిచిపోయింది. తహసీల్దార్‌గా ప్రజలకు సేవ చేయడంతో ఏడాది చూస్తుండగా వచ్చేసింది. హుస్నాబాద్ నుంచి జగదేవ్‌పూర్ రావడంతో పాటు సీఎం నియోజకవర్గంలో విధులు నిర్వహించడం సంతోషంగా ఉంది. 2018లో అందరికి శుభం కలగాలి.

–జగదేవ్‌పూర్ తహసీల్దార్, వాణిరెడ్డి

2017ను మార్చిపోలేను..



జగదేవ్‌పూర్(గజ్వేల్):2017 సంవత్సరం నా జన్మలో మరిచిపోలేనిది. సీఎం కేసీఆర్ నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలో వ్యాఖ్యాతగా చేశాను ఎంతో ఆనందంగా అనిపించింది.

–తెలుగు ఉపాధ్యాయులు శశిధర్‌శర్మ

న్యూస్ బాక్స్

కొండపోచమ్మ సన్నిధిలో సునీతమ్మ



జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్‌నర్సాపూర్ గ్రామ సమీపంలో గల కొండపోచమ్మ వారిని మాజీమంత్రి, డీసీసీ అధ్యక్షురాలు సునీతాలక్ష్మారెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మధ్యాహ్నం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు సునీతారెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి చెంతకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాలక మండలి సభ్యులు, అర్చకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2018 సంవత్సరం అంత బాగుండాలని, పాడి పంటలు, ప్రజలు, రైతులు, మహిళలు, పల్లెలు సుఖసంతోషాలతో మంచిగుండాలని మొక్కుకున్నానని అన్నారు. అలాగే 2019లో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ప్రత్యేకంగా మొక్కుకున్నట్లు చెప్పారు. అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు భానుప్రకాష్‌రావు, మురళి పాల్గొన్నారు.

గొల్లకుర్మల సంక్షేమం కోసం కేసీఆర్ కృషి

కొండపాక (గజ్వేల్): గొల్లకుర్మల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రూ. 5 కోట్ల ప్రత్యేక ప్రాకేజీని విడుదల చేస్తున్నట్లు ప్రకటించడంతో ఎల్లప్పుడు రుణపడి ఉంటామని టీఆర్ఎస్వీ నాయకుడు ఎర్రోళ్ల రమేష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లోని కోకాపేటలో గొల్లకుర్మలతో ఏర్పాటు చేసిన సమావేశంలో గొల్లకుర్మల అభివృద్ధి కోసం రూ. 15 కోట్ల ప్రత్యేక నిధి, భవన నిర్మాణానికి 15 ఎకరాల స్థలాన్ని ఇస్తున్నట్లు ప్రకటించారన్నారు. ఇటీవల గొల్ల కుర్మలు ఆర్థికంగా ఎదిగేందుకు సబ్సిడీపై గొర్రెల యూనిట్లు మంజూరు చేశారన్నారు.

మున్నూరుకాపు సంక్షేమానికి కృషి చేయాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సింలు, నాయకులు

గజ్వేల్‌రూరల్ : మున్నూరుకాపు సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ నగర పంచాయతీ అధ్యక్షుడు చంద నర్సింలు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2018 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలపడాలని పిలుపునిచ్చారు. ఐక్యంగా ఉండి ఒకరినొకరు సహకారం అందించుకోవాలన్నారు. పేద, మధ్యతరగతి మున్నూరుకాపులు విద్య, వైద్యం, సేవా రంగాలలో చేస్తున్న కృషిని మరింత విస్తృతపర్చాలన్నారు. కాగా విద్యార్థులను, పేద మున్నూరుకాపులను ఆదుకోవడానికి రాష్ట్ర మహాసభ కాచిగూడ వారి సహకారంతో పుస్తెమెట్టెలు, నోట్‌బుక్స్ పంపిణీ, మెరిట్ అవార్డులు అందించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను మున్ముందు మరిన్ని చేపడుతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహాసభ విద్యార్థి వసతి గృహ ట్రస్టు మెంబర్ ప్రొఫెసర్ మాద్యం వెంకట్‌రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాయకం మల్లయ్య, విష్ణుజగతి, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల నరేశ్‌బాబు, ప్రసాద్, నాయకులు గంగిశెట్టి నర్సింలు, యాదగిరి, నందం, బండ్ల స్వామి, నల్ల నర్సింలు, మల్లేశం, ప్రతాప్ రెడ్డి, గంగిశెట్టి రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

ఫీజులను తగ్గించే ఏర్పాట్లు చేపట్టాలి



గజ్వేల్‌రూరల్: ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు పెంచకుండా ప్రభుత్వం తగ్గించే ఏర్పాట్లను చేపట్టాలి. ఇటీవల తిరుపతిరావు కమిటీ ఇచ్చిన నివేదిక ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు అనుకూలంగా ఉండగా... విద్యార్థుల తల్లిదండ్రులకు శాపంగా మారింది. ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే చొరవ చూపాలి.

–అరవింద్, విద్యార్థి సంఘం నాయకుడు

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో...



మన గజ్వేల్

సాక్షి సిద్దిపేట
సోమవారం | జనవరి | 1 | 2018

వెండితెర



గజ్వేల్:MCA సంతోష్
-11.00,2.00,6.009.00
గజ్వేల్:హలో
(యాదగిరి)-11.00,2.00,6.009.00
దుబ్బాక:హలో
(శ్రీనివాస-11.00,2.00,6.009.00

న్యూస్ బాక్స్

నయా జోష్ వేళ.. పలుగు పార



వర్గల్(గజ్వేల్): వీకెండ్ సండే..న్యూఇయర్ జోష్..డిఫరెంట్ థాట్స్..విభిన్నంగా సెలబ్రేషన్స్..కాని వర్గల్ మండలం అనంతగిరిపల్లి యూత్ మాత్రం విభిన్నంగా ఆలోచించారు. కలిసికట్టుగా శ్రమదానం చేశారు..గ్రామంలోని అంతర్గత వీధులు శుభ్రం చేశారు..పిచ్చిమొక్కలు తొలగించారు..ఇలా రోజంతా పలుగు, పార, తట్ట, బుట్టతో శ్రమదానం చేస్తూ 2018కి వీడ్కోలు పలికారు..వందకు పైగా యువకులు శ్రమదానంలో భాగస్వాములై తమ లక్ష్యం ఎంత గొప్పదో చెప్పకనే చెప్పారు. కాగా ఇక్కడి యువకులు గత 3 వారాలుగా ప్రతి ఆదివారం శ్రమదానం చేసి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా, హరిత గ్రామంగా తీర్చిదిద్దుకుంటామని ప్రతిజ్ఞ చేసిన విషయం తెల్సిందే. చిన్న శ్రమదానం చేసినా ఫొటో ఫోజులిచ్చే ఈ కాలంలో కనీసం పేర్లు కూడా రాయొద్దని యువకులు ప్రాధేయపడడం వారికి తాము చేస్తున్న కార్యక్రమంపై చిత్తశుద్ధిని చాటుతుంది.

దళితులపై దాడి తగదు

కొండపాక (గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాకలో ఇటీవల దళితులపై దాడులు చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని సమాచార హక్కు పరిరక్షణ కమిటీ, ఎమ్మార్పీఎస్, డీవీపీకే, పీడీఎస్ఎఫ్ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాడ్ చేశారు. ఆదివారం దాడిలో గాయపడిన పలువురు ఎస్సీలను పరామర్శిస్తూ సంఘటనకు సంబంధించిన విషయాలను అడిగి తెలసుకున్నారు. ఈసందర్భంగా దళిత సంఘాల నాయకులు జంగిటి శ్రీనివాస్, ఖమ్మంపల్లి యాదగిరి, బాబు మాట్లాడుతూ కొండపాకలో దళితులు రాజకీయంగా ఎదుగుతున్నారన్న అక్కసుతో కొందరు అగ్రవర్ణ రాజకీయ నాయకులు దాడులు చేస్తున్నారన్నారు. సంఘటనపై పోలీసులు చేపట్టిన విచారణను బయట పెట్టి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, కనుకయ్య, జాన్‌రాజ్, ఆనందం, రాంచంద్రం, వెంకటయ్య,బాబు ఉన్నారు.

టమాటా.. పశువుల గ్రాసం



జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్‌లో రైతు బాలకృష్ణరెడ్డి తనకున్నా భూమిలో టమాట సాగు చేశారు. అయితే మూడుసార్లు చేతికొచ్చిన పంటను అమ్మాడు. ఆ సమయంలో టమాటకు ధర అనుకూలంగానే ఉంది. అయితే గతవారం రోజులుగా టమాట ధర తగ్గడంతో టమాట చేనులోనే వదిలేశాడు. మార్కెట్‌లో కిలో రూ.5 పలకడంతో కూలీ ధరలు కూడా రావడం లేదని రైతు వదిలివేయడంతో పశువులకు గ్రాసంగా మారింది. ఈ దృశ్యాన్ని శనివారం సాక్షి క్లిక్‌మనిపించింది.

ఘనంగా ఆవిర్భావ వేడుకలు

గజ్వేల్‌రూరల్:

ఎస్ఎఫ్ఐ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గజ్వేల్‌లోని ఎడ్యుకేషన్ హబ్‌లో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అరవింద్ ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని బాలుర హబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తుందని, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుతుందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అనేక పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, మహేందర్, శివ, యాదగిరి, వరప్రసాద్, సాయి, చరణ్, సంజు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ జెండాను ఎగురవేస్తున్న అరవింద్

ప్రైవేటు యాజమాన్యాలకు వత్తాసు వద్దు

గజ్వేల్‌రూరల్: ప్రైవేటు బడుల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు తిరుపతిరావు కమిటీ గుదిబండలా మారిందని ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రుల ఆరోపించారు. ఆదివారం గజ్వేల్‌లో వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు తగ్గించాలని కోరితే ఫీజుల నియంత్రణపై తిరుపతిరావు కమిటీ వ్యవహరించిన తీరు సరైంది కాదన్నారు. తిరుపతిరావు కమిటీ ఏకంగా ఫీజులు పెంచేందుకు అధికారికంగా ఆమోదముద్ర వేసేందుకు కమిటీ సిఫారసులు చేసిందని దుయ్యబట్టారు. ఫీజులు తగ్గుతాయని ఎంతో ఆశతో ఎదురు చూసిన తల్లిదండ్రులకు నిరాశే మిగిలిందన్నారు. జీఓ-1 లోని నిబంధనలను మార్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు శివారెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్, సురేశ్, కృష్ణ, జీవన్, స్వామి తదితరులు ఉన్నారు.

ఈత, తాటి చెట్ల పన్నుల రద్దుపై హర్షం

కొండపాక (గజ్వేల్):

గీత కార్మికుల సమస్యలను గుర్తించిన ప్రభుత్వం ఈత, తాటి చెట్లకు ఉండే పన్ను విధానాన్ని రద్దు చేస్తున్నట్లు నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమని గౌడ సంఘం మండల అధ్యక్షుడు (సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు) పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని దుద్దెడ శివారులో గల ఎల్లమ్మ దేవాలయం వద్ద గౌడ కులస్తులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడు పెద్దంకుల శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేయనటువంటి ప్రజోపకరమైన పనులను టీఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపుతుందన్నారు. దీంతో ప్రతిపక్ష పార్టీలకు దడపుట్టిందన్నారు. అన్ని కులాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ఈత, తాటి చెట్ల పన్నును రద్దు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు, సహకరించిన మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు, ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

Zone Guide

నేటి నుంచి 'ఈ-పాస్' ద్వారా ఎరువుల విక్రయాలు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లోని అన్ని ఎరువుల దుకాణాల్లో 'ఈ-పాస్' ద్వారానే ఎరువుల విక్రయాలు జరుగుతాయని ఏఈఓ గణేశ్ తెలిపారు. ఎరువులు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు తీసుకుని రావాలని సూచించారు. ఈ విధానం ద్వారా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా రైతులకు మేలు జరుగుతుందన్నారు.

ఎర్రవల్లిలో శ్రమదానం



జగదేవ్‌పూర్(గజ్వేల్): సీఎం దత్తత గ్రామమైన ఎర్రవల్లిలో ఆదివారం లెజెండ్ యూత్ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు, ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం గ్రామంలోని విధులు శుభ్రం చేశారు. చెట్ల దగ్గర ఉన్నా పిచ్చిగడ్డిని తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్య మాట్లాడుతూ స్వచ్ఛ ఎర్రవల్లిలో భాగంగా ప్రతి ఆదివారం శ్రమదానం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు బాల్‌రాజు, భిక్షపతి, పరశురాం, దాసు, శ్రీదర్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



సునీత
అంశం : విద్య
ఏంఈఓ



గజ్వేల్:

సాక్షి: 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఎప్ప టి నుంచి ప్రారంభిస్తారు ?

జవాబు : 10వ తరగతి విద్యార్థులకు జనవరి 2వ తేదీ నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించడం జరుగుతుం ది. ఉదయం, సాయంత్రం స మయాల్లో ఈ తరగతులు కొనసాగుతాయి. అయితే సా యంత్రం సమయాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు స్నాక్స్‌ను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

సాక్షి: ఈ విద్యాసంవత్సరంలో వందశాతం ఫలితాలకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

జవాబు : జిల్లా కలెక్టర్, డీఈఓల ఆదేశాల మేరకు యాక్షన్‌ప్లాన్ అమలు చేయడం జరుగుతుంది. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు అన్ని తరగతుల విద్యార్థులకు బోధనలో ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుంది. విద్యాశాఖ మంత్రి ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి పాఠశాలలో 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధిం స్తాం.

సాక్షి: 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం చేస్తున్నారు ?

జవాబు : 10వ తరగతి విద్యార్థులు నిరుత్సాహానికి గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వారికి ఆరోగ్య పరంగా పాఠశాలల్లో వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు కేరీర్‌గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నాం. అదేవిధంగా విద్యార్థులకు తల్లిదండ్రులకు సూచనలు ఇస్తున్నాం.

సాక్షి: ఫలితాల సాధనకు ఏయే చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు : ప్రతి విద్యార్థికి ముఖ్యంగా చేతిరాతపై అవగాహన కల్పిస్తున్నాం. సబ్జెక్టుల వారీగా ఎలాంటి సందేహాలున్నా వాటిని నివృత్తి చేసేలా ఉపాధ్యాయులంతా సమష్టి కృషితో దృష్టి సారించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు, బహుమతులు ఇస్తాం.



రోడ్కెక్కిన పెంట కుప్పలు



హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ పట్టణంలో కేబీ కాలనీలో రోడ్డుపై పెంట కుప్పలు వేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నగర పంచాయతీ కమిషనర్ స్పందించి పెంటకుప్పలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9490977500

న్యూస్ బాక్స్

నూతన సంవత్సర శుభాకాంక్షలు



సతీశ్‌కుమార్, ఎమ్మెల్యే

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..కొత్త సంవత్సరంలో ప్రజలకు అంతా మంచే జరగాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

జెడ్పీవైస్ చైర్మన్, ఎంపీపీ శుభాకాంక్షలు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ఉమ్మడి మండల ప్రజలకు జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీ భూక్య మంగ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ఉమ్మడి మండలంలో ఇంటింటికీ గోదావరి జలాలు అందుతాయన్నారు. ప్రజలందరు సుఖసంతోషలతో ఉండాలని ఆకాంక్షించారు.

టీఆర్ఎస్ రాష్ట్రకార్యదర్శి శుభాకాంక్షలు..

కోహెడ(హుస్నాబాద్): మండల ప్రజలకు టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, ఎంపీపీ కర్ర శ్రీహరి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ..నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఇంకుడు గుంతల బిల్లులు ఇవ్వరా?

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని మర్మాములలో ఇంకుడు గుంతల బిల్లులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారని మండల కాంగ్రెస్ నాయకుడు డాకురి తిరుపతి రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..ఇంకుడు గుంతలు కట్టుకోవాలని ఇంటింటికి తిరిగి చెప్పిన అధికారులు, బిల్లులు ఇప్పించడంలో మాత్రం విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లబ్ధిదారులకు బిల్లులు చెల్లించకుంటే మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజు, రమేశ్, మల్లయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హ్యాపీ న్యూ ఇయర్



హుస్నాబాద్: అమ్మకానికి సిద్ధంగా ఉంచిన కేక్‌లు



హుస్నాబాద్: పట్టణంలోని ఓ బేకరీ వద్ద సందడి

హుస్నాబాద్: చిందులు, విందులు, వినోదాలు, యువత, చిన్నారుల కేరింతల నడుమ పట్టణ ప్రజలు కొత్త సంవత్సరానికి ఘనంగా ప్రారంభం పలికారు. ఆదివారం అర్ధరాత్రి నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచే బేకరీలు కేక్‌ల కొనుగోళ్లతో సందడిగా మారాయి. పట్టణంలోని ఆరు బేకరీల్లో దాదాపు 5000 కిలోల కేక్‌ల విక్రయాలు జరిగాయి. మాములు రోజుల్లో కిలో కేక్‌కు రూ.200 ఉండగా, న్యూయర్ వేడుకల సందర్భంగా బేకరీల యజమానులు కిలో కేక్‌ను రూ.150కు విక్రయించారు. వివిధ ఆకృతుల్లో తయారు చేసిన కేక్‌లు ఆకట్టుకున్నాయి. రంగు రంగుల ముగ్గులను కొనుగోలు చేసేందుకు మహిళలు దుకాణాల వద్ద బారులు దీరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్ధరాత్రి వరకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల భయంతో మందు బాబులు రోడ్డు ఎక్కే సాహసం చేయలేకపోయారు.

మద్దూరు(హుస్నాబాద్): మండల ప్రజలు కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. మండల కేంద్రంలో పలు దుకాణాదారులు ఇతర ప్రాంతాల నుంచి కేక్‌లు తెప్పించి విక్రయించారు. మహిళలు ముగ్గుల కోసం రంగులు కొనుగోలు చేయడానికి దుకాణాల వద్ద బారులు దీరారు.

కోహెడ(హుస్నాబాద్): మండలంలో నూతన సంవత్సర ప్రారంభ వేడుకలు అంబరాన్నంటాయి. ఆదివారం మండల కేంద్రంలో రంగులు, గ్రీటింగ్, కేక్‌ల కొనుగోళ్లు జోరుగా సాగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గస్తీ నిర్వహించారు.



హుస్నాబాద్ రూరల్: గాంధీనగర్‌లో కేక్ చేస్తున్న చిన్నారులు



మద్దూరు: మండల కేంద్రంలో కేక్ కొనుగోలు చేస్తున్న యువత



కోహెడ: కేక్ కొనుగోలు చేస్తున్న చిన్నారులు

పొదుపు సంఘం ఆర్థిక సహాయం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటపల్లిలో ఇటీవల మృతి చెందిన పర్శరాములు, వెంకటయ్య కుటుంబ సభ్యులకు పురుషుల పొదుపు సంఘం బాధ్యులు భీమా పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.35 వేల చొప్పున అందించారు. సభ్యుల కుటుంబాలకు పొదుపు సంఘం అండగా ఉంటుదన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాజయ్య, నాగబూషన్, సుధాకర్, స్వామి, సంపత్, శ్రీనివాస్ ఉన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న పొదుపు సంఘం బాధ్యులు

లోకల్ వాయిస్

'బ్యాంకు' బాధలు తొలగించండి



హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకులో సరైన సదుపాయాలు లేక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్‌బీహెచ్, ఎస్‌బీఐలో విలీనం కావడంతో ఖాతాదారులకు కష్టాలు మొదలయ్యాయన్నారు. రెండు బ్యాంకుల ఖాతాదారులకు తగ్గట్లుగా స్టాఫ్, సదుపాయాలు లేక గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందన్నారు. బ్యాంకులో స్టాఫ్ పెంచి సదుపాయాలను కల్పించి ఖాతాదారుల ఇబ్బందులు తొలగించాలి.

–గుత్తికొండ విద్యాసాగర్, హుస్నాబాద్

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో...



వెండితెర



వెంకటేశ్వర థియేటర్:
హలో!
(ముల్కనూర్)
అన్నపూర్ణ టాకీస్:
ఎంసీఏ(మిడిల్ క్లాస్ అబ్బాయి)



బురద తెచ్చిన.. 'భగీరథ'..

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని దూల్మిట్టలో భగీరథ పనుల కారణంగా అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. నిర్లక్ష్యంగా పైప్‌లైన్‌లను ఏర్పాటు చేయడంతో నీరు లీకవుతూ బజార్లన్నీ బురదమయం అవుతున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

Zone Guide

నేడు న్యూ ఇయర్ గెట్ టూ గెదర్

హుస్నాబాద్: సోమవారం స్థానిక నగర పంచాయతీ సమావేశ మందిరంలో న్యూ ఇయర్ గెట్ టూ గెదర్ నిర్వహించనున్నట్లు స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీకామారపు విశ్వనాథం రచించిన విశ్వనాదాలు కవితా సంపుటిని ఆవిష్కరించనున్నట్లు చెప్పారు.

శాలివాహన సంఘం వార్షికోత్సవం



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నేత రాజు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని నారాయణపూర్ గ్రామ శాలివాహన(కుమ్మరి) సంఘం ఐదవ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పిడిశెట్టి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రం ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. ప్రపంచ తెలుగు మహాసభలో శాలివాహన కులానికి చెందిన సిద్దప్ప వరకవి ద్వారక తోరణాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గంగధర్ రమేశ్, సర్పంచ్ సుతారి కనకయ్య, తిరుపతి, లింగయ్య, రాజయ్య, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఎస్ఐకి సన్మానం



ఎస్ఐ సంజయ్‌ని సన్మానిస్తున్న పట్టణ కాంగ్రెస్ నేతలు

హుస్నాబాద్: సీఐగా పదోన్నతి పొందిన హుస్నాబాద్ ఎస్ఐ సంజయ్‌ని స్థానిక కాంగ్రెస్ నేతలు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ..సంజయ్ ఎస్ఐగా ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రజల సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించాడని కొనియాడారు. సంజయ్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, నాయకులు కోమటి సత్యనారాయణ, వాల నవీన్, అక్కు శ్రీనివాస్, బొల్లి శ్రీనివాస్, పూదరి శ్రీనివాస్ గౌడ్, మాడిశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంబరాలు

హుస్నాబాద్: టీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని కులాలు, వర్గాల ప్రజల అభివృద్ధికి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి చేయూత అందిస్తోందని నగర పంచాయతీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య అన్నారు. గీత కార్మికులకు రెంటల్ చార్జీ రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం పట్టణంలో కల్లు గీత, గౌడ సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రులు పద్మారావు, హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సుద్దాల చంద్రయ్య మాట్లాడుతూ..గీత కార్మికులది ప్రమాదకరమైన వృత్తి అని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెంటల్ చార్జీలను రద్దు చేయడంతో పాటు గీత కార్మికుడు చెట్టుపై నుంచి పడి మరణిస్తే ఆ కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచిందన్నారు. ఈ నిర్ణయం గీత కార్మికుల కుటుంబాలకు సీఎం కేసీఆర్ ఇచ్చే నూతన సంవత్సర కానుక అని అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్ సహకారంతో గౌడ కులస్తులకు కమ్యూనిటీ భవన్ నిర్మించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ బొలిశెట్టి సుధాకర్, కో ఆప్షన్ సభ్యుడు అన్వర్‌పాషా, పూదరి లక్ష్మీనారాయణ, గౌడ సంఘం నాయకులు ముత్తయ్య గౌడ్, పూదరి శ్రీనివాస్‌గౌడ్, పూదరి వరప్రసాద్, పూదరి చంద్రయ్యగౌడ్, లక్ష్మీనారాయణ, మల్లేశం, నారాయణగౌడ్, అంజయ్య గౌడ్, మహేష్, వెంకటేష్, మొలంగూరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న గౌడ సంఘం నాయకులు

ఇంటర్వ్యూ



కుమారస్వామి
అంశం : స్వచ్ఛ సర్వేక్షన్
నగర పంచాయతీ కమిషనర్

హుస్నాబాద్:

ప్రశ్న: స్వచ్ఛ సర్వేక్షన్ ముఖ్య ఉద్దేశమేమిటి ?
జవాబు: ప్రజలను పారిశుద్ధ్యంపై చైతన్య పరచడం, బహిరంగ మలమూత్ర విసర్జన నివారణ, చెత్త సేకరణ, రవాణా చేయడానికి ఏర్పాట్లు చేయడం స్వచ్ఛ సర్వేక్షన్ లక్ష్యం.
ప్రశ్న: కార్యక్రమంపై ప్రజలకు ఎలా అవగాహన కల్పిస్తున్నారు.
జవాబు: మెప్మా మహిళా సంఘ సభ్యులచే ప్రతీ ఒక్కరూ ఇంట్లో మరుగుదొడ్లు నిర్మించుకొని, వాటిని వినియోగించేలా పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
ప్రశ్న: చెత్త సేకరణ కోసం ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు.
జవాబు: ప్రతి ఇంటికి, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ఆస్పత్రులకు తడి, పొడి చెత్త సేకరణ కోసం రెండు బుట్టలు ఇచ్చి, ఆ చెత్తను వాహనాల ద్వారా తరలిస్తున్నాం.
ప్రశ్న: స్వచ్ఛ సర్వేక్షన్ యాప్ ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి?
జవాబు: పట్టణ ప్రజలు, విద్యార్థులు స్వచ్ఛత యాప్‌ను గూగూల్ ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి.
ప్రశ్న: యాప్ వల్ల ఉపయోగమేమిటి ?
జవాబు: యాప్ ద్వారా ఎక్కడైన పారిశుద్ధ్య సమస్యలు తలెత్తితే ఆ ఫోటోలను ఆన్‌లైన్ ద్వారా పంపితే స్పందించి పరిష్కరిస్తాం.
ప్రశ్న: స్వచ్ఛ సర్వేక్షన్ రేటింగ్‌ను ఎలా నిర్ధారిస్తారు.
జవాబు: పారిశుద్ధ్యానికి 24 అంశాల్లో సర్వే చేసి ఒక్కో దానికి విధించిన పాయింట్ల ప్రకారం రేటింగ్‌ను నిర్ధారిస్తారు.
ప్రశ్న: సర్వే ఎప్పుడు నిర్వహిస్తారు.
జవాబు: కేంద్ర ప్రభుత్వం నియమించిన అధికారుల బృందం జనవరి మొదటి వారంలో పట్టణంలో సర్వే చేస్తారు.

నూతన సంవత్సరంలో మరింత అభివృద్ధి



అశోక్‌రెడ్డి, ఎంపీడీఓ

హుస్నాబాద్‌రూరల్: నూతన సంవత్సరంలో ఊరూర వైకుంఠధామాలు, మహిళ సమాఖ్యభవనాల నిర్మాణాలు పూర్తి చేసి గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ కొత్త అశోక్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వందశాతం మరుగు దొడ్ల నిర్మించిన స్ఫూర్తితోనే వందశాతం పన్నులు వసూలు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారించాలన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కట్కూర్ ,చాపగానితండాలో వారం రోజులుగా పాటు ఏకేవీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శీతాకాల శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి గ్రామ కార్యదర్శి, కళాశాల ప్రిన్సిపాల్ హజరై మాట్లాడారు. విద్యార్థులు సమాజ సేవను అలవర్చుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పల్లెల్లో ఉండే వాతావరణం, సమస్యలు తెలుస్తాయన్నారు. నాయకత్వ లక్షణాలు సైతం పెరుగుతాయన్నారు. చదువుకునే సమయంలో ప్రతీ ఒక్కరూ ఎన్ఎస్ఎస్‌లో చేరాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటుగా సేవాకార్యక్రమాల్లో పాలు పంచుకోవాలన్నారు. గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన గ్రామస్థులను గ్రామ కార్యదర్శి జి.మోహన్ అభినందించారు. విద్యార్థులు భవిష్యత్‌లో మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి శ్రీకాంత్, అధ్యాపకులు సిహెచ్. సంగీత, జీ. ఓదెలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి